# మహావీరచరిత్రము

(మహాకవి భవభూతి నాటకమునకు అనువాదము)

SPECIMEN
for favour of Prescription
for 3ఆ. ఏ.ఓ. Examination.
1959

894.8272
SUR

అభినవ వాగనుశాసన
మల్లాది సూర్యనారాయణశాస్త్రి

أن

# పీఠిక.

★

ఈ నాటకము నిర్మించినభవభూతిమహాకవి జగ మెఱిఁగినబ్రాహ్మణుఁడు. ఇతనినిగూర్చియు నితనికృతులనుగూర్చియు నా సంస్కృతవాఙ్మయచరిత్ర ద్వితీయ సంపుటమునందును, నా సంస్కృతకవిజీవితమందును సవిస్తరముగా విశదీకరించి యున్నానుగావున దాని నిందు సంగ్రహించి తెల్పెదను.

దక్షిణాపథమున విదర్భదేశమందలిపద్మపుర మితనిజన్మస్థానము. ఇపుడు Bedar బీడా రని చెప్పఁబడుచున్న విదర్భను మనప్రాచీనాంధ్రులు వెలనా డని పిలిచెడివారు. అందుచేతనే యక్కడినుండి యీ త్రిలింగదేశమునకు వలసవచ్చిన బ్రాహ్మణులకు విదర్భజు లనియు వెలనాటివా రనియు వాడుకవచ్చినది. ఇతని నివాస మైనపద్మపురమును విదర్భసరిహద్దులును మన కిపుడు నిరూపింప శక్యములు కావు గాని, ప్రస్తావనలో నితఁడు గావించినస్వవంశవర్ణనలనుబట్టి తెలియవచ్చుతైత్తిరీయశాఖీయులు నాపస్తంబసూత్రులు నైన బ్రాహ్మణులునేఁటికిని నాగపుర ప్రాంతమందును, దానికి దక్షిణాగ్నేయదిశలుగా నున్నతెలంగాణాలోను కనవచ్చుచున్నారు గావున, చంద్రపురము లేక చాందాకు దక్షిణముగా గోదావరికి దగ్గఱగా నితనిజన్మగ్రామ మగుపద్మపుర ముండి యుండునని యొకవిధముగా విశ్వసింపవచ్చును. ఇప్పటి తెలంగాణ నాటివిదర్భదేశములోనియాగ్నేయభాగమై యుండునని కొందఱు భావించుట కలదు. ఇదియు, లోకప్రసిద్ధుఁడు నాంధ్రుఁడు నైన కుమారిలభట్టునొద్ద పూర్వమీమాంసాశాస్త్రము చదువుటయు నీ మహాకవి యాంధ్రుఁడన్నప్రతీతిని బలపఱచుచున్నవి.

ఇతనియింటిపేరు, ఉదుంబరంవారు. ఇతనిమొదటిపేరు శ్రీకంఠుఁడు, ముద్దుపేరు ఉంబేకుఁడు. కవిత్వశక్తిచే లభించినపేరు భవభూతి. "తపస్వీ కాంగతో ఒవస్థా మితి స్మేరాననా వివ, గిరిజాయా స్తనౌ వందే భవభూతిసితాననౌ" అని యితఁ డీశ్వరస్తవము చేయఁగా నాఁటివిద్వత్కవు లితనిని భవభూతి యని పిలువఁజొచ్చి రని యొకకథ కలదు.

వేదవేదాంగపారంగతుఁ డైనయీమహాకవి వాల్మీకిమహర్షికి పరోక్షశిష్యుఁడై రామాయణమందలిప్రీతిచే మహావీరచరితము, ఉత్తరరామచరితము ననురెండు నాటకములను, స్వకపోలకల్పితముగా మాలతీమాధవ మనుప్రకరణమును రచి

యించెను. సంస్కృతమహాకవులలో భాసకాళిదాసులకుఁ బిదప నితనివలె గణనకెక్కినకవి యింకొకఁడు లేఁడు. అర్వాచీనకవులలో నితని స్తుతింపనివాఁడు లేఁడు. ఈ విద్వదగ్రణి కానఁ డున్నవిఖ్యాతియే క్రీ. ౭౩౦ ప్రాంతమునం దుజ్జయినీ కాన్యకుబ్జము నేలినయశోవర్మయాస్థానమం దితనిని విద్వత్కవిని గావించినది.

ఈ మహావీరచరిత్రలో కొన్ని విష్కంభములును తృతీయాంకమును రూపకోచితముగాఁ గల్పితము లైనను, ప్రధానకథ యంతయు రామాయణము ననుసరించినదే. ఏడంకములయీనాటకములో నైదవయంకములోని " హంత ప్రత్యుత దారుణం వ్యవసితం ధిక్సఖ్య మేవంవిధమ్" [ఇందు, 84 పుట విమలయశుండు] అనుశ్లోకమువఱకే గ్రంథము నిలిచినది. తరువాతి రెండంకములన్నర గ్రంథము నష్టమైనది. దానిని సుబ్రహ్మణ్యకవియనునర్వాచీనుఁడు పూరించెను. ఆ పూరణముతోడి గ్రంథమే ముద్రణమునకు లభించినది. దీనినిబట్టి యా కాలమున దీనికి వ్యాప్తి తక్కువయని చెప్పవచ్చునుగాని ఒకతంజావూరువ్రాఁతప్రతిలో నున్న "శ్రీవశ్యవాచా భవభూతిమహాకవినా విరచితం మహావీరచరిత మేతావ దేవాస్మి న్దేశే దృశ్యతే. శేషంతు రాజశేఖరేణ దగ్ధమితి ప్రతీతిః"

ఈ మాటలనుబట్టి రాజశేఖరకవి యాగ్రంథమును కాల్చివేసె నన్న యపప్రథమాత్ర మున్నది. ఇదెట్లు పుట్టెనో తెలియరాదుగాని—

"బభూవ వల్మీకభవః కవిః పురా,
తతః ప్రపేదే భువి భర్తృమేంఠతామ్,
స్థితః పున ర్యో భవభూతిరేఖయా,
స వర్తతే సంప్రతి రాజశేఖరః"

అనుచు భవభూతి నీశ్వరునిమూఁడవయవతారముగా వర్ణించినయారాజశేఖరుఁ డట్టిపని చేసియుండు నని విశ్వసించువారుండఁబోరు.

వీరరసప్రధాన మైనయీనాటకము ముద్రిత మైనపిదప నన్నిదేశములలోను పఠనపాఠవ్యవహారమున నెక్కువవ్యాప్తి గాంచిన దనుట సత్యము. దీని నెంతో కాలము క్రిందటనే యాంధ్రీకరించితిని గాని పాఠకలోకమునకు మాత్ర మిపు డర్పింపఁగలిగితిని. సహృదయు లగుపాఠకు లిందలిగుణము గ్రహించుటయే నా కృషికి ఫలము.

ధవళేశ్వరము.
సర్వధార్యాషాఢ పూర్ణిమ

మల్లాది సూర్యనారాయణశాస్త్రి.

894.823 SUR
SPECIMEN
for favour of Prescription
for 3yr. D.C. Examination.
1959

ఓన్నమః పరబ్రహ్మణే

# మహావీరచరిత్రనాటకము

## ప్రథమాఙ్కము

ప్రస్తావన.

గీ. ఆదిమధ్యాంతములు లేనియవ్యయంబు
పూర్వపరభేద మెఱుఁగనిపుణ్యతేజ
మఖిలవిజ్ఞానభాసకం బాత్మనిష్ఠ
మైనదివ్యపరంజ్యోతి నభినుతింతు.

(నాంద్యంతమున)

సూత్రధారుఁడు—(ప్రవేశించి)

చ. పురుషవిశేషలక్షణవిభూషిత నాయక ముజ్జ్వలార్థసం
భరితగభీరభీషణసుభాషిత ముత్తమపాత్రవర్తన
స్ఫురదఖిలాంగవీర మయి సొం పగునాటక మాఁడు మంచు నా
దరమున నానతిచ్చిరి సదస్యు లహో యిది భాగ్యమే కదా!

దీనినిబట్టి మహావీరచరిత్ర మభినయింపఁ దగు నని విదితమైనది, మహా
నందము.

గీ. కావ్యమా, పశ్యవాక్కవి కల్పితంబు
వస్తువా, జానకీరామ వల్లభంబు
సభ్యులా, వాక్యరస విమర్శనసమర్థు
లన్నియును జక్కఁగా సిద్ధమయ్యె మనకు.

కావున రూపకాభినయసందర్శమునకు విచ్చేసినపెద్దల కిట్లు విన్నవింతును. పూజ్యులైనయోసామాజికులారా; దక్షిణాపథమండలి పద్మపురమున నివసించినవారును కాశ్యపగోత్రులును పంచాగ్నులును వేదశాస్త్రవేత్తలును తైత్తిరీయులును సోమపీథులును బ్రహ్మవాదులు నైన ఉదుంబరులను బ్రాహ్మణోత్తములు కలరు. వారిలో వాజపేయయాజియగు మహాకవికిఁ బౌత్రుని పౌత్రుఁడును లోకప్రసిద్ధి గాంచినభట్టగోపాలునికిఁ బౌత్రుఁడును పవిత్రకీర్తియగు నీలకంఠపండితునికిని జతుకర్ణీదేవికిని బుత్రుఁడును, అన్వర్థనామధేయుఁ డగు జ్ఞాననిధికిఁ బ్రియశిష్యుఁడును పదవాక్యప్రమాణజ్ఞుఁడు శ్రీకంఠ నామధేయుఁడు భవభూతిబిరుదాంకితుఁడు నగుమహాకవి సంస్కృతమున నిర్మించిన మహావీరచరిత్రమను రామకథానాటకమును హారితసగోత్రాపస్తంబసూత్రాధీతసకల తంత్రరామస్వామిశాస్త్రిపౌత్రుఁడును వేదవేదాంత జ్ఞాని శ్రీరామావధానికిని సాధ్వీమతల్లియగు వెంకమాంబకును బుత్రుండును చర్లబ్రహ్మశాస్త్రి గురువరకరుణాధీతపాణినీయుఁడు నగు మల్లాది సూర్యనారాయణశాస్త్రి యాంధ్రీకరించెను. దాని నిపుడు ప్రదర్శింపఁబూనినాము. సావధానముగాఁ జిత్తగింపుఁడు.

నటుఁడు—(ప్రవేశించి) ఆర్యా! వీరరసప్రధానంబు నద్భుతాద్యంగరసశోభితంబు నయిన మహావీరచరిత మభినయింపఁ బారిషదు లాదరంబున ననుగ్రహించి యీరూపకం బపూర్వంబగుట ముందుగా గథాంశం బాలకింప నభిలషించుచున్నారు.

సూత్ర—యజ్ఞ మొనర్పఁ బూనినవిశ్వామిత్రమహర్షి వసిష్ఠమహాముని శిష్యుఁ డైన దశరథమహారాజును జూడ వచ్చి మరలఁ దనతపోవనమునకుఁ బోవుచు—

గీ. జయకరం బగువీర్య మన్త్రములఁ బెంప
భూతలక్షేమబీజంబు సీతఁ గూర్ప
రావణుని జంపి పేరొందఁ బోవు రాముఁ
దోడుకొనిపోయి తమ్ముండు తోడుగాఁగ.

గీ. "ఒక్కమా ఱిందు వచ్చి పొమ్మో మహీంద్ర!"
యని పిలువ నంపె మిథిలేశు, నతఁడు యాగ
మునకుఁ బూనుటఁ బంపించె ననుజు, నాతఁ
డల్లదే వచ్చుచుండెఁ గూఁతుళ్ళతోడ.

(అని నిష్క్రమించిరి)

ఇది ప్రస్తావన

[ అంత రథారూఢులై కుశధ్వజుఁడును సీతోర్మిళలును బ్రవేశించుచున్నారు ]

కుశ—అమ్మా జానకీ! కుమారీ! ఊర్మిళా! పూజ్యుఁడైన యీవిశ్వామిత్రమహర్షికి మీరు మిక్కిలి శ్రద్ధతో నమస్కరింపవలెను జుఁడీ

కన్యలు—మీ సెలవు ప్రకారమే చేయుదుము

కుశ—ఇతఁడు తక్కినమునులవంటివాఁడు కాఁడు, అసాధారణుడు.

గీ. తలఁప నాల్గవయగ్నిహోత్రం బితండు
విశ్వసింపఁగ నైదవవేద మితఁడు
తెలియ సాచార మొనరించుతీర్థ మితఁడు
కనఁ దనువు దాల్చుధర్మసూక్ష్మం బితండు.

సూతుఁడు—సాంకాశ్యనాథా! నిజము చెప్పితివి. ఇతఁడు త్రిశంకు స్వర్గము నిర్మించె ననియు శునశ్శేఫుని ప్రాణము రక్షించె ననియు రంభను స్తంభింపఁజేసె ననియు నితిహాసజ్ఞులు చెప్పుచుందురు. మహాత్త్వమునం దితనిని మించినమునీంద్రుఁడు లేఁడనుట సత్యము.

చ. అనఘతపోనిధానము తనంతన బ్రాహ్మణుఁ డైనయోగి శాం
తిని గను మంచు వేల్పులు నుతించినధీరుఁడు సర్వవిద్యలం
దనరినవేత్త యీగురుఁడు తా నయి మీపను లెల్ల గూరిమిం
గనుఁగొనునంతభాగ్యమును గాంచినమీరె గృహస్థు లెంతయున్.

కుశ—మేలుమేలు సూతా! సత్యసంధులును బ్రహ్మసాక్షాత్కారము గాంచినవారు నగునిట్టిమహర్షులతోడిపరిచయము సర్వశ్రేయోదాయక మగుట యబ్బురమా?

చ. ఒకపరి తాపసోత్తముల నూరక కన్గొని పల్కరించుచో
సకలతమోవికారములు జాఱును శాంతి లభించు నాఁగ నిం
కొకపరి వారితోఁ గలసి యుండుట పల్కుట యబ్బెనేని నై
హికపరలోకసౌఖ్యముల కేమికొఱంత? యనంతపుణ్యసా
ధకములు సుప్రసన్నులగుతత్త్వవిచారులసత్ప్రసంగముల్.

సూతు—అదిగో కౌశికమహర్షి సిద్ధాశ్రమము. కౌశికీనది నంటి పచ్చని కాననప్రదేశంబులనడుమ నది యెంతమనోహరముగా నున్నదో! (అటుచూచి) ఇంక మనమాటల కవకాశ మెక్కడిది? అదుగో మహర్షి యిద్దఱు బాలురతో నిజముగా నీకోసమే యెదురువచ్చుచున్నాఁడు.

కుశ—అయితే రథము దిగుదము. (పిల్లలతో దిగి) సూతా! మనపరిచరు లెవ్వరు నీయాశ్రమముపొంతఁ బోఁగూడదు సుమీ! వాళ్లతో గట్టిగాఁ జెప్పు.

సూత—అట్లే చెప్పెదను (అని రథముతో నిష్క్రమించెను)

[ తరువాత రామలక్ష్మణులతోఁ బ్రవేశించి ]

విశ్వామిత్రుఁడు—(తనలో)

ఉ కలుగఁగ మేలు, కీడు తొలగఁగ సుదినంబున ముందు సద్విధుల్
సలుపుట వెన్క రామునికి జానకి నిచ్చుట పెండ్లిచేయు టా

వల మనయజ్ఞదీక్ష యటుపైని జగంబులఁ బ్రోవ రాముఁడై
వెలసినచక్రిబీరములు వేడుక యంతయు వీటికే కదా!

(ప్రకాశముగా) యజ్ఞదీక్షలో నుండుటచే రాఁజాలఁ డని తెలిసియు సీతోర్మిళలతోఁ గుశధ్వజుని బంపునుగదా యని యూహించి శిష్టాచారమునుబట్టి నాయజ్ఞసంకల్పము నాఁటికి రావలసిన దని జనకునికి వర్తమాన మంపితిని. ప్రియమిత్రుఁ డయినయాతఁడు నట్లు గావించెను.

రామ, ల—అయ్యా! మీవంటివారుకూడా యెదురుగా వెళ్ళి తీసికొని రాఁదగినయీమహాత్ముఁ డెవ రండీ!

విశ్వా—విదేహదేశాధీశ్వరులును నిమివంశసంభూతులు నగురాజర్షులనఁ గూర్చి మీరు వినియుందురు. వారిలో యాజ్ఞవల్క్యుని శిష్యుఁడై శుక్లయజుర్వేదము సాంగముగా నధ్యయనము గావించినసీరధ్వజుఁ డిప్పటివిదేహచక్రవర్తి.

రామ, ల—ఓహో! శివధనుస్సు నింటఁ బెట్టుకొని పూజించునతఁడా?

విశ్వా—ఔను.

రామ, ల—వారియింటిలో, అయోనిసంజాతు రాలైనకన్య యున్న దని వినవచ్చునే! ఎంత వింత!

విశ్వా—ఔను నిజమే, ఉన్నది. ఆజనకచక్రవర్తి యిపుడు యజ్ఞదీక్షలో నుండి నాయాగసంకల్పసమయమునకు రాఁజాలక తమ్ముఁడైన కుశధ్వజుని బంపించెను. అతఁడే యితఁడు. వేదపండితుఁడైన యీరాజన్యునియెడ మీరు వినయము చూపఁదగును.

రామ, ల—చిత్తము చిత్తము.

కుశ—(ముందు చూచి) ఎవ రీపిల్లలు? వేష మంతయుఁ జూడఁగా క్షత్రియబ్రహ్మచారులుగాఁ గనఁబడుచున్నారు. అహా! యెంత చక్కఁగా నున్నారు!

చ. కలసినకంకపత్రములఁ గ్రాలుశరంబుల నిండుతూణముల్
పొలుపగు రెండుప్రక్కల, విభూతి యలందినఱొమ్ములందు భా
సిలు రుచిరైణసూత్రములు, చేతుల విండ్లును రావిదండముల్,
మొలపయి పచ్చదోవతులు పొందగు మౌంజుల నల్లెత్రాడులన్.

కన్యలు—(తమలో) వీరు కన్నులకు హాయిగా నున్నారు.

కుశ—(సమీపించి) మునీంద్రా! నమస్కారము.

విశ్వా—నాయనా! చిన్నవాఁడవు. దూరప్రయాణము చేసి సుఖముగా వచ్చినావు సంతోషము. ఏదీ! ఒక్కమాఱు కౌఁగిలించుకోనీ! (అని యట్లుచేసి) యజమానుఁ డయినమీయన్న జనకమహారాజు సుఖముగా నుండెనా? మీపురోహితుఁడు శతానందుఁడు కుశలముగా నున్నాఁడా?

కుశ—ఆ! మీదయవల్ల. వారిగృహకృత్యవ్యాపారమును మీరు పూనికొని యుండఁగా, అన్నగారిసౌఖ్యమునకు లోటేమి?

కన్యలు—తాతగారూ! నమస్కారము.

కుశ—గీ. జన్మమున కంచు భూమిని జనకవిభుఁడు
దున్న నెడఁ బుట్టినట్టియీకన్నె సీత,
జనకభూపాలునౌరసతనయ యగుచు
నెలయు నీచిన్నకన్నె యూర్మిళ, మునీంద్ర!

విశ్వా—మీయిద్దఱికి శుభం బగుఁగాక.

లక్ష్మ—(జనాంతికము) అన్నా! ఈపెద్దపిల్లపుట్టుకకంటె నాశ్చర్యము వేఱేముండును.

రామ—(తనలో) క. జననంబా, యజ్ఞావని
జనకుండా, బ్రహ్మవాది జనకుఁడు, చక్కం
దనమా, కన్నులపండువు
కనుకనె మది నెయ్యమొదవెఁ గన నీకన్నెన్.

కుశ — మహర్షీ! ధర్మముతో వచ్చుప్రతాపపరాక్రమములవలె మీతో
వచ్చినయీక్షత్రియకుమారు లెవరు? వీరినామధేయము లేమి?

విశ్వా — వీరు దశరథపుత్త్రు లగురామలక్ష్మణులు.

రా. ల — (సమీపించి) గురూత్తమా! నమస్కారము.

కుశ — (కౌఁగిలించుకొని) భాగ్యవశమున దశరథనందనులఁ గాంచఁ
గలిగితిని.

గీ. వీరిజన్మంబులకు రఘువీరవంశ
మొక్కటే తగుఁ గాని వేఱొండు తగదు,
చంద్రకౌస్తుభమాణిక్యజన్మములకుఁ
బాల్కడలి తక్క వే ఱొండువనధి తగునె?

1 దశరథమహారాజు శ్రమ కోర్చి ఋశ్యశృంగమహర్షి నారాధించి యతనియాశీర్వచనంబున సకలసద్గుణసమేతులు తేజశ్శాలులు నగు నలువురుపుత్త్రులఁ గాంచె ననియు వేదవేదాంగధనురాదివిద్య లభ్యసించినయాకుమారులు బుద్ధిబలదేహబలపరాక్రమంబులు పారంబు గాంచఁ గోరి బ్రహ్మచర్యము జరుపుచున్నా రనియుఁ గర్ణామృతముగా విని యున్నాము. కుమారులారా! మీకు సకలశ్రేయంబులు కలుగుఁగాక. ఇది లోకాచారము ననుసరించినదీవన గాని, మీవంశమువారికి లోకోత్తరములైనవీర్యాదిసుగుణంబులు సహజసిద్ధంబులు కదా!

గీ. వంశమా సూర్యవంశంబు, వంశకర్త
మనువు, గురువు వసిష్ఠుండు మనుజపాల

---

1. గీ. దశరథుఁడు ఋశ్యశృంగునాదరము గాంచి
కనియె నల్వురుకొడుకుల ననియు, వారు
శాస్త్రవిహితంబుగా బ్రహ్మచర్యదీక్ష
నాచరించుచు నున్నవా రనియు వింటి.

సాధికారంబు శాశ్వతం, బట్టిమహిమ
నలరుమీకీర్తి వర్ణింప నగునె నాకు?

విశ్వా—అట్లు కాదు.

క. సతతము పుణ్యవ్రతములు
క్రతువులు నొనరించి కీర్తి గడియించుచు నీ
న్నతి గన్నవిదేహమహీ
పతులే మనువంశజ స్తవంబున కర్హుల్.

(అందఱును, కౌశికునిపర్ణశాలవంక నడతురు)

విశ్వా—మన మీవికంకతవృక్షచ్ఛాయ నించుక సేపు విశ్రమింతము.

[అందఱు కూర్చుందురు] తెరలో—

జయము జయము రామచంద్రా! జయము.

[అందఱు నాశ్చర్యపడి చూతురు]

కుశ—మునీంద్రా! ఆదివ్యవనిత యెవరు?

విశ్వా—ఉచథ్యమహర్షి కొడుకైన గౌతమునిధర్మపత్ని, శతానందునితల్లి, అహల్య. ఇంద్రుఁ డొకమా టామెను గలసెను. అందుకే యతని నహల్యాజారుఁ డందురు. అపుడు గౌతముఁడు కోపగించి పాషాణమై పడియుందువుగాక యని భార్యను శపించెను. ఇపు డీరామచంద్రునిపాదధూళి సోకినంత నామె పాపవిముక్తురాలై పూర్వదేహము తాల్చినది.

కుశ—ఏమీ! ఈసూర్యవంశబాలుఁ డెంతటిమహామహిమసంపన్నుఁడు?

సీత—(ఆశ్చర్య మనురాగము నుప్పొంగ రాముని జూచి అపవారించి) ఈచక్కనిశరీరసౌష్ఠవంబున కాయనుభావము తగియున్నది.

కుశ—(తనలో) గీ. హరునివి ల్లెక్కుపెట్టుట యనుచు వెనుకఁ
ద్రిప్పఁగా రానిపణము విధింపకున్న
నిజము మాయన్న యీశౌర్యనిధికి రామ
చంద్రునికి నిచ్చితీరు భూజాత సీత.

తాపసుఁడు—(ప్రవేశించి) రావణపురోహితుఁడైన సర్వమాయుఁ
డను వృద్ధరాక్షసుఁ డొకఁడు రాజకార్యవశంబున మిమ్ము దర్శింప
వచ్చియున్నాఁడు.

కన్యలు—ఏమిటీ! రాక్షసుఁడు!

రా. ల—పరమసంతోషము.

కుశ. విశ్వా—వానిని రానిమ్ము. (తాపసుఁడు వెళ్ళెను)

రాక్షసుఁడు—(ప్రవేశించి)

గీ. తగదు వద్దని తనదుమాతామహుఁడగు
మాల్యవంతుండు కడు బ్రతిమాలుకొన్న
వినక మారాజు సీత నిమ్మనుచు జనకు
నడిగి రమ్మని మిథిలకు నంపె నన్ను.

యాగదీక్షలో నున్నయాతేని నచ్చటఁ జూచి యతనిమాటనుబట్టి కౌశి
కకుశధ్వజులఁ జూడ నిచ్చటికి వచ్చితిని (పరిక్రమించును)

(రాముఁడు సీతనుగూర్చియు, లక్ష్మణుఁ డూర్మిళనుగూర్చియుఁ దమలో)
ఏమిది? అమృతవర్తివలె నీకన్నె నాకన్నులకు హాయి గొలుపు
చున్నది.

(సీత రామునిగూర్చియు, ఊర్మిళ లక్ష్మణునిగూర్చియుఁ దమలో) నాక
న్నెంతసేపు నితనిఁ జూచి యానందింపఁ గోరుచున్నది. ఏమిది?

రాక్ష—(సమీపించి) ఈసౌందర్యరాశియే సీత యగును. సెబాసు!
లంకేశ్వరునియత్నము తగును.

కుశ, విశ్వా—రమ్ము కూర్చుండుము.

గీ. నెత్తిమీఁదికిరీటంబు నెత్తి మీఁది
కేవిభుని యానతిని శిరసా వహించుఁ
బాకశాసనుఁ డాలోకభీకరుండు
పంక్తికంఠుఁడు కుశలియై పరఁగునొక్కొ?

రాక్ష—మా ప్రభువునకుఁ గుశలము. ఆమహారాజు మీతో నిట్లు మనవి చేయు మనెను.

మ. అలరున్ మీగృహమందు దయోనిజము కన్యారత్న, మే నర్థి, నెం
దులరత్నంబులు నింద్రునిం దలఁగి నన్నుం జేరుఁ, గా కెట్టు లే
దిలఁ గన్యామణి యన్యసామ్మె కద! నా కీ నేర్చి చుట్టాలమై
వెలయుం గోరఁ దగున్ బులస్త్యపులహుల్ వియ్యంకులై యొప్పఁగన్

సీత—(తనలో) అయ్యో! అయ్యో! రాక్షసుఁడు నన్నుఁ గోరుచుండెనా?

ఊర్మి—(జనాంతికము) అయ్యో! ఇదెక్కడిగోడ వమ్మా!

(రాజవిశ్వామిత్రు లాలోచించుచున్నారు)

లక్ష్మ—(జనాంతికము) అన్నా! అసుర నాయకుఁ డీదేవి నడుగుచుండెనఁట! వింటివా?

రాము—తప్పేమి?

గీ. అందఱుం గోరఁగా నర్హ యగుటఁ గన్య
నిమ్మనుచుఁ గోరు జంకక యెట్టిఁడైన,
నట్టిచో సర్వలోకజయావహుండు
బ్రహ్మమునిమనుమండు కోరంగఁ దగఁడె?

లక్ష్మ—అన్నా! నీసౌజన్యమునకు మితి లేదు గదా! సహజశత్రువైన యానిశాచరునెడ గౌరవమా?

గీ. అఖిలనిగమోక్తమార్గంబు లణఁగఁద్రొక్కి
క్షాత్రతేజంబు నింద కాస్పదముఁ జేసె
మహితయశుఁ డైనయనరణ్యు మట్టుపెట్టి
సూర్యవంశంబునకుఁ దెచ్చె దుర్యశంబు.

రాము—శత్రు వగుటచే వధ్యుఁ డగునుగాని మహాశూరుండును బహుతపశ్శాలియు నైనయతఁడు సామాన్యుఁ డని మాత్రము తలంపరాదు.

లక్ష్మ—వీరపురుషధర్మములు విడనాడినవానివీరత్వ మెట్టిది?

రాము—అట్లుకాదు.

చ. చదివియు బ్రహ్మవంశమున జన్మముఁగాంచియు ధర్మమార్గమున్
వదలుట దోష మైనఁ, దలఁపం దగ దయ్యది వేయుమాటు, మొం
దొందవును సర్వసద్గుణము? లోకమహాత్మ విలాసదాంతవ
ద్వదనుని దక్క నెల్లర నడంచినవానికిఁ బోల్కి యున్నదే?

రాక్ష—ఏమండీ! ఏమి టాలోచించుచున్నారు?

ఉ. ఎందలిపోటుగంటు లమరేంద్రునివజ్రిపుముక్క లంట నిం
పొందెడు? మొక్క వోయె విబుధోత్తమునేనుఁగు గొమ్ము లెందు ?సా
పందెడు నెందు నందనసుమావళి? యాజగదేకవీరుఁడా
మ్మంది సుఖించుఁ గాక వసుధాత్మజ కూరిమి వీరలక్ష్మి నాన్.

(తెరలో కలకలము)

కుశ—మునినాథా! యజ్ఞమునకు మీరు పిలిచినమహర్షు లందఱు నెల్ల దిక్కులనుండి సపుత్రకళత్రముగా వచ్చుచున్నారు. వారిపసిపిల్లల యాక్రందనముతోడి దీకలకలారావము.

(అందఱు లేచుచున్నారు)

లక్ష్మ—భూషణంబులుగా ధరించినపుఱ్ఱెలదండలచప్పుడు చదలంటఁ ద్రాగి క్రక్కి నెత్తురు తనువెల్ల నిండ నుదరోభారంబున నించుక వంగి భయంకరాకారముతో వచ్చుచున్నయీరాక్షసి యెవతె?

విశ్వా—ఇది సుకేతునికూఁతురు, సుందాసురునిభార్య, మాయావి యైన మారీచునితల్లి తాటక.

కన్యలు—నాన్నగారూ! దీనిరూపము భయంకరముగా నున్నది.

కుశ—భయపడకండి. తల్లీ! భయము లేదు.

విశ్వా—(రామునిగడ్డము పట్టుకొని) నాయనా! దీనిని జంపివేయుము.

సీత—అక్కటా! ఈపని కీయన నే నియమించినారా?

రాము—స్వామీ! ఆఁడుది కదా!

ఊర్మి—అక్కా! విన్నావా?

సీత—(సవిస్మయానురాగముగా) వధకంటె వేఱొకవిధము లేదాయని యభిప్రాయము.

కుశ—మేలు మేలు, నిజముగా రామభద్రుఁ డిక్ష్వాకువంశమునకుఁ దగినవాఁడు.

రాక్ష—(తనలో) ఇతఁడా దశరథునికొడుకు రాముఁడు?

గీ. గొప్పయుత్పాతమ ట్లున్న ఘోరరూపఁ
దాటకం జూచి భయ మన్నమాట లేక
దాని వధియింపు మని గురుం డానతీయ
నాఁడుది యటంచు జంకుచున్నాఁ డితండు.

విశ్వా—కుమారా! త్వరపడుము, అదిగో, ఎదుట నారక్కసి చేయు బ్రాహ్మణజనహింస చూచితివా?

రాము—గీ. సర్వదోషవినాశనక్షమము ధర్మ
సత్యసమ్మత మామ్నాయసన్నిభంబు
పుణ్యపాపప్రమాణం బపూర్వఫలము
దేశికోత్తమ! యుష్మదాదేశ మరయ.

(అని వెడలును)

సీత—వెడలెనా? అయ్యో! కష్టము! ఆవ తమ్మెరా లుత్పాతవాతోద్ధళితలై నీమహానుభావున కెదురుగాఁ బరుగెత్తుకొని వచ్చుచున్నది.

కుశ—(ధను వెక్కుపెట్టి) దుర్మార్గురాలా! ఉండు ముండుము.

ఊర్మి—అక్కా! చిన్ననాయనగారు స్వయముగా బయలుదేఱిరి.

లక్ష్మ—(నవ్వి) అయ్యా! మీరు తాటకగతి చూడండి.

గీ. ఆరొమ్ము గుఱిచేసి యేసినయమ్ము తగిలి
తనువు పగులంగ ముక్కురంధ్రములనుండి
కాలువలు గట్ట నెత్తురు గాఱుచుండ
నసువులు తొఱంగి తాటక యవనిఁ బడియె.

కన్యలు—సంతోషము సంతోషము.

కుశ—ఆహా! ఏమీ రాజపుత్రునిశరచాతురి!

రాక్ష—ఆర్యా! తాటకా! ఎంతపని జరిగినది! నీట నానపకాయలు మునుఁగుచున్నవి. రాళ్ళు తేలుచున్నవి.

చ. అసురవిభుప్రభావము నిరర్థక మై చనె నిప్పు డక్కటా!
ప్రాసఁగెఁ బరాభవంబు నరపోతకృతం బిపు డద్భుతంబుగా
నసువులఁ బాసెఁ దాటక నిరాగస నేఁ గనుచుండగా నిసీ!
ముసలితనంబు దైన్యమును ముట్టిన నే నిపు డేమి చేయుదున్?

విశ్వా—(తనలో) సర్వ రాక్షస సంహార వేదాధ్యయనమున కిది యోంకారము.

రాక్ష—ఏమండీ! బదులుమాట చెప్ప రేమి?

విశ్వా—ఓయీ! ఈకుశధ్వజుఁడు చిన్నవాఁడు. ఈకన్నెకుఁ దండ్రియుఁ బెద్దవాఁడు రాజు నైనసీరధ్వజుఁడు ప్రతివచనము చెప్పఁ దగినవాఁడు.

రాక్ష—కుశధ్వజవిశ్వామిత్రుల నడుగ మని యతఁడు చెప్పెనుగదా!

విశ్వా—(తనలో) రామునకు దివ్యాస్త్రము లొసంగ నిదే సమయము (ప్రకాశముగ) సఖా కుశధ్వజా! గురుకులవాసంబు చేసి కృశాశ్వునియనుగ్రహంబున నేర్చిన జృంభకాస్త్రప్రయోగసంహార సహితంబు సరహస్యంబు నైనదివ్యాస్త్రసంతతి నాప్రసాదమున సశబ్దార్థంబుగ రామభద్రునికిఁ బ్రత్యక్ష మగుఁగాక.

గీ. మున్ను బ్రహ్మాదిగురువులు భువనహితము
గోరి వేన్వేళ్ళు పొనరించి ఘోరతపము
జపతపస్సిద్ధనైజతేజఃప్రభావ
మనఁగఁ గనఁగొనిరి జృంభకాస్త్రచయము.

కుశ—రఘుకుల మనుగ్రహింపఁబడినది.

లక్ష్మ—ఆహా! దేవతలయనుగ్రహంబున నందు దేవదుందుభులు మ్రోఁగుచున్నవి. ఇందు పుష్పవర్షము కురియుచున్నది.

రాక్ష—ఔరా! నాకవాసులుఁగూడా లంకేశ్వరునికిఁ బ్రతికూలముగా నడచుచున్నారు.

లక్ష్మ—ఆహా! ఏమిది?

చ. దెస లభితప్తహేమరసదీప్తములట్లు వెలుంగు, నిప్పు డిం
పొసఁగు దినంబు సాంధ్యరుచి నొప్పినయట్లు పిశంగవర్ణమై,
యొసఁగు నభంబు కేతుతతి యెల్లెడఁ గూర్చినయట్లు మించులన్
మిసమిసలాడునట్లు జిగి మించినదివ్యతరాస్త్రసంతతిన్.
గీ. సౌరతేజంబు దిగఁద్రొక్కి సర్వదిశల
మెఱయునస్త్రద్యుతులు మిఱుమిట్లుగొలుపఁ
జంచలం బయి వస్తువిజ్ఞానశక్తి
విడుచుచున్నది కన్గవ వింత గాఁగ.

కన్యలు—మెఱపుఁదీఁగలట్లు ధగధగ మెఱయుచు నలుఁగడలఁ గ్రమ్మిన యీయస్త్రకాంతులను గన్నులు భరింపఁ జాలకున్నవి.

రాక్ష—ఆహా! చూడ శక్యముగాకున్న దీదివ్యాస్త్రతేజము! క్రమక్రమంబుగఁ బోగుపడుచున్నయిది రావణపురందరద్వంద్వయుద్ధమును స్మృతికిఁ దెచ్చుచున్నది. అది యెట్లన?

చ. అమరవరేణ్యుఁ డేసినశతారము రావణుఱొమ్ము దాఁకి ఖం
డము లయి మింటి నల్లడ ననంతతటిల్లతలట్లు తోఁచి చి

తీవ్రముగ వెలింగె నిక్కరణిఁ, దద్విబుధారిముఖాగ్నిధూమ్రవ
ర్ణము లగునట్టహాసములరాఝడి యీగతి నుండె నయ్యెడన్.

విశ్వా—రామభద్రా! దివ్యాస్త్రములకు నమస్కరింపుము.

గీ. బ్రహ్మరుద్రాదిదేవతపఃఫలములు
మహిమసంపన్నము లథర్వమంత్రమయము
లైన యీయస్త్రములు, వీనియందు నొక్క
టొకటియు జగంబు నోమంగ నోర్వఁజాలు.

(తెరలో)

గీ. గురువరా! వందనము, చిన్నకోర్కె యొకటి
మనవిచేయుచునున్నాఁడ వినుము కరుణ,
నీయమోఘాస్త్రములసంప్రదాయ మేను
దెలిసినట్టులు సౌమిత్రి తెలియుఁగాక.

విశ్వా—కుమారా! నీకోరిక సిద్ధించును.

లక్ష్మ—గీ. ధన్యుఁడ మహాప్రసాదంబు తాపసేంద్ర!
దివ్యశస్త్రాస్త్రవిద్య ప్రాప్తించుకతన
బుద్ధి వికసించు శక్తియు వృద్ధి నొందు
నాదుమహిమంబు వెలయు వన్దనము లయ్య!

(తెరలో)

క. రామ మహాబాహుబలా!
మే మింక భవదాజ్ఞలోన మెలఁగవలెను వి
శ్వామిత్రునియానతి యిది,
సౌమిత్రిం గూడి మమ్ము శాసింపఁ దగున్.

కన్యలు— ఆహా! ఆశ్చర్య మాశ్చర్యము అస్త్రదేవతలు మనవిచేయు
చున్నారు.

(తెరలో) ఓదివ్యాస్త్రరాజంబులారా!

క. రాముఁడు కృతార్థుఁ డయ్యెను
మీామర్మము తెలిసి విశ్వామిత్రుం డగుచు వి
శ్వామిత్రునిచేఁ బొం దిఁక
మీామాటం దలఁప రంచు మీాకు జోహారుల్.

లక్ష్మ—ఆర్యునియానతిచే నస్త్రనికాయ మంత్ర్వాత్త మైనది

కుశ—మహాత్మా! అద్భుతనిధానా! కుశికనందనా! నమస్కారము.

గీ. సంయమీశ్వర! తేజ మోజంబు తపము
తనువు దాల్చిననీమహత్త్వంబు పొగడ
సాహసించెడువాఁడు భావయుఁ దలంపుఁ
జాలమింజేసి నవ్వులపాలు గాఁడె?

మహానుభావా! మీావంటిపుణ్యపురుషులయనుగ్రహమునకుఁ బాత్రుఁ
డైనరామచంద్రుని గన్నదశరథునితోడిచుట్టరికమున నాకుఁ
గోరిక యుదయించినది. కాని, ఇట్టియల్లుఁడు లభింపకుండ వీర్య
శుల్కప్రతిజ్ఞ పట్టినమాయన్నగారిచే వంచితుల మైతిమి.

విశ్వా—ఇప్పటికిని మాయెడసంశయమా?

కుశ—లేదు లేదు.

విశ్వా—ఆ. అట్టు లైన నరవరా! తలంచినయంత
బయలుదేఱి వచ్చుభవునివిల్లు
రామభద్రునెదుటఁ బ్రత్యక్ష మగునట్లు
శివుని వేఁడుకొనుము చిత్తమందు.

కుశ—అట్లే చేసెదను (నమస్కారపూర్వకముగా ధ్యానించును)

రాక్ష—(తనలో) వీరు వేఱుగోడవలోఁ బడ్డారు. (ప్రకా) భూవరా!
కుశధ్వజా! ఎంతోసేపటినుండి బదులుచెప్పక నన్నవమానించు
చున్నావు.

కుశ—మాయన్న ప్రతివచన మిచ్చువాఁడని యింతకు మున్నే చెప్పితినిగదా! (తెరలో, కలకలము)

మ. సురతేజఃపరిదీప్తముం ద్రిపురరక్షోనాశి దంభోళిని
స్ఫురమాశంభునివిల్లు రాము నెదుటం జూపట్టె—

సీత—(తనలో) ఇప్పుడు సందేహము కలుగుచున్నది.

కుశ—మ.........శైలంబుపైఁ
గరి తొండంబునుబోలె వింటిపయి వేడ్కం జాఁచెఁ జేయాతఁడు

ఊర్మి—సెబాసు! విల్లు చేపట్టెఁగదా!

కుశ—మ. అ, ద్దిర! సద్దారఁగ నల్లె లాగె వడిన్

ఊర్మి—(సంతోషించి సిగ్గు చూపుసీతను గౌఁగిలించి) అదృష్టవంతురాలవక్కా!

కుశ—మ.........అంతే విల్లు రెండై పడెన్.

రాక్ష—(తనలో) ఏ మీదురాత్ముఁ డగున్నృపకుమారునిసర్వాతిశాయి సామర్థ్యము?

లక్ష్మ—గీ. హరధనుర్భంగజనితమహారవంబు
రామచరితాద్యడిండిమారావ మనఁగఁ
బ్రబలి బ్రహ్మాండభాండోదరంబు నిండి
భయము గొల్పుచు నాఁగ దిప్పటికి నైన.

కుశ—(పరమానందమునఁ బరవశుండై)
గీ. రమ్ము రఘునందనా! రమ్ము రామభద్ర!
ముద్దుగొందును మూర్ధంబు, మోద మలరఁ
గౌఁగిలింతును, నీపాదకమలములను
మదిని నిల్పుదు లేక నమస్కరింతు.

రాము—(ప్రవేశించి) ఏమిది? అతివాత్సల్యమునఁ బ్రసంగము హద్దుదాఁటి పోయినది.

విశ్వా—రాజా! నీవు పెద్దవాఁడవు. రామభద్రుఁడు పిల్లవాఁడు నీకొడుకు వంటివాఁడు. అట్లనఁదగదు.

కుశ—మునీంద్రా! నమస్కారము.

క. నీయాశీర్వచనంబున
నీయువనిజ రామపత్నియయ్యెను సత్యం
బీయూర్మిళ సౌమిత్రికి
నీయుత్సవసమయమందు యిచ్చితిఁ బేర్మిన్

కౌసల్య—(కంట నీరుపెట్టి) ఇచ్చివేసినారు.

రాజు—(తనలో) చూడవలసినది చూచినాను.

విశ్వా—చాలా బాగున్నది. సంతోషము. కాని యింకొకమాట చెప్ప వలసియున్నది.

కుశ—సెల వీయండి.

విశ్వా—మాండవీశ్రుతకీర్తులను క్రమముగా భరతశత్రుఘ్నుల కివ్వఁదగు నని నాకోరిక.

రాజు—(తనలో) తపోవనమున నివసించుబ్రహ్మనిష్ఠుఁ డేమి? రాజుల గృహకృత్యములం దీస్వాతంత్ర్య మేమి?

కుశ—దీనికాలోచన యేల? కాని యీవిషయమున నేను బరాధీనుఁడను.

విశ్వా—ఎవ రాపరులు?

కుశ—అం దొకరు మీరే

విశ్వా—మ తెవరు?

కుశ—అన్నగారును గౌతముఁ డైన శతానందుఁడును.

విశ్వా—(నవ్వి) వారిని నే నొప్పింపఁగలను.

కుశ—గీ. కన్నియల నిచ్చినవాఁడు గైకొన్నయతఁడు
సకలరాజర్షిఘనుఁడు కౌశికుఁడు గాఁగ
జనకరాజును రఘురాజు నొనరఁజేసి
నట్టిసంబంధమున కెవ్వఁ డలరకుండు?

విశ్వా—(ఆకాశమువంకఁజూచి) వత్సా శునశ్శేఫా! నీవిపు డయో
ధ్యకువెళ్ళి నామాటగా వసిష్ఠునితో నిట్లు విన్నవింపుము.

గీ. దశరథోర్వీశు నల్వురుతనయులకును
జనకభూనాథునల్వురు తనయల నొగి
నిచ్చినాను శతానందుఁ డిచ్చినట్లు
పట్టినాను వసిష్ఠుండు పట్టినట్లు.

"కావున నీవు బ్రహ్మర్షుల నెల్లఁ బెండ్లికిఁ బిలువ నంపి పుత్రమిత్రకళత్ర సహితుం డగుదశరథమహారాజుతో విదేహనగరంబునకు రమ్ము. సీరధ్వజునియజ్ఞము సమాప్తము కాఁగానే గోదానవ్రతపూర్వకముగా రామాదికుమారులవివాహమహోత్సవము జరుగును"

రా_ల—కేవల సంతోషము కాదు. పరమసంతోషము.

కన్యలు—మనము నలుగుర మొక్కచోటనే యుందుమదే చాలు.

రాక్ష—అయ్యా! ఇపు డైన నేను జెప్పెడిధర్మాక్షరము లాలకింపుము. సీత నన్యుని కిచ్చుట యెంతమాత్రము మంచిది కాదు.

చ. వినయముతోడ మి మ్మడుగు వీరు జగత్పతిఁ ద్రోసిపుత్తురే?
కనరె పులస్త్యపౌత్రునిసుఖం బగుచుట్టరికంబు మేలిమిన్?
వినుఁ డెటులైన లంకఁ బృథివీసుత చేరక పోదు గాన నిం
ద్రునిపురివారకాంతలనిరోధము లూరక కోరఁ బోకుఁడీ!

(తెరలో, కలకలము)

కుశ—వీ రెవరు? అకాలమేఘంబులం బోలి భయంకరులై గుంపుతోఁ బరుగెత్తుకొని వచ్చుచున్నారు.

విశ్వా—వీరు సుందోపసుందులపుత్త్రులగు సుబాహుమారీచులు. కుమారులారా! యాగవిఘ్నకారు లగు వీరిని వధింపుఁడు.

రా_ల—చిత్తము చిత్తము (పరిక్రమింతురు)

కన్యలు—ఇప్పు డేమగునో కదా!

రాక్ష.—గీ. మేలుమే లిది మన కనుకూల మయ్యెఁ
దల్లక్రిం దగు జరిగిన దెల్ల తప్పు
దైన నేమగునో తుదకంటఁ జూచి
మాల్యవంతున కిది యంత మానవిచేతు.

కుశ—(విల్లుమ్రోఁగించుచు) రఘుకుమారులారా! ఈమదమత్తుని జయింపుఁడు. ఇదిగో! నేను గూడా వచ్చుచున్నాను.

విశ్వా—(సమందహాసముగా) రాజా!

గీ. ఎందు కీ వందు పోయెద విందు రమ్ము
శూరు లగురామలక్ష్మణుల్ చూడు మదిగో!
కనలుచు నధర్వమారణకల్ప మట్లు
వెల్చుచున్నారు బ్రహ్మవిద్వేషికులము.

(అందఱు నిష్క్రమింతురు)

ఇది ప్రథమాఙ్కము.

ఓన్నమః పరబ్రహ్మణే

# మహావీరచరిత్రనాటకము

## ద్వితీయాఙ్కము

[ కూర్చుండి యాలోచించుచు మాల్యవంతుఁడు ప్రవేశించును ]

మాల్య—సర్వమాయుఁడు సిద్ధాశ్రమవృత్తాంతము చెప్పినప్పటినుండి నా కేమియుఁ దోఁచడము లేదు. అబ్బా! తాటకాసుబాహుల్ఁ బరిమార్చి మారీచుని గడ్డిపోఁచలాగున విసరివేసినయారాచకుఱ్ఱవాఁడు నాడొక్కలో బల్లెమువలె నున్నాఁడు. వాళ్ళకే దిక్కు లేదు గదా! ఇఁక వాళ్ళతోఁ బోయినమూఁక యొక్కక్షణములోఁ గూలిన దన్న నాశ్చర్యమేమి? ఔరా! ఆరాజపుత్త్రుఁడు సామాన్యుఁడా?

గీ. దేవకల తేజమున బ్రహ్మ దీర్చినట్టి
శివునిచాపంబు ముక్కలుచేసినాఁడు
ఆకృశాశ్వునిశిష్యునియాదరమున
దివ్యశస్త్రాస్త్రసంపదఁ దీరినాఁడు.

ఆకౌశికుఁ డెంతటిగట్టివాఁడో చూడండి. మేము పంపినదూత యని యైనా చూడక సర్వమాయునియెదుటనే రావణునికిఁ బ్రతికూలమైనపరమాస్త్రసంతతిని రాముని కిచ్చినాఁడుగదా! అతనిమాట యటుండనిండు. జనకుఁడో! సీతను బట్టి చెఱఁబెట్టుదు రేమోయని

యుపమానమున కైన జంకెనా? అనిర్జరులో మనవశమునుండి తప్పిపోయినట్లుగా నాందీముఖము మొదలుగా నొక్కరీతిని దుందుభులు మ్రోఁగించినారఁట. ఔను. బల మించుక తగ్గునప్పటి కవస్థయు మాఱుట నైజము. (తెరవంకఁజూచి) అమ్మాయి శూర్పణఖ వచ్చినదా?

శూర్ప—(ప్రవేశించి) చిన్నతాతా! జయము జయము.

మాల్య—కుమారీ! కూర్చుండుము. రాజుచెంతనుండి వచ్చినావు. వార్త లేమి?

శూర్ప—ఏ మున్నవి? అక్కడ పెళ్ళి ళ్ళయిపోయినవి గదా!

మాల్య—అగస్త్యమహర్షి రామునికి మాహేంద్రచాపము కానుకగాఁ బంపినాఁడఁట! అమూల్యము లైనయాయుధంబు లన్నియు బ్రహ్మర్షులవల్ల రామునికి వచ్చి పడుచున్నవి. (ఆలోచించి)

గీ. బ్రాహ్మణానుగ్రహంబును రాజుచేతి
యస్త్రరాజం బమోఘములగుచునుండ
బ్రాహ్మణానుగ్రహాయత్త రాజతేజ
మెల్లలోకంబు నోర్చుట కేమి వింత?

శూర్ప—ఏమిటి తాతా! మనుష్యమాత్రునియెడ నింత విచారము!

మాల్య—బిడ్డా! అట్లు కాదు.

ఉ. మానవమాత్రుఁడా నిరుపమానుఁడు రాముఁడు! శుద్ధసత్త్వవి
జ్ఞానఘు నాత్మతత్త్వ ముని సర్వసురాసురు లెంతు రాతనిన్
మౌనులు సర్వశక్తులు సమర్పణచేసిరి వాని కింతకున్
మానవభీతి లే దనియెనా విధి జేసికిఁ గోర్కు లిచ్చుచోన్?

గీ. సహజముగ ధర్మరక్షార్థజన్ముఁ డతఁడు
ధర్మనాశననిరతంబు దానవాళి
ధర్మసంబంధ మగువిరోధంబు మనకు
శక్తుఁ డగునట్టివానితో సంభవించె.

శూర్ప—ఔను నిజమే తాతా! అందుకే మాయన్న దశగ్రీవుఁడు కూడా అరభూపు చూచుచుఁ దలలు వంచుకొని యేదో విధముగా నున్నాఁడు. అతనిదారుణహృదయావేదన మింతటితో విరమించు నది కా దని తోఁచుచున్నది.

మాల్య—ఏమీ! అంత చింతిల్లుచున్నాఁడా; ఔరా!

చ. జగముల కెల్లఁ బూజ్యు లగుసప్తవిధాతలు వారిసంతతిన్
బొగడికగన్నయట్టిమనమ్ముం దనగొప్పకు వియ్యమందఁగాఁ
దగ మని మైథిలుండు పెడదారిని బోయెనుగాక, దానికిన్
వగవఁగనేల శూరుఁడు తపస్వి జగత్పతి యైనవానికిన్?

(ఆలోచించి) అయినా కొంత హేతువు లేకపోలేదు.

ఉ. సీతను బొందఁగోరి ఫలసిద్ధి గనుంగొనఁ డయ్యె నాజగ
జ్జేత, నరుండు దాశరథి చేకొనె జానకి ద్రోహియై, పరా
భూతి యొనర్చునారిపుసమున్నతియుం దనమానహానియున్
భూతనయా[illegible]వాప్తి యనుమూఁడును మూఁడె మనంబు నొంపఁగన్.

ప్రతీహారుఁడు—(నేపథ్యార్ధప్రవిష్టుఁడై) అయ్యా! పరశురామునివద్దకు మీరు పంపినసందేశహరుఁడు తమాలరసాంకితాక్షరం బయిన యీతాటాకుముక్క తీసుకొని వచ్చి యిచ్చెను. (అక్కడ పడ వైచి వెళ్ళును)

మాల్య—(దానిని దీసుకొని) స్వస్తి. మహేంద్రద్వీపమున నుండి పరశు రాముఁడు లంకాపురములోనియమాత్యుఁ డగుమాల్యవంతుని సంభావించుచు,

శూర్ప—ఇదేమి? రాజును విడిచి ముందుగా మంత్రిపే రెత్తెనే!

మాల్య—ఇక్కడనుండినే మహేశ్వరభక్తుఁ డగులంకేశ్వరు నభినందించి చెప్పుచున్నాఁడు.దండకారణ్యసంచారు లగుదనుకబంధవిరాధాది దానవులు కొందఱు మాయాశ్రమంబు లతిక్రమించుచున్నా

రని యందలితపోధనులు చెప్పఁగా విని వారి కభయ మిచ్చితిమి. అట్టిపని చేయవ ద్దని మీవారికిఁ దెలుపుచు మాకుఁ బ్రియముగా మీరు మీశివభక్తి ననుసరింతురుగాక. బ్రాహ్మణులకు బాధ కలుగకుండునట్లు చేయుట మీకే శ్రేయస్కరము. అట్లు చేయ కేని మీమిత్రుఁ డగుజామదగ్న్యునిమనస్సు నొచ్చుకొను నని తెలియఁదగును.

శూర్ప—మెత్తగా కఱుకుగా లోతుగా నిండుగా మాచక్కఁగా నున్న దీయుపన్యాసము.

మాల్య—అయ్యో! చెప్పే దేమిటి? ఈయన భార్గవరాముఁడు!

చ. బలము తపంబు విద్య భృగువంశము వీర్యము చెల్ల రాజవీ
రుల నణఁగించి యుం, డుదకు రోసి శమస్థితి గాంచె నీశ్వరుం
గొలిచినదిట్టగాన మనకుం బ్రభు పట్టులు వ్రాసి కార్యముం
దెలిపెఁ దదిష్టమున్ మనము తీర్పనిచో మఱి కర్కశుం డగున్.

(అని యాలోచించును)

శూర్ప—తాతా! ఏమిటి ఆలోచించుచున్నావు?

మాల్య—గీ. తనగురునివిల్లు దశరథాత్మజుఁడు విఱిచె
నన్ననుడి విన్నచో నీతఁ డగ్గి యగుచు
రాము నెదిరింపఁ బోవు, నారణమునందు
చత్తురే నిద్ద ఱది గొప్పశాంతి మనకు.

అని, యట్లు జరుగునుపాయ మాలోచించుచున్నాను. అట్లుకాక, ఒకఁ డోడి యొకఁడు గెల్చుట సంభవించునా, క్షత్త్రియాంతకుఁ డైన భార్గవుఁడు తప్పక రాము నోడించును. ఏమనఁగా? వానిని గూల్పకుండ నితనికోపము శాంతించదు. అట్లు జరిగెనేని మన కిష్టమే. ఒకవేళ దాశరథియే గెల్చునా, బ్రాహ్మణభక్తుఁ డైన యతఁడు బ్రిహార్షిని జంపఁడు, పరశురాముఁడు శస్త్రసన్న్యాసము

చేయునుగాని, తనకత్తి మొక్కవోయునదని చింతింపఁడు. అట్లే జరిగినచో మన కనిష్టము.

శూర్ప—ఇం దేమి విశేషము?

మాల్య—ఏ మందువా?—జామదగ్న్యుఁడు తపోవనవాసి. అతఁడు రాముని జంపినా, ఓడించి విడిచినా, మరలఁ దపోవనము చేరువాఁడే. రాముఁడో, చావక పరాభూతుఁడై బ్రతికి యుండెనేని, ఉత్సాహశక్తిసంపన్నుఁడై శాత్రవ మణఁపఁ గోరి మరలఁ బైకి లేవ దీక్ష వహించి, తన్ను జయించినపరమోత్కృష్టశత్రు వగు భార్గవుని గెలిచి తీరును. అప్పు డాసర్వాతిశాయిశౌర్యసంపన్నుఁడయిన రామునిపరాక్రమంబును నిర్జరు లందఱు విశ్వసింతురు. అంతవఱకు రావణునిదోర్బలంబున కణఁగి యున్నవా రెల్లరు నతని ధిక్కరింపఁజూతురు. మనదెబ్బ తిన్నవారికి మనమీఁదఁ గోప ముండుట సహజము కదా!

ఉ. భూవరనాశ మత్కృతికి ముందటిమంగళపద్యమో యనన్
రావణగర్వభంజనుఁ డరాతిభయంకరుఁ డైన కార్తవీ
ర్యావనిపాలుఁ గూల్చినమహాత్ముని రాముఁడు గెల్చెనా, దశ
గ్రీవుని దోస్సిరా జనుచుఁ గేవల మొక్కఁడు విశ్వ మేలఁడే?

శూర్ప—అయితే నీనిశ్చితాభిప్రాయ మేమి?

మాల్య—పరశురామునికిఁ గోపము పుట్టించుటయే యిప్పటిపని.

శూర్ప—రాముఁడే గెల్చెనేని మనము గొప్పతప్పు చేసిన ట్లగునుగదా!

మాల్య—అయినా, శక్తికొలఁదిఁ బ్రతిక్రియ చేయక లేకపోఁదు.

గీ. సర్వజిత్వరసామాన్యశక్తియేని
రాఘవుఁడు గెల్వలేఁడు భార్గవుని, గాక

ఆశరీరంబు నాశక్తు లట్లె యున్నఁ
బరశురాముని కనిఁ బరాభవము రాదు.

కావున లెమ్ము. మిథిలాప్రయాణమునకు భార్గవుని బురికొల్ప మహేంద్ర ద్వీపమునకుఁ బోవుదము. ఈకారణముచేతనైనా, ఆమహానుభావుని దర్శించుభాగ్యము పట్టినది.

గీ. శాంతిదాంతితపఃపుణ్యసత్త్వమూర్తి
మహిమనిలయుండు లోకసమ్మాన్యుఁ డతఁడు,
అమ్మహాత్మునిదర్శనం బఘహరంబు
భక్తిముక్తిప్రదంబు సంపత్కరంబు.

(అని నిష్క్రమించిరి)

ఇది విష్కంభము.

(తెరలో) ఓరీ విదేహరాజనగరీకన్యాన్తఃపురసంచారులారా!

సీ. కైలాస మవలీలగా నెత్తినఘనుండు
విదితలోకత్రయీవిజయశాలి
యైనపౌలస్త్యుబాహాగర్వ మణఁచిన
ధూర్త భూపాలుండు కార్తవీర్యు
వేయిభుజంబు లువ్వెత్తుగాఁ జెండాడి
కొమ్మలు తెగినవృక్షమ్ముఁ జేసి,
యిరువదియొక్కమా ఱ్క్షితి నక్షత్రి
యంబుఁ గావించి, క్రౌంచంబు గొట్టి

గీ. హంసలకు దారి చూపి, సైన్యంబుతోడి
బాహులేయుని గెల్చినభార్గవుండు
గురుధనుర్భంగదుర్భరక్రోధుఁ డగుచు
వచ్చె నని చెప్పుఁ డారామభద్రుతోడ.

[అంత సధైర్యసంభ్రముఁ డగురాముఁడును సఖులతో!
సీతయుఁ బ్రవేశింతురు]

రాము:—

చ. పురహరశిష్యుఁ డద్భుతతపోనిధి వేదనిధాన మస్త్రవి
ద్వరుఁ డగుభార్గవుండు గనవచ్చెను నన్నతనిం గనంగ నే
నరుగక తప్ప, దిత్తఱి భయంబడి యీచెలి ముగ్ధయయ్యె సి
గ్గొరయుచు నాభిజాత్యమున నొప్పగునెయ్యము చూపుచుండెడిన్.

సీత—సఖులారా! ఇపు డీ దేమిటి?

సఖులు—వీరకుమారా! తొందరపడవద్దు.

రాము—పెద్దలమునుపటలు పరులొనర్చుతిరస్కారము సహింపవు.

సఖులు—ఎన్నోసార్లు భూమిలోనిరాజుల నెల్ల నఱికి వారిరక్తమునఁ బితృతర్పణము చేసినవాఁడు గదా పరశురాముఁడు!

రాము—ఆమహాత్మునిమహిమను కొంత చెప్పి కొంత విడిచిన నెట్లు? కార్తికేయునిదోర్గర్వ మణఁచినయావీరశేఖరుఁడు రాజవంశము లున్మూలించి యార్జించినభూమండల మంతయుఁ దా నొనర్చిన యశ్వమేధయాగమున దక్షిణగాఁ గాశ్యపునికి ధారవోసి తన శస్త్రమునకు జడిసి సముద్రుఁ డిచ్చినద్వీపమున నివసించి యిపుడు తపస్సు చేయుచున్నాఁడు.

(తెరలో) గీ. ద్వారపాలురు భీతిల్లి వణఁకుచుండ
వీథిలోవారు మొఱ్ఱలు పెట్టుచుండ
రాముఁ డే డంచు భార్గవరాముఁ డొకట!
యరుగుచున్నాఁడు కన్యాగృహంబువంక.

రాము—వీరే శిష్టాచారపద్ధతులు నిర్ణయించినవారు. తెలిసినవారఁ డయ్యు నితఁ డిట్టిపొరపాటుపనిచేయు చుండెనేమో! కానీ ఎదురుగా వెళ్ళెదను.

(అని ధైర్యంబు నౌద్ధత్యము దోఁప నడచుచున్నాఁడు)

**సఖులు**—ఏ మీవింత! అయోధ్యాఅల్లుఁడుగారు! అమ్మయ్యో రామభద్రుఁడు! హా దేవా రామచంద్రా! అని మొఱ్ఱ లిడుచు, కోటలోని పరిచారు లందఱు నిట్టటు పరుగులెత్తుచున్నారు. భర్తృదారికా! నీవే స్వయముగా వెళ్ళి యటు పో వద్దని నీమగనికిఁ జెప్పవమ్మా!

**సీత**—అయితే మీరుకూడా రండి. తొందరగా వెళ్ళి త్వరపడుచున్న యార్యపుత్త్రుని నటుపో వద్దని చెపుదాము.

(అని వారితోఁ బరిక్రమించును)

**సఖులు**—కుమారా! కుమారా! ఇటు చూడవయ్యా! భయాతిరేకమున నడుగులు తడఁబడ రాజహంసివలెఁ బరుగెత్తుకొని వచ్చుచున్నది నీప్రియురాలు, ఉండవయ్యా!

**రాము**—(వెనుకఁ దిరిగి సప్రేమానుకంపముగాఁ జూచి) మీసఖి భయపడినది. భయము లే దని చెప్పి యూరడింపుఁడు.

**సఖులు**—చెలీ సీతా! నీభర్త ముల్లోకములకు మేలొనగూర్పఁ దగిన యుత్తమగుణములరాశి యనియు, ఆయనముఖమున జయలక్ష్మి తాండవ మాడుచున్నదనియుఁ గన్నులరవిరికలువలై చెలువారు సంతోషముతోడియనురాగము ముఖపద్మమునఁ దోఁపఁ గాఁడ మాయెదుట నిన్నిమాఱులో వర్ణించియున్నావు కదా! విజయాభిముఖుఁ డైన యామహావీరకుమారుని యెడ నీ కిపు డీశంక యేమి?

**సీత**—పరశురాముఁడు సర్వక్షత్త్రియుల కపకారి కదా!

**రాము**—ప్రేయసీ! స్వస్థచిత్తురాలవై వెనుకకు వెళ్ళుము.

**ఉ.** ఇంతటి వెఱ్ఱిదానవె చెలీ! యొడ లెల్ల వణంకుచుండె నూ
ర్పెంతయు హెచ్చె నో మృదుదరనేమి భయం బిది? యిప్పుపూలచే

ల్వెంతనుకోమలాంగము సహించునె కష్టము? చూడవేమి య
త్యంతము నీదుమధ్య మసియాడుచునుండె గతిశ్రమంబునన్?

(తెరలో) ఓరీపరిచారకులారా! రాముఁ డెక్కడ?

సీత—అడుగో! అతఁడే పిలుచుచున్నాఁడు.

రాము—ఔను, దుర్దాంతసాహసుఁడును గ్రూరకర్ముఁడు నైనయాపరశురామునిమాట పుష్కలావర్తములయుఱుమువలెఁ జెవిని బడుచున్నది. (అని పరిక్రమించును.)

సీత—అయ్యో! ఇపు డేమిగతి? (అని రాముని విల్లు పట్టుకొని) ఆర్యపుత్రా! మానాన్నగారు వచ్చేదాఁకా వెళ్ళవద్దు (అని పరిక్రమించుచున్నది.)

సఖులు—సీత భయపడి ప్రేమ పట్టలేక సిగ్గు విడిచి పెట్టినది.

రాము—నిజము నిజము. స్నేహము లజ్జను దిగఁద్రొక్కినది. అయితే విల్లు విడిచిపెట్టి వెళ్ళెదను.

(తెరలో) ఎక్కడరా దాశరథి?

సీత—అట్లయితే మిమ్మే పట్టుకొందును (కౌఁగిటఁ బట్టును)

రాము—ఇపు డేమిచేయును?

గీ. ఘనపరాక్రము డైనభార్గవుని జూడ
సరుగు మని వీరరసము న న్నట్లు లాగ
చందనము చంద్రకాంతి నాఁజల్లనైన
యీపరిష్వంగరసము న న్నిట్లు లాగు.

సఖులు—అబ్బా! ముసలివాఁడే కాని, ఆదేహకాంతిసూర్యతేజస్సును మించియున్నది. ఆజడ లగ్నిశిఖలవలె నట్లున్నవో! నిర్భరపదఘట్టనంబున భూమి కదలునట్లు నడచుచు గండగొడ్డలి బుజాన వేసుకొని క్షత్రియాంతకుఁ డైనభార్గవుఁ డయ్యో సమీపించుచున్నాఁడే!

రాము—క. జగదేకవీరుఁ డద్భుత
మగు తేజఃపుంజ మనఘు మైనతపం బె
న్నఁగ భార్గవుండు కంటికి
నగపడు వీరంబెఁ పొగడ నగునే యితనిన్?

గీ. పావనుం డయ్యు భీమకర్మావిలుండు
వ్రతపరుం డయ్యు నమితప్రభావశక్తి
ఘోర ముజ్జ్వల మైనశరీర మలరు
నట్టినాల్గవ వేదమే యార్యుఁ డితఁడు.

గీ. సకలలోకంబు కల్పావసానసమయ
మందు దహియించుకాలరుద్రానలంబు
సర్వశక్తులు నేకమై జగతిఁ బుట్టి
నట్టివిప్రుండు భార్గవుం డనఁగవచ్చు.

(నవ్వి) అహా! ఏ మీతనిస్వేచ్ఛాసంచారవైచిత్రి! ఏ మీయద్భుత
వేషము?

గీ. అంసముల నొప్పు గొడ్డలి యమ్ములపొది,
అంగమందు జటావల్కలాజినములు,
శరము చాపంబు జపమాల కరములందు,
వీరశాంతంబు లేకీభవించినట్లు.

ప్రేయసీ! వీరు పూజ్యులైనపెద్దలు. అవగుంఠనంబు ధరించి వెనుకకు
మళ్ళుము.

సీత — అయ్యో అయ్యో! ఆమునిసమీపించెఁగదా! అగ్నిపుత్రా! రక్షిం
పుము (అని చేతులు జోడించును)

రాము—సుందరీ! ఏమి కీభయము?

గీ. ఇతఁడు వీరుఁడు ముని యూట నిష్ట మయ్యెఁ
దొట్రుపడ నేల? రాచకూఁతురవు గావె?

దర్పకండూతిబాహులఁ డీతపసిసేవ
సలుపఁ గలవాఁడ రాఘవక్షత్రియుండ.

[అంతఁ గుపితుఁ డగుజామదగ్న్యుఁడు ప్రవేశించును]

పరశు—ఊఁ. ఏ మీరాచకుఱ్ఱవాని మైమఱపు?

చ. వెఱవఁడు గాక శంభునికి విశ్వహితుం డనుబుద్ధిఁ, జాపమున్
విఱిచెడు వేళఁ దారకునివీఁచ మడంచినతత్కుమారుపై
రెఱుఁగఁడె? యాకుమారుని జయించినయీశ్వరశిష్యు నన్ను నున్
మఱచెనె? నాచరిత్రము వినండె మదాంధుఁడు వీఁడు కుఱ్ఱఁడా?

ఇది పూర్తిగా శస్త్రసన్న్యాసము చేసిననాతప్పు కాని వీనితప్పు కాదు.

గీ. భూవరాన్వయ మపుడు నిర్మూలమైన,
నిప్పు డందందు రాజుల మే మటంచు
విండ్లు చేపట్టి కొందఱు విఱ్ఱవీఁగు
చున్నవా రన్నమాటలు విన్నవాఁడ.

రాము—గీ. సద్యశస్వి తపస్వి తేజస్వి యయ్యు
వీర్యము బలంబు దర్పంబు వెలయ నితఁడు
పైకి వచ్చుట గని నాదుపాణియుగము
మ్రొక్క శరవిద్య చూప నుప్పొంగుచుండె.

కాని, యీరెండును బరస్పరవిరుద్ధములు. ఇపు డేమి చేయఁదగును?
కానిమ్ము చూతము.

పరశు—(కోపముతో సమీపించుచు) రాముఁ డెక్కడరా?

రాము—ఇఁడుగో! ఇక్కడ నున్నాఁడు.

పరశు—మేలుమేలు రాజపుత్త్రా! నీవు నిజముగా నైష్ఠికుఁడవే.

గీ. కుంభికుంభవిదారణకులిశనఖర
మైనహరికి మదావళమట్లు, నిన్ను
నణఁప వెదకెడునాకు నీయంత నీవ
యైతి విది మేలు నీజాతి కనుగుణంబు.

సఖులు—పాపము శాంతించుఁగాక, అశుభము తొలఁగుఁగాక.

పరశు—(చక్కఁగాఁ జూచి తనలో) ఈరాజకుమారుఁ డెంతొ సుందరముగా నున్నాఁడు!

ఉ. ఆసాబగ్గైనపంచశిఖ లానవయౌవన మావిలోకనం
బాసుకుమారదేహరుచి యాసాగ సాహస మేమిచెప్ప? నా
శాసహజానుభావము ప్రియం బొనగూర్చెను జూచినంత, నై
నా సముయించి తీరవలె నక్కట; ఛీ! రణవీరకృత్యముల్!

(ప్రకాశముగా) రఘుకుమారా!

ఉ. శూలికిఁ దొల్లి ఖండపరశుప్రథ దెచ్చినయీకుఠార ము
త్తాలశివాస్త్రమున్ విఱిచి దర్పము చూపిననీపయిం గ్రుధా
జ్వాలలు గ్రక్కుచుం గఱకువాదర నీమెడఁ గౌఁగిలింపఁగాఁ
గ్రాలుచు నున్న దొక్కత్రుటికాలము నోర్వను కాచుకొ మ్మిఁకన్.

సఖులు—అయ్యో అయ్యో! ఇతఁడు మండిపడుచున్నాఁడు.

రాము—(సధైర్యబహుమానముగాఁ జూచి) అయ్యా! తొల్లి సపరివారుఁ డైనకార్తికేయు నోడించినప్పుడు వెయ్యేండ్లు శిష్యత్వము నెఱపిననీకు నీలలోహితుఁ డనుగ్రహించినగండగొడ్డలి యిదేనా?

సఖులు—మహారాజపుత్రీ! లోపల గౌరవము చూపించుచునే జంకు గొంకు లేక పరశురామునియాయుధలాభము నెట్లు పరిహాసించుచుండెనో, నీభర్తమాటలు వినవమ్మా!

సీత—(కన్నీ రొలుక నాశ్చర్యంబునఁ జూచుచున్నది)

పరశు—(తనలో) అబ్బా! మార్గము వేఱుగా నున్నది. ఇతనిమహత్త్వమూ నిరూపింప శక్యము గాకున్నది. సౌజన్యమూ అందకున్నది. పౌరుషమూ ఉత్సాహసంరంభంబున నతిగంభీరముగా నున్నది. ఏ మిది? (ప్రకా) దాశరథీ! ఔ నిదే మాగురువులవారి కతిప్రియ మైనపరశువు

సఖులు—ఈపటు కయినా, కోపము కొంచెము శాంతించినట్లు వినవచ్చిన దమ్మా!

పరశు—గురి తప్పకుండఁగా బాణ మేయువిషయమున నాకును కుమారస్వామికి నొకప్పుడు వివాదము వచ్చినది. అపుడు నే నతని నోడించినాను. ఆచిన్నజయమునకే యానందించి మాగురువు నన్నుఁ గౌఁగిలించుకొని యీపరశువు నాకుఁ బ్రసాదించెను.

రాము—(తనలో) కార్త్తికేయుని గెలుచుట చిన్నజయమా? ఎంత గర్వము? (ప్రకాశముగా) ఈగొడ్డలిమూలముగా నే కాఁబోలు నీఖ్యాతి భూమ్యాకాశముల నిండిపోయినది. దీనిని ధరించి చండీశ్వరుఁడు ఖండపరశు వని ముల్లోకముల నుతి గాంచెనో, కుమారస్వామిని జయించిననీవు దానిని ధరించి పరశురాముఁడవై నావు. ఆహా! అది కదా భాగ్యము! క్షత్త్రబ్రహ్మతపోనిధి వగు నీచరితము లోకోత్తరము. నీశౌర్యము వాక్కుల కందరానిది.

సఖులు—రాజపుత్త్రుఁడు పెద్దలతోఁ జక్కఁగా మాటాడ నేర్చినవాఁడు.

పరశు—గీ. రామ రఘురామ! నయనాభిరామ మగుచుఁ
దలఁపునకు మించు నందచందంబు లెలయ
వర్ణనకు మించుసద్గుణవర్గ మొప్ప
నెల్లవిధముల నామది కెక్కి తీవు.

గీ. కరిముఖునిదంతముసలప్రఘాతములకుఁ
దారకాంతకుబాణప్రహారములకుఁ
గాయగాసిననాదువక్షంబు నిన్నుఁ
గౌఁగిలింపఁగఁ గోరు నిక్కంబు రామ!

సఖులు—చెలీ! చూడు చూడు, నీమగనిసౌభాగ్యము. ఇంతవఱకును సిగ్గుచే నీవట్లు చేయక నిన్ను నీవు మోసగించుకొనుచున్నావు.

సీత—(కన్నీటితో నిట్టూర్పుపుచ్చును)

రాము— మునివరా! అది యీసమయమున కర్తవ్యము కాదు.

సీత—ధైర్యమహత్వములతో నితనివినయ మెంతయు శోభిల్లు చున్నది.

పరశు—(తనలో) ఔరా! ఈతనియంతఃకరణమా, నిర్మలంబు సౌజన్య విలసితంబునై యితరులగొప్పతనములోఁతు కనిపెట్టఁ జాలి యున్నది. ఇతనియహంకారమా, బుద్ధిచాతుర్యము గలవారికిఁ గాక యన్యులకు నిజ మైనవినయగాంభీర్యము తెలియనీయ కున్నది.

గీ. ఇతనిచక్క నినడవడి కేను మరగి
యింతవఱ కీయహంకృతి నెఱుఁగనైతి,
నౌర! వీరకుమారుఁడై యవతరించు
నెల్లసామర్థ్యములరాశియే యితఁడు.

గీ. సిరియు సాత్త్వికవృత్తి తేజంబు జయము
వినయనయమానశౌర్యముల్ వెలయునట్టి
యీశరీరంబు నిజముగా నెల్లజగతి
కభయ మీయంగ జనియించె నన(గవచ్చు.

మఱియు నీబాలవీరుని జూచిన నిట్లు తోఁచుచున్నది.

మ. మణియో లోకులపుణ్యమో మహితసామర్థ్యవ్రజంబో జగ
ద్గణరక్షార్థశరీరధారి యగుసాక్షాదస్త్రవేదంబో స
ద్గుణపుంజంబో ఘనీకృతంబయినసంతోషంబో బ్రహ్మాండపో
షణముం గోరినమూర్తిమంత మగురాజద్రాజధర్మంబొకో?

(ప్రతీ) ఓకన్నెలారా! ఈసీత నంతఃపురంబునకుఁ గొనిపొండు.

రాము—(తనలో) అది మంచిదే!

(తెరలో) సీరధ్వజుఁడు ధనుష్పాణియై శతానందునితో నిటు వచ్చుచున్నాఁడు.

సఖులు—సఖీ! నాయనగారు వచ్చినారు. మనమింక లోపలికిఁ బోవుదము రా.

సీత—అమ్మా సంగ్రామజయలక్ష్మీ! నమస్కారము.

(చెలికత్తెలతో సీత నిష్క్రమించును)

పరశు—గీ. ఎవని కాయాజ్ఞవల్క్యమునీశ్వరుండు
వేదములు చెప్పెనో, యావిదేహవిభుఁడు
పండితుండు శతానందపరమసఖుఁడు
ధీరుఁ డైనట్టిజనకుఁ డేతెంచుచుండె.

ఇతఁడు మంచివాఁడే కాని, క్షత్త్రియుఁ డని తలనొప్పి వచ్చుచున్నది.

[అంత జనకశతానందులు తొందరతోఁ బ్రవేశింతురు]

శతా—రాజా! మన మిపుడు చేయఁదగిన దేమి?

జన—గీ. భార్గవమునీంద్రుఁ డతిథిగా వచ్చెనేని
యర్ఘ్యపాద్యాదు లొసఁగుట యర్హ మగును,
కాక, మనపిల్లవాని కకారణముగ
శత్రునై వచ్చుచో విల్లు చక్కఁబెట్టు.

(అనుచుఁ బరిక్రమించును)

రాము—మునివరా! భార్గవా! కంట నీరు పెట్టుచున్నావేమి?

పరశు—ఏమీ లేదు.

మ. కనువిందయ్యెను నీదుమేను, మది లగ్నంబయ్యె నీరూపు, మె
న్నని పెండ్లయినది చేతికంకణము నైనన్ విప్పలే, దంచు జా
లిని గొన్నాఁడను, గాని మాగురుని విచ్ఛేదించుదోషంబు నీ
తనువిచ్ఛిత్తికి నర్హమైన దనుచింతం గంట నీ ర్వెట్టితిన్.

రాము—భార్గవా! నీవు నన్నుఁ గనికరించుచున్నావని తెలిసినది.

పరశు—అరే! భ్రాంతిపడుచున్నావా యేమి? నీలమేఘముమాడ్కి నిగనిగలాడు నీకంబుకంఠమున నాకుఠారము పడ నున్నది.

రాము—ఆఁ! నిజముగా మీరు దయామూర్తులుగదా!

పరశు—ఏమీ! నామీఁదనే కనుబొమలు విఱుచుచున్నావా? ఓరీ క్షత్రియకుమారా! నీవు కుఱ్ఱవాఁడ వనియు, క్రొత్తపెండ్లికొడుక వనియు చక్కనివాఁడ వనియు, కొంచెము సంకోచించుచున్నాము. కాని, జామదగ్న్యుఁడు తండ్రియాజ్ఞ శిరసా వహించి తల్లితల నఱికినవాఁ డన్నలోకప్రసిద్ధి కర్ణాకర్ణికగా నీవు వినియేయుందువు, ఓరీమూఢా! మఱొక్కమాట.

చ. ఇరువదియొక్కసారి యొకఁడే మగపుర్వు మిగుల్చకుండ భూ
వరుల వధించి, కాల్వ లగువారలరక్తమునన్ మునింగి, యా
దరమునఁ దర్పణం బొసఁగి తండ్రికిఁ, గోపము డించినట్టినా
చరితము బాహువీర్యమును శౌర్య మెఱుంగవె సర్వభూతముల్?

రాము—క్రౌర్యము పురుషదోషము లన్నిటిలో గొప్పది. దాని నింతగాఁ బొగడుకొందు వేల?

పరశు—ఆఁ! ఏమీ గడుసుమాటలు?

క. చాపం బెక్కిడి ముందుగ
నాపై శర మేయు మదియు నాకోర్కి నిజం
బౌపయి నిప్పులు గ్రక్కెడి
యీపరశువు నిన్ను మూర్ధహీనుని జేయుఁ.

జనక, శతానందులు—వత్సా రామభద్ర! నీవు కొంచెమునే పాఁగియుండుము.

రాము—అయ్యో! పెద్దలయనుమతి నపేక్షింపవలసినవాఁడ నైతినే!

పరశు—ఆంగిరస! కుశలముగా నుంటివా?

శతా—మీదర్శనంబున మఱియును—కాని, ఒక్కమాట. నీ వతిథిగా వచ్చితివా? అట్లయిన సత్కరింప మేము సిద్ధముగా నున్నాము.

పరశు—నీవు పురోహితుఁడవు, యాజ్ఞవల్క్యశిష్యుఁడును సచ్చరిత్రుఁడు నైన జనకుఁడు గృహమేధి. అంతా బాగానే యున్నదిగాని, నే నందుకు రాలే దోయి!

శతా—అయితే, అక్రమముగాఁ గన్యాప్రాసాదముఁ బ్రవేశించి యంతఃపురమర్యాదకు భంగ మేల కలిగించినావు?

పరశు—నే నడవులలో నివసించు బ్రాహ్మణుఁడను. రాజాధిరాజుల గృహవ్యవహారము లెఱుఁగను.

రాము—(తనలో) భూవలయ మంతయు సద్వరదక్షిణగా నొసఁగిన వాఁడు సామంతులయొక్క నీయహంకారము వెల్లడించుట చక్కగానే యున్నది.

జనక—మాయింట నున్నరఘుకుమారునియెడ నిట్టిఘోరకర్మ మాచరింప నెట్లు తలఁచితివి?

కంచుకి—(ప్రవేశించి) మహారాజా! రాణులు కంకణమోచనోత్సవము జరిగింప సమావేశ మైరి. వరుని బంపుదురుగాక.

జన-శతా—అబ్బాయీ! మీఅత్తలు పిలుచుచున్నారఁట! వెళ్ళి రమ్ము.

రాము—భార్గవా! పెద లిట్లు సెలవిచ్చుచున్నారు.

పరశు—లోకాచారము జరుపవలసినదే. చుట్టా లందఱు నిన్నుఁ జూడవలసినదే. కాని, తపోవనవాసులు చాలాసేపు పురములలో నుండఁ జాలరు. నేను బోవలసియున్నది. కాలయాపన చేయక త్వరగా రమ్ము.

రాము—అట్లే చేసెదను. (నిష్క్రమించును)

సుమంత్రుఁడు—[ప్రవేశించి] మిథిలేశ్వరా! భార్గవమహర్షితోఁ గూడ దయచేయవలసిన దని వసిష్ఠవిశ్వామిత్రులు కోరుచున్నారు.

శతా-పర—వా రెక్కడ నున్నారు.

సుమ—దశరథమహారాజుదగ్గఱ నున్నారు.

(అందఱు నిష్క్రమింతురు)

ఇది ద్వితీయాఙ్కము

*

ఓం నమః పరబ్రహ్మణే

# మహావీరచరిత్రనాటకము

## తృతీయాఙ్కము

[ కూర్చుండి వసిష్ఠవిశ్వామిత్రులు పరశురామ
శతానందులు ప్రవేశింతురు ]

వసి.-విశ్వా—జామదగ్న్య తపోధనా!

చ. సురపతి కాప్తమిత్రుఁ డరిసూదనుఁ డాహవశూరుఁ డుత్తమా
ధ్వరములఁ దీరినట్టివసుధాశతమన్యుఁడు సూర్యవంశభూ
వరుఁడు మునిప్రియుండు సుతవత్సలుఁ డెంతయుఁ బెద్దవాఁడు బం
ధురతరకీర్తి యీదశరథుండు నినుఁ బ్రతిమాలు శాంతికై.

కావున నిష్కారణవైరముతోడియీకలహము విడిచి పెట్టుము-శ్రోత్రియుండవు. శ్రోత్రియులయింటి కతిథివై వచ్చితివి. అదిగో వత్సతరీపలలము సద్యోఘృతపక్వము సిద్ధము. సుఖముగా నారగింపుము.

పరశు—మిత్రులారా! నా దొక్కమనవి. రాముఁడు పరాక్రమశాలి కాఁడేని యట్లే చేయుదునుగాని చూడుఁడు,

ఉ. వింత లొనర్చి రాచపసిపిల్లఁడు తన్నుఁ బరాభవింప రా
జాంతకుఁ డెట్టు లోర్చె నవురా యనరే? నను మీరు కోరఁ శాం
తింతునుగాక, దీని గణుతించు నెవండు? నిజం బెఱుంగువాఁ
డంతటఁ జాటి చెప్పఁడు గదా! మఱిరొట్టులు పూన్కి మానుదున్?

అదియును గాక మఱొక్కమాట.

గీ. విశ్వ మంతటఁ దెల్లగా వెలయునట్టి
కీర్తి కేపాటిమాట సోఁకినను జాలు
దానిఁ గొని యల్లుకొను కింవదంతివలన
మచ్చయేర్పడెనా; మఱి మాపఁగలనె?

వసి—వత్సా భార్గవా! బ్రతికి యున్నంతకాల మీయాయుధపిశాచము నిన్ను వదలదా? వేదవేత్తవు కదా? మంచిత్రోవ ద్రొక్కుము. అరణ్యసంచారివి కదా! చిత్తశుద్ధి గలిగించు మైత్రి, కరుణ, నిత్య సంతుష్టి, ఉపేక్ష యనెడి నాలుగుభావనలు పరిశీలింపుము. అట్లు చేసితివేని దుఃఖహారిణి యగుజ్యోతిష్మతి యనెడియోగవృత్తి సుప్రసన్న మగును. దానివలనఁ గామక్రోధాదు లణఁగారును. బహిస్సాధనముల సాధింపరానిసామర్థ్య మలవడును. ఋతంభర మనెడియంతర్జ్యోతి ప్రకాశించును. అదియే పరమాత్మ సాక్షాత్కారము. బ్రాహ్మణుఁ డగువాఁ డపమృత్యుహరము పాపనాశకము నైన ప్రజ్ఞాన మార్జింపనగును. నీవట్లు చేయక విరుద్ధ వ్యాపారమునఁ బ్రవేశించినావు. ఇది తగదు. ఈకుఠారము నీకేల? ఇది మహర్షులసభ. చూచితివా? రోమపాదుఁడు సీరధ్వజుఁడు కుశధ్వజుఁడు దశరథుఁడు మొదలగువారందఱు నిన్నుఁ గోరుచున్నారు. కావున మామాట విని యీవృథాకలహము విడిచిపెట్టుము.

పరశు—అయ్యా! నీవు చెప్పిన దంతయు సత్యమే కాని శత్రుమూల మూడఁదీయక నాగురువు లగుపార్వతీపరమేశ్వరుల మొగము చూడఁజాలను.

విశ్వా—నీవు గురుజనమున నంతభక్తి కలవాఁడవేని వీరినిగూడా యట్లే భావింపుము. వసిష్ఠుఁడు భృగువు అంగిరసుఁ డనుమువ్వురును జతుర్ముఖబ్రహ్మ కుదయించినవారు. ఆయన వసిష్ఠమహర్షి

కదా! ఇతఁ డంగిరోమహర్షిప్రపౌత్రుఁడు శతానందుఁడు, నీవు భృగుమహర్షి కైదవ తరమువాఁడవు. కావున నీకు వసిష్ఠశతానందులు గురుస్థానీయులు కారా?

పరశు—గీ. పరమపావన మైనబాపలకు వినని
పాపమున కొక్కనిష్కృతి పడయువాఁడఁ
గాని విడువంగఁజాల నీకాలమందు
సచ్చరితులార! నాదుశస్త్రవ్రతంబు.

నాకు ముక్తికంటెను గూడ మానరక్షణమే ప్రియతరము. వీరును నేనును సనాథుల మైనను నాభుజము నారికాయలతోఁ గర్కశమై యున్నది.

విశ్వా-(తనలో) మాటిమాటికి దనమహత్త్వము వెళ్లఁగక్కు నితనిమాటలు నిజముగా నొప్పి కలిగించుచు నోళ్ళు జల్లు మనునట్లు చేయుచున్నవి.

పరశు—ఆర్యా! కుశికనందనా!

గీ. మావసిష్ఠుఁడు తాత యామార్గ మెఱుఁగ
నీవు తొల్లింటివీరుఁడ వెఱుఁగు దింత,
నేను భృగువంశమునఁ బుట్టి పూనినాఁడ
శస్త్ర మది తప్పొ యొప్పొ? నిజంబు చెప్పు.

వసి—(తనలో) గీ. గుణములంబట్టి యీతఁడు గొప్పవాఁడె
కాని, ప్రకృతినిబట్టి రాక్షసుఁడు నిజము,
చేత వ్రాత మనంబునఁ జేష్టలందు
గర్వమే తప్ప వేఱొండు కానరాదు.

విశ్వా—వత్సా! ఒక్కమాట చెప్పుచున్నాను విను, ఎవఁడో, ఒకఁడు తప్పు చేసె నని మూఁడేడుమాఱులు సకలక్షత్రియజాతిని నిర్మూలించియు బ్రాహ్మణానుగ్రహంబున నది యించుక చిగురెత్తుట

జూచి మరల నీవు గొడ్డలి చేపట్టినపుడు చ్యవనాదివృద్ధ మహర్షులు నిన్ను వారింపలేదా? అపుడు నీ వావని మాన లేదా? అవిడిచినశస్త్రము మరలఁ బట్టుట యుచితమా?

పరశు—ఔను. పితృవధనిమిత్తమైనక్షత్రియసంహార వ్యాపారము నుండి విరమించినమాట నిజమే. ఇందులో దాఁపఱిక మే మున్నది?

గీ. విల్లు కోలలు పెఱికినవిమలవిహీన
పర్వము ట్లుండె నీపరశ్వథము మాత్రి
మడవి సమిధలు నఱుక సహాయ మయ్యె
నప్పు డీమాట నిజమె యిఁకెన్న నేమి?

శివధనుర్భంగము గావించి రఘుకులబాలుఁడు నాకోపాగ్నితో నీకుఠారంబును మరల లేవఁగొట్టినాఁడు. నే నేమి చేయుదును?

గీ. ఇపుడు రాముని బరిమార్చి నేను వనికిఁ
జనినపిమ్మట రఘువంశజనకవంశ
రాజు లెల్లరు సుఖముగా బ్రతుకవచ్చు
మరల రా దిట్టిగొడవ నామాట నమ్ము.

శతా—ఆఁ! ఏమన్నావు? జనకమహారాజునకును, అతనిపురోహితుఁడనైననాకును క్షేమపాత్రుఁడైనరాముని గాదు కదా, అతనినీడనైన నీవు చేరఁగలవా?

చ. గురుతరసత్యధర్మమణికుడ్యగతం బగునీవిదేహభూ
వరునిగృహంబునన్ వెలయువహ్నుల మే మని యెంచు, మట్టిమం
దిరమును నిందపాల్పఱుప నీతరమే నిఁక నెందు కస్మదాం
గిరసకులప్రభావమును గీర్తియుఁ జిచ్చునఁ బెట్టి కాల్చనా?

విశ్వా—వత్సా గౌతమా! మేలుమేలు. నీచే విదేహరాజు కృతకృత్యుఁ డయ్యెను.

క. హితుఁడవు విప్రుఁడవు పురో
హితుఁడవు నై రాజ్యరక్ష యీ వొనరింపక
మతి శక్కిన దీమిథిలా
పరిపాలన మద్భుతప్రభావం బగుచున్.

పరశు—గౌతమా! నీవలె నెందఱో రాజపురోహితులు బ్రహ్మతేజము ప్రకటించిరికాని, అది మాయసాధారణ తేజస్సుదగ్గఱ నాఁగునా?

శతా—(కోపముతో) ఓరీపశుపాత్రియా! ఏమన్నావు? పురుషాధముఁడవు రాజకులద్రోహివి దురాచారుఁడవు ఘోరకర్ముఁడవు వికృతవేషుఁడవు. నీవా తారతమ్యము లెన్నువాఁడవు? అపూర్వపాషండా! ఆయుధజీవీ! నీగంతులు నాదగ్గఱనా? నీవుకూడా బ్రాహ్మణుఁడవేనా? ఆహా! యేమినీబ్రాహ్మణత్వము?. ఎంత బాగా వెలుఁగుచున్నది!

క. తల్లిని నఱికితి వావసి
పిల్లల నఱికితివి సవనవిధి నుండిసరా
ట్లల్లజుల నఱికి తీ విది
యొల్లం గన బ్రహ్మహత్య కెనగా దఁటరా!

పరశు—ఓకీస్వస్తివాచనికాధమా! సామంతపురోహితా! అహల్యా పుత్త్రునికి నీకు నే నాయుధజీవినా?

శతా!—ఛీ! భృగుకులపాంసనా! నోరుమూయుము. ఈమహర్షులు మహారాజులు నిన్ను క్షమింతురేమో కాని నేనుమాత్రము క్షమింపను. (అని కమండలూదక మాచమించును)

(తెరలో) ఎవరండీ! అక్కడ? పెరుగుతోఁ గలిపిననెయ్యి హోమము చేసి తోఁలువిసనకఱ్ఱతో విసరఁగాఁ జటచటలాడుచుఁ బైకి లేచు నగ్నిహోత్రునివలె మండిపడుచున్న యాంగిరసుని శాంతింపఁ జేయుఁడు.

శతా—(శాపోదకంబు చేతఁబట్టి) సభాసదులారా! పిడుగు భూరుహంబుంబోలె నీపరమదుర్మార్గుఁడైనపరశురాముని భస్మముచేయుచున్నాను, చూడుఁడు.

(తెరలో) మహాత్మా! శాంతింపుము ఇంటికి వచ్చినబ్రాహ్మణుని జంపరాదు. భృగువంశమునఁ బుట్టి చదువుకొన్నవాఁడయ్యు నపమార్గము త్రొక్కెనేని, యతని శిక్షింప రాజు లున్నారుకదా! నీవు శాంతింపుము.

వసి—(శాపోదక మొకఁజిమ్మి) వత్సా! శతానందా! దశరథమహారాజు చెప్పినట్లు విను. రాఘవునికి జయలక్ష్మిని గూర్పఁ జాలుకృత్యములు మనము చేయుట యుక్తము. జాబాలిప్రభృతు లగుశిష్యులం గూడి యనిష్టపరిహారముగా శాంతిహోమములు చేయుము. వామదేవమహర్షి మాశిష్యులం గూడి శత్రుపరాభవార్థంబు లగుసూక్తంబులును సామంబులును బఠించును. ఇది మనవంటివారికిఁ దగినమార్గము. ఇది శ్రేయస్కరము.

శతా—సరే. (పరిక్రమించి నిష్క్రమించును)

పరశు—రాజాశ్రయమున జీవించెడియీపురోహితుని గర్జితములు విన్నారా? కానిండు. ఓకోసలవిదేహరాజానుగ్రహాజీవను లగు బ్రాహ్మణులారా! సప్తద్వీపసప్తకులపర్వతప్రాంతగోచరు లగు సర్వక్షత్త్రియులారా! మే మొక్కటి చెప్పుచున్నాము వినుండి.

ఉ. శాపసమర్థుఁడేని మఱి చాపసమర్థుఁడు నేని విప్రుఁడో
భూపతియో మదుత్తమతపోబల మస్త్రబలంబు నార్పఁగా
నాపయి వచ్చుఁగాక, రఘునందనమైథిలకోసలేంద్రులన్
బాపుల వారివంశములవారలతోఁ బరిమార్చి తీరెదన్

(తెరలో) భార్గవా! ఏమి! నీగర్వము హెచ్చిపోవుచున్నదే!

పరశు—పాపము! జనకుఁడు నాయువశేషమున కసూయపడుచున్నాఁడు కాఁబోలు!

జనకు—(సోదరతోఁ బ్రవేశించి) ఓయీ భార్గవా! ఎగిరిపడకు.

చ. పగతుర లేమిచే ముదిమి వచ్చుటచే నిగమోక్తకర్మలం
దగులుటచేఁ బరాత్పరునితత్త్వ మెఱుంగుటచే జయప్రదం
బగునిజరాజతేజ మెదయుం దొలఁచో నిదురించి యిప్పు డీ
మిగిలినవెఱ్ఱికేకలకు మేల్కొని మేల్కొలిపెన్ మదస్త్రమున్.

పరశు—మిథిలాధిపా! యేమిది!

చ. తెలిసినవృద్ధు యాగములఁ దీరినపుణ్యుఁడు యాజ్ఞవల్క్యవా
క్కుల నిగమాంతసారమును గ్రోలినవేత్త యటంచు నీగుణం
బులు కొనియాడినాఁడ నని పొంగి వివేకము మాలి భీతికిం
దొలఁగి మదించి యిట్లు నను దూషణచేయఁగఁ బూనినాఁడవే?

జనకు—ఔరా! నీగుణంబులు కొనియాడినందుకు బదులుగా నామర్మ
మునఁ బొడిచినావా? అయ్యా! వినండి.

చ. ముని యని భార్గవుం డని తపోభరితుం డని గౌరవించి యిం
దనుక సహించినారము, వృథాకలహంబునఁ గాలు ద్రవ్వునీ
తనిమద మంతకంత కతిదర్పమునన్ మము గడ్డిపోఁచగాఁ
గని చెలరేఁగుచుండె నిఁకఁ గార్ముకమే గతి వీఁడు విప్రుఁడే?

పరశు—(సక్రోధముగా) ఏ మన్నావు? కార్ముకమా! అబ్బా! కార్ముకమే

గీ. యాజ్ఞవల్క్యనిప్రియశిష్యుఁ డైనవృద్ధుఁ
డెందు కని చూచుచుండ, మహీశకంఠ
శోణశాతంబు నాపరశ్వధము గనియుఁ
జేరిలుచున్నాఁడు, వీఁ డంట! వీరుఁ డంట!!

జనకు—(సావేగముగా) ఇంక మాటలతోఁ బని లేదు.

చ. గొనమనునాల్క చుట్టుకొనుకోటియుగం బనుకొంట లొప్పఁగా
ఘనతరఘుర్ఘురధ్వనులు గ్రాలఁగ భీకరలీల, బ్రమింగఁ బూ

వినలేటి బాగుగాఁ దెలిచి సిల్పినయంతకునాస్యయంత్రమో
యన వికటోదరం బయి భయంకర మయ్యెడు విల్లు చూడుఁడీ!
(అని ధను వెక్కిడుచున్నాఁడు)

(తెరలో) వద్దు వద్దు.

క. నరవర! తొల్లిటికార్ముక
ధరుఁడవు ముదుసలివి గోత్రపదాతవు నగునీ
కర మెటు లీధరణీసుర
వరు నేయ శరాసనంబు వట్టెడు తగునా?

జన—మిత్రమా మహారాజదశరథా!

గీ. మనల సీత డు తిట్టనీ మసను దీర!
బ్రాహ్మణుఁడు తిట్టినా రాజు పగ గొనండు,
కాని, మనపిల్లవానిపైఁ గాలు లఱచు
చున్నయీపాపి దుర్ణయు మోర్వ నగునె?

పరశు—ఓరీక్షత్రిబంధూ! నేను బాపినా? ఇం కెందుకు?

గీ. రమ్ము మైథిల! నా కుఠారమ్ము నీదు
పేగు లెముకలు నరములు పెఱికి పెఱికి
కరచరణకుక్షిబాహూరుకంధరంబు
ముక్క ముక్కలుగాఁ గొట్టి పోగుపెట్టు.

దశరథుఁడు—(నడుమఁ బ్రవేశించి) భార్గవా! మామిత్రుఁడు జనకుఁ డెట్లున్నాఁడో నీవు నట్లే యున్నావు. ఇంతవఱకు వాక్కలహము వల్ల నెవరికిని జెడిపోయిన దేమీ లేదు. కాని, యిప్పటినీపలుకులు మామనస్సును నొప్పించుచున్నవి.

పరశు—అయితే మా కేమి?

దశర—అయి తే నీవు శాంతింపవా యేమి?

పరశు—ఏదో భయపెట్టుచున్నావు. నీవు కూడా మాకు శాసకుం డవా? స్వభావముచే నే నొకరిని లక్ష్యపెట్టువాఁడను గాను. ఎఱుఁగుదువా? నేను బరశురాముఁడను నీవు క్షత్రియుఁడవు.

దశర—అందుకే నీ వుపేక్షింపఁదగవు. తెలిసినదా?

చ. ఖలుల నణఁచునట్టియధికారము రాజులసొమ్ము గాన నీ
కలుషపథప్రవర్తనము గర్వ మణంచెడువార మేము నాఁ
దలంపుము, శాంతి నొందు మిఁక, ధర్మము తప్పక శాంతచిత్తుఁడై
వెలసెడిబ్రాహ్మణుండు నృపవీరుఁడు పట్టెడికత్తి పట్టునే?

పరశు—(నవ్వి—అమ్మయ్యా! నేఁటికి జామదగ్న్యుఁడు సనాథుఁ డైనాఁడు. తగినక్షత్రియులు శిక్షకులైనారు!

దశర—అరే! ఇందుకు సందేహమా?

ఉ. చిన్నతనంబుచేత నిది చెడ్డది మంచిది నా వివేకసం
పన్నత లేక రెంటికిని బా డగుదారిని బోవువానికిన్
దిన్నని మార్గమున్ గురువు తెల్పు, నెఱింగియు హద్దు మీఱుదో
షి న్నృపుఁ డేపణంచు, నటు చేయఁగఁ జో నిలఁ గీడు మూఁడదే?

విశ్వా—భార్గవా! రాజోత్తముఁడు నీకుఁ దగినజవాబు చెప్పినాఁడు.

ఉ. జ్ఞానము పుట్టదేని యది శంకితమేని విపర్యయాకులం
బేని వసిష్ఠుపాదము గ్రహింపుము. తప్పక దోష మొందెదే నీ
జ్ఞాన మనంగ నీఁడత సాక్షి, "యదేమి? యిదెల్ల నిర్మల
జ్ఞానకృతంబె" యందువో కో? చాలు సహింపరు మామహీపతుల్!

పరశు—కౌశికా! కష్టపడి చెప్పినావుకాని, యిది పొరపాటుమాట.

చ. హరుఁ బరమేశ్వరుం గొలిచి యున్నియు నేర్పినవేదశాస్త్రవి
ద్వరు నను సర్వభూవరనిబర్హణు నోర్చెదునంతవారె మీ
నరపతు? లీవసిష్ఠుఁ డభినంద్యుఁడు వృద్ధుఁడు నౌను గాని నా
సరియె వివేకమం, దెవఁడు చాలినవాఁ డిఁక నాకుఁ జూపుమా!

వసి—మాబ్రహ్మవంశములోనివాఁడును నాకు సన్నిహితజ్ఞాతియు మనుమునివరుసలోనివాఁడు నగుమాభార్గవునివల్ల నాకుఁ బరాజయము వచ్చిన దని నేను విచారింపను. అది నా కిష్టమే. కాని, మావంశములోఁ బుట్టి మావంశములోఁ బెరిగి లోక మంతయు మెచ్చుకొన్న సనాతన మైనమాసదాచారసంపద మాపిల్లవానివల్లనే పాడై యపకీర్తిపా లగుట చూడవలసివచ్చెఁ గదా యని విచారించుచున్నాను.

జన, దశ, విశ్వా—శ్రీ భార్గవా! నిర్మర్యాదా! సకలజగంబునకు సనాతనగురు వైనవసిష్ఠమహర్షిని నిరసించుచున్నావు రా! నిరంకుశం బగుమత్తగజంబునట్లు నిన్ను లొంగదీయుదుము చూడు.

పరశు—ఏమీ బెదరింపు? ఎంత యవమానము!

చ. చ్యవనునికోర్కెఁ బట్టి యపు డాఁపినకోపము మర్మదాహకం
బవుచు నణఁగియుండి, యిపు డాప్రళయానిలవేగకంపితా
ర్ణవబడబానలం బన దురంతమహోద్ధతిఁ బైకి లేచె, నీ
యవమతి కోర్వఁ జాల నిఁక నాఁపఁగఁ జాలను దీని వేగమున్.

ఆహా! దీనికిఁ దగినట్లుగా,

గీ. ఈపరాభవ మీక్షించి యాకుతార
రాజ మిరువదిరెండవరాజవధకు
జనకదశరథరాజవంశములపైకి
దుముకుచున్నది యముఁడు సంతోష మొంద.

వసి—కష్టము కష్టము.

గీ. వీఁడు మావాఁడు, కాని యుర్వీపతులకు
హాని తలపెట్టె, లొంగఁదీయంగ వలదె!
దేనికిని లొంగఁ డికఁ గన్న తెలిచి చూతు
నేని యీభృగుబాలుఁ డేమానో? యకట!

విశ్వా—ఔరా పరశురామా! బ్రహ్మతేజంబును శస్త్రసామర్థ్యంబును లేక భూతలంబు పాడుపడియున్నదని నీయభిప్రాయమా?

గీ. మమ్ము నెల్లరఁ దిట్టి కుమారరాము
నెదురుకొందువె? నే నోర్వ నింకఁ జూడు
బంధు వని చూడ కలవాటుఁ బట్టి పట్టుఁ
జాప మొకచేయి యొకచేయి శాపజలము.

పరశు—సెబాసు కౌశికా!

గీ. నూతనబ్రహ్మతేజంబు నూఁత గొనెదొ?
జాతిమర్యాదఁ జాపంబుఁ జేతఁ గొనెదొ?
నాతపంబున దహియించు నీతపంబు
నాడుగొడ్డంట నీవిల్లు నఱుకువాఁడ.

(తెరలో) పూజ్యులారా! కౌశికాన్తేవాసి యగు రాముఁడు నమస్కరించి విన్నవించుచున్నాఁడు.

గీ. విజితపౌలస్త్యుఁ డగుకార్తవీర్యుఁ గూల్చి
రాజజాతి నణంచినరాజశత్రుఁ
బరశురాముని గెల్చెడివాఁడ నేను
మరలుఁ డాపని మీ కేల మాన్యులార!

దశ—అయ్యో! రామభద్రుఁడా? ఇ దెట్లయ్యె?

జన—అనుమాన మేమి? మీ రనుజ్ఞ యిచ్చినఁ జాలును. రామభద్రునికి జయము సిద్ధము. జగదేకవీరుఁ డగునితఁడు దుష్టశిక్షకుఁడై జగతీనాయకుఁ డగు నని యీమహర్షు లందఱు నాశాసించుచున్నారు. ఇతనివిజయము విషయమున మే మందఱము పూచీపడుదుము చాలునా?

దశ—చాలు మైథిలేంద్రా! ఇంతకంటె నేమి కావలెను?

ఉ. జ్ఞాననిధుల్ తపోధనులు సత్యవచస్కులు నైన పెద్దలీ
మానులు ధైర్యశౌర్యదయమానిత మైనయవార్యశక్తిసం

ఘానము చేయుకూర్మిఁ గని ధన్యత గాంచినరాఘవుండు వి
ద్యానిధు శైవమిాగృహమునందు జనించినవాఁడు వెండియున్.

పరశు—రా, రాజపుత్త్రా! పరశురాముని గెలువఁ గలవని తలంచు చుంటివా? పాపము! గెలువ లేవు. దుర్దాంతుఁ డైన రేణుకానందనుఁడు నీ కంతకుఁడు.

గీ. రోదసీకుహరంబు మార్మ్రోఁగ నుగ్రమోఁత
యులర నాకార్ముకంబు కాలాగ్నిఁ బోలు
శరపరంపర రాజమస్తములు చీల్చి
విలయఘస్మరరుద్రుఁ డై వెలయుఁ గాక.

( అందఱు నిష్క్రమింతురు. )

ఇది తృతీయాఙ్కము.

ఓం నమః పరబ్రహ్మణే

# మహావీరచరిత్రనాటకము

## చతుర్థాంకము

(తెరలో) వైమానికులారా! మంగళము పాడుడు.

గీ. జయము జయము జయంబు కృశాశ్వశిష్య!
జయము జయ మినవంశరాజన్యులార!
జయము జయమంగళము లోకశరణ! రామ!
రాజకులశత్రుభార్గవరామదమన!

[అంత విమానస్థులై శూర్పణఖామాల్యవంతులు ప్రవేశింతురు]

మాల్య — పిల్లా! చూచితివా దేవతలందఱొక్కచోటఁ జేరిరి? ఇంద్రాదు లెల్లరు స్తోత్రపాఠకులైనారు పాట విన్నావా?

శూర్ప — తాతా! వెనుక నీవన్నమాట సరిపోయినది. ఇదంతా చూడఁగా నాయొడలు వడఁకుచున్నది. ఇపుడు చేయఁగలసిన దేమి?

మాల్య — ఏమీ లేదు. పూర్వము దశరథుఁడు కైకేయికి రెండువరములు ప్రతిజ్ఞ చేసియున్నాఁడు. ఆవరము లివ్వవలసిన దని కోరుచు నిపు డారాణి దశరథుని వద్దకు మంథర యనుపరిచారికను బంపినది. అది ఒయలుదేఱివచ్చి యిపు డిపుడే మిథిలాపురముచెంతకుఁ జేరినట్లు మనగూఢచారులు చెప్పినారు. నీవు

వెంటనే వెళ్ళి దానిశరీరములోఁ బ్రవేశించి యిట్లు చేయవలెను. (అనిచెవిలోఁ జెప్పును)

శూర్ప—ఏమో! రాముఁ డట్లుచేయునో చేయఁడో!

మాల్య—ఇక్ష్వాకువంశములో సౌజన్య మెప్పుడును వేఱుకాదు. అందులో, లోకోత్తరుఁ డైనశ్రీరాముఁడు శీలము తప్పునా?

శూర్ప—తప్పఁడే యను. అయితే మన కేమిలాభము?

మాల్య—కావలసినంత. రాముఁ డడవికి రాఁగానే యేదోయుపాయము చేసి దండకారణ్యమునకు లాగవచ్చును. అక్కడ మనవిరాధ దనుకబంధాదు లున్నారుగదా! వా రతనిని మాయచేసి పడఁగొట్టఁ గలరు. ఆసమయమున మనరావణునికి సీతాలాభము సుకర మగును. అంతకంటె నేమి కావలెను?

శూర్ప—లక్ష్మణుఁడు సహాయుఁడై యుండఁగా నది సాధ్యమా?

మాల్య—నిజమే. రామునివలె సౌమిత్రియు నస్త్రవిద్యాపారగుఁడు శూరుఁడు నగును. కాని మాయోపాయమునఁ బడఁగొట్టుట కతఁ డెంతో యితఁడు నంతే.

శూర్ప—కాని తాతా! ఎక్కడో దూరమందున్నవానిని దగ్గఱకు లాగుట, ఇంతకు మున్నెట్టివైరము లేనివానితో స్త్రీమూలక మైనమహావైరము తెచ్చుకొనుట, అనునీరెండును గూడ నాకు నచ్చ లేదు.

మాల్య—అమ్మాయీ! అట్లనరాదు. అతఁడు మనభూమికి సరిహద్దులోనివాఁడు కావున దూరస్థుఁడు కాఁడు, సమీపస్థుఁడే, తాటకాసుబాహులను జంపి, మారీచు నెగురఁగొట్టినవాఁడు మనకు వైరి కాఁడా? నిజముగా వైరియే. అది గాక, ఎంత వెదకినా రావణునివైరము తీర్చుటకు మఱియొకమార్గము కనఁబడకున్నది కూఁతూ.

మ. అతఁ డీభూమికి రక్షకుండు మన దన్యాయంబు గావించు ప
ద్ధతి, యిం కెట్టులు సామసాధ్యుఁ డగునాతం? డెందు లోకత్రయీ
పతి దానంబున కాన చేయునె? యసంభావ్యంబు భేదంబు, ని
ష్ప్రతిపక్షుం డగుశూరునం దిఁక నుపాయం బేమి చింతింపుమా!

క. మనతల దాఁటినయరిమ
ర్దనుఁ డాతం డగుట మనకు దండోపాయం
బును జెల్ల దందుచే వం
చనమే గతి, దానిమొదటిసాధనము నిదే.

ఈమెత్తు కొనసాగెనా చాలు. సీత నపహరించినపిదప నిఁక రాముఁ
డేమి చేయఁగలఁడు?

గీ. ధరణిఁ దల యెత్తుకొనలేక దాఁగియుండు
లేక యపకీర్తిపాలు కాలేక చచ్చుఁ
గాక జీవచ్ఛవం బయి చీకిపోవుఁ
గాసిచో సంధి కరుదెంచుఁ, గానియెడల.

చ. పరిభవ మోర్వఁజాలక ప్రభావము చూపుచుఁ గీడ్తో నిశా
చరుల వధింప నెత్తిన, నసాధ్యుఁడు సూర్యసమానవీర్యుఁ డ
య్యరిజవ మాఁపఁజాలఁడు జలాకర మైనను గాని రాక్షసే
శ్వరునికిఁ దొంటిమిత్రుఁ డగువాలి యణంచెడు వానియుద్ధతిన్.

కాని, ఈసందర్భములో మనపక్షమునఁ గూడా, ఆలోచింపవలసిన
దెంతో కలదు.

శూర్ప—ఏమి టది?

మాల్య—నీవు రావణునిచెల్లెలవు తెలిసినదానవు. కావున సందేహింప
కుండఁగా నామనోవేదనము తెల్పుచున్నాను విను.

గీ. క్షత్త్రియుఁడు కృత్రిమం డపకారి యగుట
సహజశత్రువు రాముండు, సహజుఁ డయ్యెఁ

బరగుణంబుల కలరి రావణుని దెగడు
మనవిభీషణుఁ డహిభయంబునకుఁ జాలు.

వినయవిహీనుఁడు మహానిద్రావ్యసనుఁడు నగుకుంభకర్ణుఁ డున్నా లేని వాఁడే. అమాత్యు లందఱును సుగుణసంపన్నుఁ డని విభీషణు నాశ్రయించుచున్నారు. ఖరదూషణాదులు దూడ తల్లిపొదుగు పీల్చునట్లు లంకేశ్వరునిధనాగారము గుల్లచేయువారే కాని బుద్ధిబలసంపన్నులు గారు. విభీషణానుగుణం బగు ప్రకృతివర్గము దోషోద్ఘాటనమున రావణునికిఁ బ్రతికూలమే కాని యనుకూలముకాదు కదా! ఈవిధముగా నంతశ్ఛిద్రములతోఁ గూడిన రావణగృహము శత్రువునకు సులభభేద్య మగుట కాటంక మేమి? ఇపు డీయంతర్భేదములు చిన్నవిగాఁ గనఁబడుచున్నను శత్రువు వచ్చి మీఁదఁ బడినపు డివి యప్రతీకారము లగును. కావున ముందుగా విభీషణు నణఁచుట కర్తవ్య మగుచున్నది. అ దెట్లు? బహిరంగముగాఁ జంపడమా? కపటోపాయమునఁ జంపించడమా? చెఱలోఁ బెట్టడమా? దేశము వెడలఁగొట్టడమా? ఇందు మొదటిదానికి వానిమిత్రు లగురక్కసు లోర్వరు. బుద్ధిమంతు లనుమానించుటకును మంత్రులకుఁ గోపము వచ్చుటకును హేతు వగును గావున రెండవదియుఁ దగదు. పైగా మన మాయోపాయము వ్యర్థ మగుటయు, వాఁడు వెళ్ళి రామునితోఁ గలియుటయుఁ గూడ సంభవించును. ఇఁక బంధింతు మేని తప్పక ఖరదూషణాదులు కోపింతురు. లేవఁగొట్టితిమేని వాఁడు వారితోఁ గలియును. అది రామునికిఁ బ్రయోజనకారియగును. అందుచే నదియు ననర్థకమే. కావున ఖరాదులవిషయము ముందుగా నాలోచింపవలసి వచ్చుచున్నది.

శూర్ప—ఆహా మంత్రిత్వ మెంత బరువు? దగ్గఱిచుట్టఱికము ముండుట చేతఁ గదా ఖరాదులవిషయ మింతదూరముగా నాలోచించు చున్నావు?

మాల్య—రాజును సేవించుమంచివంశమువారిమార్గ మిది.

శూర్ప—ఖరదూషణాదులను గలియనీయకపోతే విభీషణుఁ డేమి చేయును?

మాల్య—వాఁడు తెలివిగలవాఁడుగదా! మనవిరుద్ధాభిప్రాయము గ్రహించి తనంతఁ దానే లేచి పోవును. పోతే పోనిమ్మని మన ముపేక్షింపవచ్చును. అట్లు జరిగెనేని వానివల్ల మనము భయ పడ నక్కఱలేదు. ఏమందువా? విభీషణునికి బాల్యస్నేహితుఁడు సుగ్రీవుఁడు. అతఁడు తనయన్న యగువాలిచే లేవఁగొట్టఁబడి ఋష్యమూకమం దున్నాఁడు. మనవాఁడు తిన్నగా వానిదగ్గఱకుఁ బోవును. అపుడు తన కనిష్టుఁ డైనసుగ్రీవునితోఁ గలసియున్నం దుకో, లేక సీతను గోల్పోయి వెదకుచు వచ్చిసుగ్రీవునిసాహాయ్య మపేక్షించెడిరాము నాశ్రయించినందుకో వాలి కోపగించి వానిని జంపితీరును.

శూర్ప—అక్కడఁ బరశురాముని జయించినరాఘవుఁ డిక్కడ వాలిని జంపలేఁడా? అపుడు రామవిభీషణసమాగమము మఱింత యనర్థక మగు నని తోఁచుచున్నది.

మాల్య—అమ్మా శూర్పణఖా! అట్లయితే ఒకటే మాట

గీ. వాలినే సంహరింపఁగాఁ జాలెనేని
రాక్షసుల నెల్లఁ బరిమార్చి రాఘవుండు
విత్తనపుగింజ యైన విభీషణునకు
దైత్యరాజ్యంబు సర్వంబు దారవోయు.

శూర్ప—(కన్నీటితో) అటులైతే విభీషణుఁడా? ఇటులైతే రావణుఁడా! ఎవఁడో యొక్కఁడు... ...

శూల్య—ఏమీ విచారింపవద్దు నీకుఁ జెప్పిన పని నీవు చేయుము. జనక దశరథులవద్ద వసిష్ఠవిశ్వామిత్రులు లేకపోతే తలఁచినపని నెఱవేఱును బొమ్మ. నేను గూడా లంకకుఁ బోయెదను.

శూర్ప—(విచారముతో) అయ్యో!! అమ్మా! పుత్త్రదుఃఖ మనుభవించుటకే బ్రతికియున్నావు కాఁబోలు!

మాల్య—గీ. అకట! చత్తురె మీరు ఖరాదులార!
హా విభీషణ! పురికి దూరాదు వాలా?
రావణా! నీదుకష్ట మోర్వంగనగునె?
కైకసీ! సుతులు ముప్వురఁ గాంచ వింక.

(అని నిష్క్రమింతురు)

ఇది విష్కంభము.

[అంత వసిష్ఠవిశ్వామిత్రులు దశరథజనకులు ప్రవేశింతురు]

జన—కోసలేశ్వరా! ఇట్టిరామభద్రుఁడు కొడుకగుటంబట్టి నీవు ధన్యుఁడవు. నీవే కాదు, లోక మంతయు ధన్యము. అద్భుతము లోకోత్తరము నఖిలసద్గుణనిధానము నగు శ్రీరాముని సచ్చరిత్ర మఖిల జగతీశుభప్రదము గదా!

వసి—(విశ్వామిత్రుని గౌఁగిలించి)
క. కొనియాడఁగఁ దరమా నే
మనరాముని గొప్పతనము మన కేనియు? నో
మునిచంద్ర! రామచంద్రుని
ఘనతయె మనజన్మ సార్థకం బొనరించెన్.

విశ్వా—ఔను నిజము. రాముని మహిమ మపరిమేయపుణ్యప్రభావ భాసురము అనిర్వాచ్యము.

దశ—మహాత్మా! కుశికనందనా! అట్లు కాదు.
గీ. దీనికంతకు నిర్వ్యాజ మైననీదు
కరుణయే కారణంబు, తత్కారణంబు

దివ్యతేజంబు మాకులదేవత యగు
శ్రీవసిష్ఠులవారియాశీర్వచనము

వసి—సత్యము సత్యము. ఇదంతయు విశ్వామిత్రునియనుగ్రహమే.

క. విమలము వాఙ్మనసాతీ
తము బ్రహ్మజ్ఞానదివ్యతమము నమోఘం
బమితము నైనతపస్సా
రమె యాకౌశికుఁడు నా ధరాస్థలి వెలసెన్.

విశ్వా—మానికులభూషణా మైత్రావరుణా!

ఆ. ఆసనత్కుమారు నాత్మవిద్యను దిద్ది
యంగిరసుఁ దపంబునందు దిద్ది
వెలయునట్టినీవు వినుతింప ధన్యుండ
నైతి నీదుపల్కు లవిహతములు.

కాని, రామభద్రునిమహాత్త్వ మపూర్వము కాదు అతనిఁ గన్నవాఁడు దశరథమహారాజు.

క. ఏవారు పుణ్యమూర్తులు
పావనతరకీర్తులున్ భవచ్ఛిష్యులునై
భూవలయ మేలినా రా
వైవస్వతవిభుల మించువాఁ డితఁ డయ్యెన్.

గీ. వృత్రజంభాంతకుండు లోకత్రయీశుఁ
డైనయింద్రునియంతవాఁ డాహవములఁ
దనకుఁ దోడ్పడి జయ మిచ్చు నని తలంచి
యెన్నిసారులు కోరినాఁ డీమహీంద్రు?

ఇట్టిమహాశూరుని కట్టిమహావీరుఁడు పుట్టినాఁ డన్న నాశ్చర్య మేమి?
మహారాజదశరథా!

గీ. వాసవుని గెల్చినట్టిరావణుని గెల్చెఁ
గార్తవీర్యార్జునుఁడు, వానిగర్వ మణఁచి

పట్టి భార్గవు గెలిచె నీయాత్మజుండు
బళిర! సర్వంబు గెల్చినవాఁడు కాఁడె?

దశ — అదేమండీ! జన మట్లు విడిపోయి ప్రక్కల కొత్తిగిల్లుచున్నది?

విశ్వా — ఏమీ లేదు. జామదగ్న్యునితో రామభద్రుఁ డిటువచ్చుచున్నాఁడు. (అటు చూచి) ఔరా!

గీ. గెలుపు గాంచియు వినయంబు వెలయ నితఁడు
గురువు చెంగట దోషి యాకుఱ్ఱఁ డట్టు
లోడి లజ్జించు భార్గవు కొద్ద నొప్పె
నేమి సౌశీల్యసంపద? యేమి నేర్పు!

(అంత రామపరశురాములు ప్రవేశింతురు)

రాము — గీ. ఓమహాత్మ! తపోజ్ఞానయోగశక్తి
యుక్తుఁడవు బ్రహ్మవాదివంద్యుఁడవు నీవు,
తెలియ కపచార మొనరించితిని మునీంద్ర!
యంజలి ఘటింతుఁ గరుణింపుమయ్య నన్ను.

పరశు — వత్సా రామభద్రా! నీ వపచారము చేయలేదు, ఉపకారమే చేసితివి.

చ. తెలివికిఁ దప్పి జాతి గణుతింపక వంశచరిత్రమే నెదం
దలఁపక గర్వరోగమున దారుణకృత్యము లాచరించితిం
బలము చలంబు మీఱి, రఘుబాలక శౌర్యనిధాన! బ్రహ్మవ
త్సల! సరిగాఁ గుదిర్చితివి దాని, సుఖించెద నింక నీదయన్.

రాము — స్వామీ! అట్లనరాదు. నే నపరాధము చేయ కేమి? ఆయుధము చేతఁబట్టినంత కాల మిట్టియపరాధము దుర్యోగము సిద్ధమే.

పరశు — అట్లుకాదు. రాజుల కాయుధపరిగ్రహము న్యాయ్య మైనది. మందులకుఁ గుదురని వ్రణము మాన్ప వైద్యుఁడు శస్త్రముపట్టు నట్లె యితరోపాయములకు లొంగనిదర్పరోగ మణంప రాజు శస్త్రము పట్టుట యెంతయు సముచితము, ఆవశ్యకము.

రాము—మహాత్మా! మీతో నుక్తిప్రత్యుక్తులకు నే నెంతవాఁడను? ఇటు విచ్చేయుఁడు.

పరశు—వత్సా! నే నెక్కడికి రావలెను?

రాము—నాయనగారు మామగారు నున్నచోటికి—కాదు కాదు, పూజ్యులైనవసిష్ఠవిశ్వామిత్రు లున్నచోటికి.

పరశు—ఇపుడు నే నచ్చటికి రాలే నయ్యా! (కొంచెమాలోచించి) అయినా, నీయాజ్ఞ మీఱ వచ్చునా? (పరిక్రమించి)

జన-దశ—ఈసౌజన్యావిష్కరణము మిక్కిలి గంభీరముగా నున్నది.

రాము—పూజ్యులారా! నమస్కారములు

అందఱు—రారమ్మ వత్సా! (అని కౌఁగిలించుకు)

పరశు - పూజ్యపాదా మైత్రావరుణా! నమస్కారము. కౌశికాదులం గూడియున్నమీ కిట్లు విన్నవించుచున్నాను.

చ. గురువర! గర్వశాంతి యొనగూర్పను రాఘవుఁ డింకఁ బెద్దలన్
బరిభవదృష్టితోఁ గనినపాపము శాంతిని జెందుమార్గ మా
దరమునఁ దెల్పి కావఁదగు, ధర్మవివేకగురుండవై మహీ
భరణ మొనర్చుతొంటిమనువంశమువారిని గావవే కృపన్?

వసి—కుమారా! ఇప్పుడు శ్రోత్రియవంశమున జన్మించినవాఁడ వైతివి.

గీ. అపుడు నీదర్పమున దుఃఖ మందినార
మిపుడు నీజ్ఞానమున సుఖియించినాము
బాలకా! పెద్దవారిస్వభావ మింతె.
చాలు ననుతాపమే పాపశాంతి చేసె.

ఇపుడు నీవు నిశ్చయముగాఁ బరిపూతుఁడవైతివి.

విశ్వా—వత్సా! రామభద్రుఁడే నీపాపము హరించె నని మావిశ్వాసము రాజదండము ప్రాయశ్చిత్తమువలెనే దురితము హరించు నని ధర్మాచార్యు లందురు. అట్లు కాకపోతే పూజ్యపాదుఁడైనవసిష్ఠ

మహర్షి యీ మహీపాలుని సన్నిధిని "నీవు పరిపూతుండ వైతి" వని యెందు కనును?

రాము — ఇవి పరబ్రహ్మసాక్షాత్కారు లగు మహనీయ మహర్షుల ప్రసన్న గంభీర పావనోక్తులు.

దశ — మహాత్మా భార్గవా!

క. జననంబునఁ బావనుఁడవు
నినుఁ బావనుఁ జేయఁ జాలునే యే దైనన్?
అనలంబును దీర్థోదక
మును వేఱొక దాన శుద్ధిఁ బొందఁగ వలెనే?

పరశు — అమ్మా వసుమతీ! నాకు వివరదానంబు చేయుము చాటునఁ బడియుందును.

జన — మునీంద్రా! ప్రసన్నుఁడ వైతి వేని మాయందు విశ్వాసముంచి సుఖోపవేశాదికమున మా గృహము పవిత్రము చేయుము.

పరశు — యాజ్ఞవల్క్యశిష్యా! రాజన్యశ్రోత్రియా! నీయిష్టప్రకారము చేసెదన్. (అందఱు కూర్చుందురు)

దశ —

చ. వనముల నుండి యోగము తపం బొనరించెడువారు మీరు, మా
పనుల మునింగియున్న గృహవాసుల మే మది గాన మున్ను ద
ర్శన మొసరింపలేక యుపచార మొనర్పతి మయ్య! నేఁడు మా
జననము ధన్య మయ్యె మునిచంద్ర! ఫలించెను బూర్వపుణ్యముల్.

గీ. ఏమని నుతింతు వినుతిపై నెసఁగు నిన్ను!
నేమి యీఁగల ధర నెల్ల యిడిన నీకు?
నెట్లు సేవింతు సంగవిహీను నిన్నుఁ?
దనయులం గూడి నీవాఁడ ననుట తప్ప.

పరశు — మీరు బ్రాహ్మణభక్తులు. ఇట్లు గౌరవించుట యాశ్చర్యము కాదు.

గీ. అఖిలజగతీప్రకాశకుఁ డైనసవిత
వంశకర్త, వసిష్ఠుండు వంశగురువు,
సకలవేదోక్తకర్మనిష్ఠాగరిష్ఠు
లెల్లవారట్టిమీవంశ మెన్నఁదరమె?

చ. హరిహయుభీతిఁ బాపినశరాసనశక్తియు నేఁడు దీవులం
దిరముగ నున్నయాపనులఁ దీరినయాగపవిత్రభూములున్
ధరణికి గంగ దెచ్చుట సధర్మమహీహితశాసనంబు సా
గరరచనంబు నా వినుతి గాంచవె మీమహనీయకృత్యముల్?

**వసి, విశ్వా**—(తమలో) క్షత్రియశత్రువునకు క్షత్రియశ్లాఘనము నేర్పినాఁడు మనరామభద్రుఁడు.

**పరశు**—రామచంద్రా! నే నడవికిఁ బోవ ననుజ్ఞయిమ్ము.

**విశ్వా**—నాకుఁ గూడా-జనకునికూఁతుళ్ళకు దశరథునికొడుకులకు వివాహము లైనవి. ఆశుభము కన్నులపండువుగాఁ జూచినాను. మఱియు భార్గవునివినుతి గన్నరఘుబాలునియభివృద్ధిఁగని మనసార నానందించినాను. ఇంకఁ బరమప్రేమాస్పదుఁ డగుబాలు నొక్కమా రభినందించి సుఖముగా నాయాశ్రమమునకుఁ బోయెదను.

**దశ**—నాయనా! గురువర్యుం డగుకౌశికుఁడు ప్రయాణ మగుచున్నాఁడు.

**విశ్వా**—(కన్నీరొలుక రాముని గౌఁగిలించి) కుమారా! నాయంతట నేను నిన్ను విడిచిపోవుట లేదు. ఇఁక నేమన?

గీ. నిఖిలవేదోక్తకర్మనిర్ణిద్రసిరియుతి
కర్మరతస్వేచ్ఛ కడ్డంబు గలుగఁజేయు,
ఆహితాగ్నులగార్హస్థ్య మాగమోక్త
కర్మరాహిత్యమున దోషకలిత మగును.

**వసి**—సిద్ధాశ్రమమునుండి జనకచక్రవర్తిగారియింటికి నిక్కడనుండి యక్కడికి వచ్చిపోవుటకు స్వాతంత్ర్యమున్నది గదా!

విశ్వా—మహాత్మా: నాయందు దయగలదేని నీవుకూడా దయచేయు మిద్దఱము పోవుదము. నిన్నుఁ దీసికొని వెళ్ళితినేని మామధుచ్ఛందసునితల్లి యెంతో సంతోషించి గౌరవించును.

వసి—నన్ను మీయింటికి రమ్మనుట కింత గావలెనా? ఇంతమాత్రానికి నాయెడ నీ కధికారము లేదా?

జన-దశ—సంతోషము సంతోషము. ఈబ్రహ్మర్షిసమాగమ మెంతేని మనోహరము.

గీ. ఒకరిమహిమంబు చక్కఁగా నొక రెఱుఁగుదు
రొరు లెఱుంగఁగరాని దిర్వురమహత్త్వ
మట్టివీరివిరోధమే నలరు ననఁగ
స్నేహ మలరారు నని వేఱె చెప్పనేల?

(తెరలో) శ్రీరామపత్ని పెద్దలందఱికిఁ జేతులు జోడించి మ్రొక్కుచున్నది.

ఋషులు—అమ్మా జానకీ!

గీ. ప్రథితవీరుండు నీమనోవల్లభుండు
దేవవల్లభురిపుబాధ దీర్చి నంత
వీరశేఖరుసతికిఁ గావించుపూజ
చేయుఁ గావుత శచి నీకుఁ జిత్తమందు

రాము—(తనలో) రక్కసులదుంప పెల్లగించినపిదప నిది సిద్ధించును.

వసి, విశ్వా—మీ రిట్లనోన్యసౌహార్దంబున వర్ధిల్లుదురుగాత. (అని లేచుచున్నారు)

ఇతరులు—(లేచి) పూజ్యులారా! నమస్కారము.

పరశు—మహర్షులారా! వందనము.

వసి, విశ్వా—గీ. నీశమము నిశ్చలంబయి నిలుచుఁగాత
నీదువిజ్ఞాన మమలమై నెగడుఁగాత

గాఢకల్యాణసత్యసంకల్ప మగుచు
నీమనం బాత్మనిష్ఠ శాంతించుఁగాత.

(అని నిష్క్రమింతురు)

పరశు—(కొంచెము నడచి యాఁగి) వత్సా రామభద్రా! ఒక్కమా ఱిటు రమ్ము.

రాము—(వచ్చి) ఏమి సెలవు?

పరశు—సమిధలు నఱుకకొనుట కుపయోగించును గావున నీగొడ్డలి నావద్ద నుండఁదగును గాని, క్షత్త్రియవధనుండి విశ్రమించిన యీకార్ముకము నా కెందుకు? నిష్ప్రయోజనము.

ఉ. పుణ్యతరంగిణీనికటభూముల నెల్లెడ దండకాటవిన్
బుణ్యశరీరు లైనమునిపుంగవు లుండిరి వారి నొంపఁగాఁ
బుణ్యజనుల్ గడంగి రని మొన్న వినఁబడె వారిఁ గూల్చి ని
న్గణ్యతి కెక్కఁజేయు నిది గాన గ్రహింపుము దీని బాలకా!

(అని తనశరాసనం బర్పించును)

రాము—(గ్రహించి నమస్కరించి) మీయాజ్ఞకు బద్ధుఁడను.

పరశు—(సాసముగాఁ బరిక్రమించి) నాయనా! ఉండుము.

(అని నిష్క్రమించెను.)

రాము—(సబాష్పముగా) భార్గవుఁడు మహానుభావుఁడు. వెళ్ళిపోయెను. (ఆలోచించి) ఈయనతో నే వెళ్ళుట యెందుకు? ఏదో మఱి యొకయుపాయమున నేను దండకాటవికిఁ బోవచ్చును. అయితే, పెద్దలందఱు నామీఁదనే ప్రాణములు పెట్టుకొనియున్నారు గదా! నా కది సాధ్య మగునా?

గీ. శస్త్రసన్న్యాసి యయ్యెనా జామదగ్న్యుఁ?
డేఁ బరాధీనవృత్తి నా? యింక నెట్లు?
కటకటా యాశ్రమంబులు కదలిపోవఁ
డఱుమరే రాక్షసులు తపోధనుల నెల్ల?

తెరలో) అన్నా! మనతల్లి కైకేయిచెలికత్తె యగుమంథర యయోధ్య నుండి నిన్నుఁ జూడ వచ్చినది.

రాము — మంచిది. మనము దూరదేశమం దెట్లున్నామో యనెడివిచారము పోవును గావున దానిని రానిమ్ము.

[అంత లక్ష్మణుఁడును మంథరావేషముతోడిశూర్ప ణఖయుఁ ప్రవేశింతురు]

శూర్ప — (తనలో) నేను మంథరలోఁ బ్రవేశించి వచ్చినందుకు వసిష్ఠ విశ్వామిత్రులు వెళ్ళిపోవుట లాభించినది. (చూచి) పరశురాముని జయించినరాజకుమారుఁ డితఁడా? ఆహా! ఏమి యంగసౌష్ఠవము! ఏమి సౌందర్యము! వీనిలావణ్యము నయనానందదాయక మగుచున్నది గదా! ఔరా! వైధవ్యమువలనఁ జిరకాలముగా సంసారసుఖ మెఱుఁగనిదాని కైనా, యితనిఁ జూచినంతనే మనస్సు చలింపక పోదు.

రాము — (సమీపించి) మంథరా! అమ్మగారు కుశలముగా నున్నారా?

శూర్ప — సుఖముగా నున్నది. పుత్త్రప్రేమపూర్ణురా లైనయామె నీకిట్లు సెలవిచ్చుచున్నది. "కుమారా! పూర్వము మీనాయనగారు నాకు రెండువరములు ప్రతిజ్ఞ చేసియున్నారు. ఆవరములిపు డీయఁ గోరుచు వ్రాసినజాబు నీకుఁ బంపుచున్నాను. ఇది నీవు చూచుకొని యీమాట మీతండ్రిగారితో విన్నవింపవలసినది" (అని జా బిచ్చును)

లక్ష్మ — (అది పుచ్చుకొని చదువుచున్నాఁడు)

గీ. భరతుఁ డుర్వికి రాజు గావలయు నిపుడ,
జానకిని గూడి యొక్క లక్ష్మణునితోడ
రాముఁ డిప్పుడ దండకారణ్యమునకు
వెడలి పదునాలుగేం డ్లందు గడపవలయు.

రాము—మహాప్రసాదము.

గీ. అనుకొనినచోటికే పోవ నాజ్ఞయయ్యెఁ
బ్రేమపాత్రంబు సీత నావెంట నుండుఁ,
దమ్ముఁడును గూడ నాతోడఁ దరలివచ్చు,
నమ్మ కైకేయి! కరుణించితమ్మ నన్ను!

లక్ష్మ—నేను వెంట నుండుట కన్న సమ్మతించినాఁడు. చాలును.

రాము—ఆర్యా మంథరా! ఇదిగో బయలుదేఱుచున్నాను.

శూర్ప—ఆహా! ఇట్టి కల్పవృక్షములు పుట్టుటంబట్టి, సంసారముకూడఁ బూజనీయ మగుచున్నది. (అని నిష్క్రమించును)

లక్ష్మ—అన్నా! మనమామ యుధాజిత్తు మేనల్లుఁడైనభరతునితో నాయనగారివద్దకు వచ్చుచున్నాఁడఁడుగో!

రాము—అయ్యో! చిక్కు వచ్చినదే!

గీ. భరతు నొకమాఱు కౌఁగిటఁ బట్టుకొండఁ
గాలు కదపఁగఁ జాలను గాన కేగ,
మన మడవి కేగుచున్నార మనుచు దుఃఖ
మందు నాతని మొగము నే నరయఁజాల.

యుధాజిద్భరతులు—(ప్రవేశించి దశరథునిసమీపించి) మహారాజా! ప్రజ లందఱు నేకగ్రీవముగా మీ కిట్లు విన్నవించుచున్నారు.

గీ. వేదములఁ బ్రోవఁ దగినట్టివీరవరుఁడు
మీకుమారులలోఁ బెద్ద లోకమాన్యుఁ
డైన శ్రీరాము నిపుడు రాజ్యమున నిల్పి
మామనోరథ మీడేర్పుమీ మహీశ!

దశ—మిత్రమా! జనకా! వింటివా? శ్రేయస్కాములైనపౌరజానపదు లెల్లరు రామాభిషేకము వాంఛించుచున్నారు. సమయమునకు వసిష్ఠవిశ్వామిత్రులు లేకపోయినారుకదా!

జన—గీ. లేకయున్నను మూర్ధాభిషేకవార్త
వినిరె వారలు రాము దీవింపఁగలరు,
మంత్రసహితుండు మునిజనమాన్యుఁ డైన
వామదేవుండు కలఁడు సర్వంబు నడప.

దశ—అయితే సంతోషమే. పరశురామవిజయోత్సవము పట్టాభిషేక మహోత్సవముతోఁ గలిపి చేయుదము. ఈసమయమున నెవ రేమి కోరిన వారి కది యిచ్చుటయే కర్తవ్యము.

రాము—(సమీపించి నమస్కరించి) నే నొకటి కోరుచున్నాను.

దశ—ఏ మది నాయనా!

గీ. తొల్లి యిచ్చినవరములు తల్లి కైక
కోరుచున్నది యిపు, డామెకోర్కి దీర్పఁ
గోరుచున్నాఁడ నేను సౌమిత్రిఁ గూడి
యావరము లిచ్చి సత్యంబుఁ బ్రోవుమయ్య!

గీ. సత్యసంధులు రఘువంశసంభవు లని
తెలిసియును సంశయించెద వేమి పుత్ర!
ఆమెమాతగ వచ్చి నీ వడుగుచుండఁ
బ్రాణమే నీయ నెవఁడు మాన్పఁ బోవు?

రాము—తమ్ముఁడూ! చదువు.

లక్ష్మ—గీ. భరతుఁ డుర్వికి రాజు గావలయు నిపుడ,
జానకిని గూడి యొక్కలక్ష్మణుని తోడ
రాముఁ డిప్పుడ దండకారణ్యమునకు
వెడలి పదునాలుగేండ్లను గడపవలయు.

(అని చదువును)

అందఱు—అయ్యో! ఇ దేమిటి? చచ్చినామే!

దశ—(మూర్ఛిల్లును)

రా. ల—తండ్రీ! ఊరడిల్లుము. (ఉపచరింతురు)

జన—ఔరా! యెంతమాట? కేకయవంశమునఁ బుట్టినదా? దశరథ మహారాజును బెండ్లాడినదా? ఉత్తమురాణి పేరు గాంచినదా? ఆమె యింతటిరాక్షసకృత్యమున కొడఁబడునా? ఇ దేమో మిక్కిలి యద్భుతముగా నున్నది.

రాము—గీ. ఆడి తప్పుట యెఱుఁగనివాఁడ
రాఘవునియందు నీ కనురాగ మేని
తాతపాద మహాత్మ! మాతల్లికోర్కె-
వెంటనే తీర్చెద వటంచు విశ్వసింతు.

దశ—అట్లే కానిమ్ము. ఇంక వేఱే గతి యే మున్నది?

జన—హా రామభద్రా! హా లక్ష్మణా!

గీ. జ్యేష్ఠపుత్త్రుని రాజ్యాభిషిక్తుఁ జేసి
వృద్ధు లిక్ష్వాకునరనాథు లే వ్రతంబు
గడపి రా పుణ్య మారణ్యక వ్రతంబు
పాలబుగ్గలపిల్లలపాలఁ బడెనె?

అమ్మా కుమారి! అత్తచూపల యానతిచే నీకు భర్తతో వెడలుభాగ్య మబ్బినది. ధన్యురాలవు.

దశ—హా వత్సా! జానకీ! పెండ్లికంకణాలతోనే రాక్షసుల కుపహార మైతివా?

(రాజు లిద్దఱు మూర్ఛిల్లుదురు)

రాము—లక్ష్మణా! పెద్దప్రాణంబులు సొమ్మసిల్లినవి. ఇపు డేమిగతి?

లక్ష్మ—ప్రేమాతిశయము మూలముగా సంభవించినదుఃఖ వేగ మిట్లే యుండును. ఇందు మనము చేయున దేమున్నది? ఇంతకును మనము తల్లియాజ్ఞను బట్టి వెంటనే వెళ్ళవలెను గదా! కావున మన మిపుడు విచారించినలాభము లేదు.

రాము—మాచక్కఁగాఁ జెప్పినావు. నీగురుజనవాక్యానుసరణనిష్ఠ యెంతయు సముచితము. నీమనోబలము లోకోత్తరము. అయితే వెళ్ళి సీతను దీసికొనిరమ్ము.

(లక్ష్మణుఁడు నిష్క్రమించును)

భర— మామా! ఇది మీవంశమునకుఁ దగినపనియేనా?

యుధా—అబ్బాయీ! నాబుద్ధి చెదరిపోయినది.

ఉ. కాలునిమందిరంబుఁ జొరఁగా బయనంబగుచుండె బావ, యీ
బాలకు లిద్దఱున్ వనముపా లగుచుండిరి, సీత రాక్షసా
భీలముఖంబుఁ జొచ్చు, దురపిల్లును లోకము, లోకనిందకున్
బా లగుమాకులంబు, కులపాంసన యందురు కైక నెల్లెడన్.

[ అంత లక్ష్మణుఁడు సీతయుఁ బ్రవేశింతురు ]

సీత—మామగారియనుమోదము గాంచితిని, ధన్యురాలను.

లక్ష్మ—అన్నా! ఇదిగో పూజ్యురాలు.

రాము—ఇటు రండు (అనుచు వారిం గూడి తండ్రికి జనకునికిఁ బ్రదక్షిణముచేసి) మామా!

క. జనకుఁడు జనకుఁడు తల్లులు
ననుజన్ములు సత్తు లాప్తు లందఱు దుఃఖం
బునఁ గుందకుండఁ జూడం
జనుఁడయ్యా! మేము వనికిఁ జనుచుంటి మిఁకన్.

యుధా—(తొందరతో) అయ్యో! అడవికేనా? (వెంటఁబడును)

భర—(వెంటఁబడి) మామా! నే నిపు డేమిచేయుదు?

యుధా—నీపాదసేవచేయుటకై యడవికి వచ్చుచున్నభరతుని జూడుము.

రాము—పెద్దవారితనిని వర్ణాశ్రమరక్షణమునకు నియోగించిరికదా!

భర—ఆపని లక్ష్మణుఁడో శత్రుఘ్నుఁడో చూచుకొనును.

రాము—ఈవిషయమున మనయిష్ట మేమి?

భర—నీతో వచ్చుటమాత్రము నా కిష్టము.

రాము—నేను జీవించియుండఁగా నీవు గాని మఱియొకఁడు గాని తండ్రి గారిమాట దాఁటవచ్చునా?

భర—అయ్యో! నేను రాఁజాలనా? (మూర్ఛిల్లును)

యుధా—(ఊరడించి) భరతా భరతా!

భర—(లేచి) మామా! ఎట్లయిన నాకు గతి చూపుము.

యుధా—ఇట్లు చేయుదము (చెవిలోఁ జెప్పి) రామభద్రా! శరభంగ మహర్షి నీకుఁ బంపినబంగారుపాదుక లితఁడు కోరుచున్నాఁడు.

రాము—(వానిని విడిచి) తమ్ముఁడూ! తీసుకో.

భర—(వాటిని నెత్తిని బెట్టుకొని) అన్నా! నా యెడ నింతేనా నీయనుగ్రహము?

రాము—(కౌఁగిలించి) ఇంక మాఱుపలికిన నాపాదములతోడే. వెనుకకు వెళ్ళుము. మూర్ఛిల్లిన పెద్దలగతి చూడుము.

భర—సరే. మీచిత్తము. నీపాదుకల కభిషేకము గావించి నేను జటావల్కలధారినై నీవు తిరిగి వచ్చునంతవఱకు నందిగ్రామమున నుండి రాజ్యపాలనము గావించుచుందును. (అని సీతారాములకు ప్రదక్షిణము చేయును)

లక్ష్మ—అన్నా భరతా! నమస్కారము

భర—(కన్నీరొలుక నతనిఁ గౌఁగిలించును)

రామ—వత్సా! ముందుగా మనపెద్దలను జూడుము.

భర—(మరలివచ్చి) అక్కటా! ఇప్పటికిని వీరి కూపి రాడుట లేదు. (విసరును)

జన—(తెలివొంది యెంతటఁ జూచి) మోసపోయితిని. హా! హా!

దశ—(తెలివి గాంచి) నాయనా రామభద్రా! వెళ్లకు వెళ్ళకు.

గీ. క్రొత్తరోగంబు మర్మముల్ కోయుచుండెఁ
బ్రాణములు పోవుచున్నవి బ్రతుక నింకఁ

గటికిచీఁకటి నుంటి నాకన్నకొడుక!
రమ్మ నను బల్కరింపు మొగమ్ము చూపి.

నాయనా! నే నెక్కడ దిగను? అయ్యో! దైవమా! ఎంతయభాగ్యుఁడను? హాకుమారా హా రామా! (జనకభరతు లతనిఁ దీసికొని పోవుదురు)

యుధా—వత్సా రామభద్రా!

గీ. ఎట్టు లాబాలగోపాల మీపురంబు
గొల్లుమని యేడ్చుచుండెనో గోల వినుము,
బాట లెల్లను వారికన్నీటఁ దడిసి
బాడిరై నేఁడు దుర్దినం బనఁగ నుండె.

రాము—మామా! నీ వుండుము. భరతుని గనిపెట్టుచుండుము.

యుధా—కుమారా! నేను నీతో వచ్చెదను.

రాము—మామా! అట్లన వచ్చునా? నాకు నీ వనుసరింపఁదగుదువు గాని, నన్ను నీ వనుసరింపఁ దగవు. అది గాక, నాతో ముగ్గురము మాత్రమే యడవికిఁ బోవలెనన్న మాతల్లిమాట మఱచితివా?

యుధా—నే నొక్కఁడనే యిట్లు కోరితి ననుకొంటివా?

ఉ. మాపుల యజ్ఞపాత్రములమూటలు దాలిచి హోమధేనువుల్
క్రేపులు గార్హపత్యము ధరించినభార్యలు వెంబడింపఁగా
నీపురి మీపురిం గలమహీసురు లెల్లరు సూర్యరశ్మి నీ
పై పడకుండఁగా గొడుగు పట్టఁగ వచ్చుచునుండి రల్లదే!

రాము—మామా! ధర్మలోపము గలుగకుండఁ బెద్దలు పిల్లలను రక్షించుట ధర్మము, దయచేసి నీవు వెనుకకు వెళ్ళి యామహాజనమును మరలింపుము. నమస్కారము.

యుధా—అబ్బాయీ! సరే కానిమ్ము. వారికి సచ్చెప్పి వెనుకకుఁ బంపి నే నెక్కడికో పోయెదనులే. అమ్మా జానకీ! కుమారా! సౌమిత్రీ! ఈపాపాత్ముఁడు మిమ్ము విడిచిపోవుచున్నాఁడు మీ కందఱికి శుభ మగుఁ గాక. (దుఃఖముతో మరలి) ఆహా రాముఁడు జగద్వంద్యుఁ డయ్యెఁ గదా!

క. ప్రతియుగమును బ్రతిదేశము
ప్రతిదినమును భక్తియుక్తిఁ బామరులును బం
డితులును విందురు చదువుదు
రతిపావన మద్భుతంబు నగురామకథన్.

(అని నిష్క్రమించెను)

లక్ష్మ—ఆర్యా! శృంగిబేరపురవాస్తవ్యుఁడును నిషాదరాజు నగు గుహుఁడు తత్ప్రాంతమందు విరాధరాక్షసుఁడు చేయుదారుణ కార్యములు చెప్పియున్నాఁడు సుమీ!

రాము—ఔను. వానిని సంహరించుటకై ముందుగాఁ బ్రయాగకు దగ్గఱగా గంగాపరివేష్టితమై విలసిల్లుచిత్రకూటమునకుఁ బోవలెను! తరువాత దండకాటవి కేగి క్రమముగా గృధ్రరాజున్నజన స్థానముఁ జేరుదము.

(అందఱు నిష్క్రమింతురు)

ఇది చతుర్థాంకము.

71

ఓం నమః పరబ్రహ్మణే

# మహావీరచరిత్రనాటకము

## పఞ్చమాఙ్కము

[ తరువాత సంపాతి ప్రవేశించుచున్నాఁడు. ]

సంపా—చిరంజీవి మారుతమ్మఁడు నాకు నమస్కారము చేయుటకై మలయకందరమునకు వచ్చుచున్నాఁడు. ఇది నిజమే యెటులే?

ఉ. దిక్కులు తోఁచు నొక్కపరి, తెల్లముగా నొకమాఱు, మేఘముల్
ముక్కలు ముక్కలౌట మెఱపుల్ పయికిం గనవచ్చె, హెచ్చైన
వృక్షములం బ్రుళ్లి కూలివడురాళ్ళుఖణంఖణలివ్వి యున్నియున్
దక్కక మాజటాయువుపతత్త్రిమహత్వముసాక్షు లయ్యెడున్.

చ. మరియును బాడబానల మహాంతము రేఁగి కలంచి నట్టి సా
గరమున సందు చొచ్చి వడిగా బలిసద్మము నిండినట్టి త
ద్గురుగరుదద్భుతానిలము ఘోరతరాదివరాహకంఠఘు
ర్ఘురమును గాల మేఘపటుఘోషము మించినమాడ్కి మ్రోఁగెడిన్.

జటాయువు—(ఎగురుచుఁ బ్రవేశించి)

గీ. దేనిచుట్టును గావేరి తిరిగియుండుఁ
బక్షములు లేనియన్నసంపాతి యెందు
కొండపైకొండ నాఁగఁ గూర్చుండి యుండు
నట్టిమలయాద్రి మీఁదికి నవతరింతు.

(అట్లు గావించి యులసట యభినయించి)

గీ. ఎగిరి వచ్చితిఁ గాని, యి దేమి తెక్క-
లలసి వులిసిన వెంత యాయాస మయ్యె?
వీర! కాలాఖ్యవిభునిజరాఖ్యశక్తి
సర్వశక్తుల వరికట్టఁ జాలుఁ గాదె?

(చూచి) మన్వంతరపురాణుండును గృధ్రరాజు నగు మాయన్న సంపాతి యాఁడుగో! ఆహా! యితఁడు సోదరప్రేమ మూర్తీభవించిన మహాత్ముఁడు గదా!

మ. గతకల్పంబున బెద్దద వ్వెగురువేడ్కన్ మేము పై కేగుచో
పతితీవ్రాతపతప్తు నన్నుఁ గని "యన్నా కుఱ్ఱఁ" డం చాత్మవి
స్తృతపక్షంబులక్రిందఁ జేర్చి నను రక్షించెన్ దయామూర్తియై
గతపక్షుం డయి యుండెఁ దా నది మొదల్గా నేఁటి కీకొండపై.

(అనుచు సమీపించి) ఆర్యా కాశ్యపా! మీతమ్ముఁడు జటాయువు పాదాభివందన మాచరించుచున్నాఁడు.

సంపా — నాయనా! వచ్చినావా?

గీ. సంతసము తమ్ముఁడా! గృధ్రచక్రవర్తి!
నిన్నుఁ గన్నట్టిమనతల్లి నిశ్చయముగ
విహగపతితల్లి మనమామ్మ వినతమాడ్కి-
వీరమాతలలోఁ బెద్దపేరు గాంచె.

(అని కౌఁగిలించి) దశరథుఁడు పోయి చాలాకాల మైనదిలే. రాముఁ డిపుడు తండ్రికోసము విచారించడము లేదు గదా!

జటా — గీ. ఆత్మవిద్యాతపోవృద్ధు లైనమునుల
పరిచయంబును ధైర్యంబు భావశుద్ధి
న్యాయ్య మైనట్టిపరిపాలనాధికార
మతనిదుఃఖంబు మెల్లగా నణఁచివైచె.

సంపా—అతఁడు చిత్రకూటము విడిచి శరభంగునియాశ్రమము చేరిన ట్లును, రామదర్శనానంతర మమ్మహర్షి యగ్నిప్రవేశ మొనరింప నచ్చటినుండి సుతీక్ష్ణాదిమహామునులను క్రమముగా సేవించుచు సంచరించుచున్నట్లును విరాధునిమాంసము కడుపార నారగించిన మనగృధ్రవీరులు కొందఱు చెప్పఁగా విన్నాను.

జటా—ఔ నది నిజమే. అగస్త్యమహర్షియానతిని బట్టి యతఁ డిపుడు పంచవటిలో నివసించియున్నాఁడు.

సంపా—(ఆలోచించి స్మృతికిఁ దెచ్చుకొని) ఔనురా! జనస్థానములో గోదావరితీరమందు పంచవటి యున్నది. అబ్బాయీ! ఎన్నో కౌఱిఁగియున్నాను ఎన్నో చూచియున్నాను. అయిని? తేనే తెంతో కాలము గడచినది. అందుచే జ్ఞాపకశక్తి కొంత తగ్గిపోవుచున్నది.

గీ. ఏను దిరిగినలోకంబు లెన్ని యెన్ని?
ఏను గడపినయుగము లవెన్ని యెన్ని?
పైని విష్ణుపదంబు పైపట్టు చూచి
చక్రవాళంబుదాఁకఁ క్రిఁజక్కి గంటి.

జటా—అచ్చటి కొకనాఁడు శూర్పణఖ వచ్చి రాముని గామించినది.

సంపా—అయ్యో! అ దెక్కడికాంతరా!

గీ. మాయురే! యది నేఁటి త్రేతాయుగంబు
తోడఁ బదమూడుయుగములయాడుముండ
క్షీరకంఠుని రాముఁ గాంక్షించెనోకో?
యెంత లజ్జావిహీను రా లెంతమాట?

జటా—దానికిఁ దగినశాస్తి యైనదిలే. లక్ష్మణుఁడు ముక్కు చెవులు కోసి దానిని బంపి రావణునియవమానముతో రామునికీర్తిని ప్రకాశింపఁజేసెను.

సంపా—అయితే, దీనిమూలముగా విరోధము ప్రాప్తించినట్లే.

జటా—ఔను సంభవించినది. రామభద్రుఁ డొక్కరుఁడు పదునాల్గు వేలపదునల్గురురక్కసులను, ఖరదూషణత్రికంఠులు మువ్వురను దురంబునఁ దునుమాడెను.

సంప—ఆశ్చర్యమే. ఆశ్చర్య మేమిటి? దాశరథి కిది గొప్పా? కాని, వైరహేతువుమతింత బలపడిన దని తలంతును. సరే కాని తమ్ముఁడా! ఈసమయములో సీతారామలక్ష్మణుల నొక్కక్షణ మైనను నీవు విడిచి యుండుట తగదు సుమీ!

గీ. చెల్లె లవమానపడె నేన యెల్ల గూలె
నట్టిచో దర్పితుండు మాయావి విభుఁడు
నుద్ధతుం డగు రావణుఁ డోర్చునొక్కొ?
తగదు పిల్లల విడుచుట తరలి పొమ్మ.

నేను నిపుడు సముద్రస్నాన మాచరించి యాహ్నికంబు దీర్చి వారికి మేలు కలుగ ధ్యానింతును. (అని నిష్క్రమించెను)

జటా—(ఆకాశగమన మభినయించి)

గీ. ప్రళయకాలానిలోగ్రజవంబుతోడ
గగనమును ద్రాగుచున్నట్టు లెగిరివచ్చి
యేను నివసించునట్టిమహీధరంబు
చేరుకొన్నాఁడ నే నొక్కచిటికలోన.

దట్టముగ నున్నచెట్లగుంపులచేఁ జీఁకటిపడినట్లుండుపరిసరారణ్యంబునఁ బ్రవహించుచు వచ్చుగోదావరితరంగంబులు రొదలుచేయుగుహలతో నెల్లెడల స్రవించునీరదంబుల నల్లనై కనఁబడునిదియే ప్రస్రవణాద్రి. ఇదే పంచవటి (చూచి) అయ్యో యెంతప్రమాదము.

గీ. రాముఁ గొనిపోయె దవ్వు మాయామృగంబు,
కాని, యం దేలపోవు లక్ష్మణుఁడు గూడ?
అక్కటా! పర్ణశాల సన్యాసి చొచ్చె
సందియము లేదు వీఁడు రాక్షసవిభుండె.

ఔరా! యిం కేమున్నది? ప్రమాదము ప్రమాదము. పిశాచముఖము లైన వేలకొలఁది గాడిదలను బూన్చినరథముపై నెక్కించుకొని సీత నెక్కడికో తీసుకొనిపోవుచున్నాఁడు, పాపాత్ముఁడు. ఓరీ పౌలస్త్యా!

గీ ప్రలయమున వేదములఁ గాల్చుభగవదంశ
సంభవుండు పులస్త్యవంశమునఁ బుట్టి
యగ్నిహోత్రతపోనిష్ఠ నలరునీకు
దారుణం బగునీచకృత్యంబు తగున?

ఏమిరా వినిపించుకోవు? ఓరీ దురాత్మా! రాక్షసాధమా! ఉండు ముందుము. ఆపాదమస్తకము నీయొడ లెల్ల నావాడిగోళ్ళఁ బట్టి చీల్చి నీనెత్తురు పీల్చి నీమాంసము భుజించి తీరెద నెందు పోదువురా! చూడు మఱి.

(అని నిష్క్రమించెను)

ఇది విష్కంభము.

లక్ష్మ—[ప్రవేశించి] హాపూజ్యురాలా! యెం దున్నావు? అయ్యో! మారీచాంతకుఁ డైనయార్యుఁ డీయవస్థ నెట్లనుభవింపఁగలఁడు? మూర్తీభవించినకోపమో జంగమం బగుశోకమో యన లజ్జాజుగుప్సాస్పదుం డై దేహ మెట్లో భరించుచున్నాఁడు.

గీ. తోయనిధిలోనియౌర్వంబుధూమమట్లు
మేఘమండలిదంభోళి మెఱుపువోలె
నడఁచి పెట్టినయార్యునియెడఁదలోని
కోపశిఖ దెల్పుచుండె భ్రూకుటివిధంబు.

(అంత రాముఁడు ప్రవేశించును)

రాము—గీ. మొదలు నవమాన మెడలోన మేకు వోలె
మనసు లజ్జించి యంధతమ్ముంబుఁ జొచ్చె

మది దహించు జటాయువుమరణ మకట!
ప్రేయసీశోకబాధ భరింపఁజాల.

లక్ష్మ—అన్నా! మీవంటిలోకోత్తరచరితులు కష్టములకుఁ జింతింతురా?

రాము—తమ్ముఁడా! ఔను రామునిచరిత్ర లోకోత్తరమే.

చ. అరులమదం బణంచి యభయం బిడి లోకము నేలినట్టి ని
ర్జరవినుతప్రతాపులు యశస్వులు తొల్లిటిసూర్యవంశభూ
వరులకు నింద తెచ్చితి, దివంబున కంపితి నయ్యొగాంతను
స్థిరు మహితున్ జటాయువును జేసిరొకో యెవరేని యీపనుల్?

హా తాత! కాశ్యపా! శకుంతరాజా! నీవంటిపుణ్యాత్ముఁడు మహానుభావుఁడు మా కెక్కడ లభించును?

లక్ష్మ—ఆర్యా! సత్యము. ఆపూజ్యునిచరమావస్థ యిపుడు చూచుచున్నట్లున్నాను. అతనికడపటిమాట లిపుడు చెవిని బడుచున్నట్లున్నవి.

క. మృతసంజీవిని వెదకెదు
గతి నేసతికొఱకు నడవి గాలింతువొ! యా
సతి నపహరించె రావణ
హతకుఁడు నను గూల్చి రాఘవా చిరజీవా!

అని పలుకుచు నాపితృకల్పుఁడు స్వర్గ మధిష్ఠించె.

రాము—వత్సా! ఈమాటలు గుండెలో గ్రుచ్చుకొనుచున్నవి.

లక్ష్మ—ఔ నట్టివే.

రాము—ఈపరాభవమునకుఁ బ్రతిక్రియ గా నిఁకఁ జేయవలసిన దేమి? తొలుతనే రాక్షసవధ నిశ్చయించుకొని వచ్చితిమి. ఇతరకారణములనుబట్టి యది కొంతవఱకు జరిగినది. అంతమాత్రమున నిది శాంతించునా? నిశాచరకులమును దుంప తెంపినఁ గాని శాంతి గాంచదు. కాని, తమ్ముఁడా!

ఆ. రగిలి రగిలి మంట లెగసినకోపాగ్ని
కాల్ప వేఁజొకందు కానరామి
బాడబానలంబు వారిధినట్టులు
కాల్చుచుండె నన్నుఁ గావుమయ్య!

లక్ష్మ—విచ్చలవిడిగాఁ దిరుగునానాజాతిమృగంబులును శార్దూలాది ఘాతుకజంతువులు నివసించుకొండగుహలును గలయీయడవులు దక్షిణదిశ నంటి యున్నవి. ఈదారిని బోవుదము రమ్ము.

రాము—ఈజనస్థానభాగములు మన మెపుడును జూచినవి కావుకదా!

లక్ష్మ—ఔను. గృధ్రరాజున కగ్నిసంస్కారము గావించి పంచవటినుండి బయలుదేఱి యెన్నాళ్ళయినదో! మన కిపుడు జనస్థానముసరిహద్దెంతో వెనుకఁబడినది. ఈముందు కనవచ్చుభయంకరారణ్యములు చూడఁగా, నిది జనస్థానమునకుఁ బశ్చిమంబును దనుకబంధాధిష్ఠితము నైనకుంజరవంత మనెడిదండకారణ్యభాగమని విదిత మగుచున్నది.

రాము—అయితే సరే. అడవికప్ప యైనయీదురాత్ముఁడు చూడవలసినవాఁడే.

(తెరలో) ఎవరండి బాబూ అక్కడ! రక్షించండి [illegible] కబంధుఁడు నన్నుఁబట్టుకొన్నాఁడు, ఆ[illegible]ను. నా[illegible] శబరతాపసిని, శ్రీరామునికోసము వెదకుచు [illegible]ము నుండి వచ్చుచున్నాను. ఎవరండి! [illegible]

రాము—(విని) తమ్ముఁడూ! వెళ్ళు వెళ్ళు

లక్ష్మ—ఇదిగో వెళ్ళుచున్నాను (నిష్క్రమించును.)

రాము—

ఉ. ఎక్కడ నుంటి వీవు రమణీ! చెవి కింపుగఁ బల్కరావె? దూ
తెక్కినవాఁడ నిట్లు పయికేడ్పుట కైనను నోఁచలే దిసీ!

V.R. NARLA MEMORIAL LIBRARY
R. NARLA D.P.R.I.
Acc. No.

ముక్కిడిముక్కుగొంత పోరిపుచ్చిననాపయి కిన్క నాల్గురెట్లెక్కువ మూఱు చేసి సుఖయించెడు రావణుఁడే నణంగితిన్.

[అంత లక్ష్మణుఁడు శ్రమణ ప్రవేశింతురు]

లక్ష్మ—రక్కసులవికృతరూపములు చూడ ముచ్చటపడుమాయున్న యాఱంపాలవంటికోఱలు తాటిచెట్లవంటిబుజములు కలిగి యతి భీకరవికృతాకృతి యగుకబంధుని జూడలేదు గదా!—శ్రమణా! ఇతఁడే యార్యుఁడు

శ్రమ—దేవా! జయము జయము.

రాము—నన్ను వెదకుచుండుట కేమి ప్రయోజనము?

శ్రమ—రావణునితమ్ముఁడు విభీషణుఁ డొకఁ డున్నాఁడు. వినియున్నావా?

రాము—అతనిపేరు విననివాఁ డెవడు?

శ్రమ—అతఁడు ఖరదూషణత్రిశిరంతులవధ జరిగినపిదప నేదో కారణమున నాత్మబంధువులతో విడిపోయి వచ్చి సుగ్రీవునితోఁ గలసి ఋష్యమూకమున నున్నాఁడు. ఆవిభీషణుఁడు తన్ను నీకు సమర్పించుకొనుచు వ్రాసినలేఖ యిది. (అని యిచ్చును)

లక్ష్మ—(అది పుచ్చుకొని చదువును) స్వస్తి. రామదేవునికి నమస్కరించి విభీషణుఁ డిట్లు విన్నవించుచున్నాఁడు.

గీ. పూర్వపుణ్యంబువలన నాబోఁటివారు
గాంచఁ గల్గినయుత్తమగతులు రెండె,
నిత్యమైనత్రియాధర్మనిష్ఠ గాని
ధర్మరక్షకరామపాదంబు గాని.

రామ—లక్ష్మణా! అయితే, లంకేశ్వరుఁడు బ్రియమిత్రుఁడు నైనమహారాజవిభీషణునికి మన మిపుడేమి తెలుపవలెనో చెప్పుము.

లక్ష్మ—లంకేశ్వరుఁడు ప్రియమిత్రుఁడు ననుటయే చాలు. ఇంకఁ దెలుపవలసిన దేమున్నది?

రాము—ఔను శ్రమణా! తమ్ముఁ డన్నదే సరి.

శ్రమ—దేవా! మహాప్రసాదము.

లక్ష్మ—అయితే, శ్రమణా! విభీషణునివల్లఁ బూజ్యురాలివృత్తాంత మే మైనఁ దెలిసెనా?

శ్రమ—ఇప్పటి కేమీ లేదు. కాని, ఆదురాత్ముఁ డపహరించికొనిపోవు నపుడు జాఱిపోయినయార్యురాలి యనసూయానామాంకిత మైనయుత్తరీయము దొరకినది. అది వారివద్ద నున్నది.

రాము—హా మహారణ్యవాసప్రియసఖీ! (అని దుఃఖవేగము నటించును)

లక్ష్మ—అది యెవరికి దొరకినది? ఎట్లు దొరకినది?

శ్రమ—శ్రీరామగుణపక్షపాతు లైనహనుమద్విభీషణ సుగ్రీవులకు ఋష్యమూకముమీఁద దొరకినది.

రాము—వత్సా! నిష్కారణమిత్రులు ప్రియంకరులు నైనయామహా వీరులను జూడవలెను.

శ్రమ—అట్లయిన, దేవా! యిటు దయచేయుఁడు.

(ముగ్గురు పరిక్రమించుచున్నారు)

లక్ష్మ—హనుమంతుఁడు హనుమ్మంతుఁ డని వీరులు పరిగణించెడి పెద్ద పేరు. ఇంద్రునియందును వాయువునందును వాలియందు నెంత యున్నదో, అంతపరాక్రమ మొక్కహనుమంతునియం దున్న దని ప్రతీతి. దేవాసురులు సంభ్రాంతు లగున ట్లతఁడు బాల్య మందు చేసినకార్యము లెన్నో వినవచ్చును.

శ్రమ—ఔను. అతఁడు హేమకూటవాసియు వానరానీకనాయకుఁడు నైన కేసరి యనువానిభార్య యైనయంజనకు వాయుదేవు నను గ్రహమున జన్మించినవాఁడు. అట్టివీరుఁ డతఁ డొకఁడేనా? సముద్రజల మంతయుఁ గొబ్బరికాయనీళ్ళవలెఁ ద్రాగఁజాలిన వారును, చిన్న మొక్క లూడఁదీయునట్లు పర్వతంబు లూడఁ

జెఱుకఁగలవారును, తా మున్నచె ట్టూఁపినట్లు బ్రహ్మాండ మూఁపఁగలవారు నై వాలిని సేవించువానరవీరులు కోట్లు న్నారు.

రాము—శ్రీమణా! ఈదక్షిణదిక్కున నెముకలగుట్ట కనఁబడుచున్న దేమిటి?

శ్రీమ—అది లక్ష్మణుఁడు తగులఁ బెట్టినకంబధునిది.

రాము—మంచిపని చేసినాఁడు.

లక్ష్మ—అన్నా! చూడు చూడు, చిత్రమిది. ఆశ్మశానాగ్నినుండి యెవఁడో దివ్యపురుషు డిటు వచ్చుచున్నాఁడు.

దివ్య—[ప్రవేశించి] దేవా! జయము జయము.

క. దనుఁడను శ్రీయనునచ్చర
తనయుఁడ శాపోక్తి దనుజధర్ముఁడ వజ్రం
బున నైనకబంధుఁడ నో
యనఘా! నీకరుణఁ గంటినయ్య విముక్తిన్.

రాము—సంతోషము సంతోషము.

దను—మాల్యవంతునిప్రేరణచే మిమ్ము మ్రింగుటకై నే నీ యడవిఁ దిరుగుచున్నాను. ఛీ! ఆపాపము స్మరింపరాదు. మహాత్మా! మీయనుగ్రహమున నాకు సహజమైనదివ్యజ్ఞానము లభించుటంబట్టి యొకవిశేషవిషయము గోచరించుచున్నది. మహోపకారము చేసిన మీ కది తెల్పుచున్నాను. "ఎట్లయిన రామలక్ష్మణులను జంప వలసిన దని మాల్యవంతుఁడు వాలిని బ్రార్థించినాఁడు. రావణునితోడిమైత్రినిబట్టి యతఁ డందు కంగీకరించినాఁడు." ఇది మీ రెఱిఁగియుండుట మంచిది.

రాము—సరిలే. రాజనీతిమార్గ మిట్టిదే. మిత్రకార్యమువిషయమున వాలి యుదాసీనుఁడు కానేరఁడు. పెద్దవీరుఁడ ననుకొనుచున్న వాలి నణఁగింప నాకును గోరిక కలదు.

అంగదుడు—ధీరోదారు లగుమీరు గాక యెవ రిట్లు పలుకుదురు?

రాము—ఓయీ! నీవు చేయవలసినయుపకారము చేసితివి. చాలు.
నీ వింక నీలోకమునకుఁ బోయి సుఖింపుము.

(దనువు నిష్క్రమించును)

లక్ష్మ—వాలికిని రావణునికిని మైత్రి యెట్లు కుదిరిన దమ్మా!

శ్రమ—

చ. గిరివర మెత్తి లోకములు గెల్చినగర్వము మీఱఁ బంక్తికం
ధరుఁ డరుదేర బాహుకదనంబున కాతని బాహుమూలమం
దిరవుగఁ బట్టి వాలి చని యేనుమహాబ్ధుల సంధ్య వార్చి పోఁ
దోఁజెఁగియు, సఖ్య మిమ్మని నతుల్ వొనరింపఁగ నిచ్చె వానికిన్.

లక్ష్మ—ఓరీ రాక్షసాధమా! క్షత్త్రియులకు సంతాపము గలిగించిననీ
చచ్చుప్రతాప మి దఁటరా!!

రాము—ఒకరిని మించినవా రొకరు గా వీరలోక మిట్లే చిత్రముగా
నుండును.

లక్ష్మ—ఈయెదుటఁ గనబడు తెల్లనికొండ పే రేమిటమ్మా!

శ్రమ—ఇది కొండ కాదు. వీరుఁ డైనవానరేంద్రునియుశోరాశి యనఁ
దగినయిది మహిషరూపుఁ డైనదుందుభియెముకలగుట్ట.

లక్ష్మ—దారి కడ్డముగా నున్నదే. ఆవలికిఁ దొలఁగించి పోవుదము,

రాము—సరే. రా (అని కాలిబొట్టనవ్రేలితో మీటును)

శ్రమ—ఆహా! ఆశ్చర్య మాశ్చర్యము.

గీ. వాలి కడుబల్మి నిరుగేలఁ బట్టి యెత్తి
పాఱవైచినదుందుభిపంజరంబు
శైలతుల్యంబు నీతండు కాలిప్రేల
మీట నౌరౌర! వింధ్యంబు దాఁటిపోయె.

లక్ష్మ—అదిగో! ప్రశాంతగంభీరము నతివిపులము నైననల్లనికొండ యడవి సమీపించుచున్నది.

శ్రమ—ఇది ఋష్యమూకపంపాసరోవరప్రాంతము, ఈముందున్నదే మతంగాశ్రమము. ఇదిచాలాకాలముక్రిందటనే శూన్య మైనను, యజ్ఞపాత్రలు బర్హిస్సు సమిధలు కనుపట్టుచునే యుండును. మఱియు నగ్నిహోత్రుం డిప్పటికి నిండు వెలుఁగుచునే యుండును.

రాము—తపోమహిమ లచింతనీయములు కదా!

శ్రమ—

ఉ. కిలకిలలాడుపట్టివిహంగీవిహంగంబులు త్రొక్క వేతసం
ఖులపయినుండి జాఱిపడుపువ్వులవాసనతో, విమలస
త్ఫలభర మైన నేరెడుపొదంబడి త్రొక్కిలి మ్రోఁగువాఁగులం
గలసినయేఱు చూడు వడిగాఁ బ్రవహించెడుఁ జేటనీటితో.

దేవా! మఱియు నిటు చూడుము.

గీ. ఘోరభల్లూకములు కొండగుహల నుమియు
నట్టి చప్పుడు మఱుమ్రోఁత నధికమయ్యెఁ
గరులు విఱిచినసల్లకీతరులనుండి
వెడలురసముసుగంధంబు విరియు నిండు.

లక్ష్మ—తూర్పుగాలికి వికసించినపువ్వులతో నిండినయీకడిమిచెట్లకానన ములు గాంచి కన్నీ రొలుక విల్లు చేతఁ బట్టి ధైర్యముగానిలిచి యుండె నార్యుఁ డిదేమి?

రాము—సౌమిత్రీ! నీవు చూడలేదా?

గీ. కడిమిచెట్లుసువాసన లిడుచునుండె
నాడుచుండె మయూరముల్ పాడుకొంచు
విమలతాపింఛపుష్పనీలిమను నవ్వ
కొత్త మేఘంబు చూడు మాకొండమీఁద.

లక్ష్మ—(తనలో) విప్రలంభము కంటె వేఱయినరస మొకటి యార్య
హృదయ మిపు డాక్రమించినది.

(తెరలో) తాతా! నీవు వెనుకకుఁ బొమ్ము నామిత్రునికి మాతామహుఁ
డవగుటచే నీవు నాకును బూజ్యుఁడవు. సాధుహింస యన్యాయ్య
మైనను నీమాటనుబట్టి యతనిని జంపఁ బూనితిని.

లక్ష్మ—ఎవఁ డమ్మా వీఁడు?

శ్రీమ—దేవా! చూడు చూడు. పిశంగాంగుఁ డైనవాలి తనతండ్రి
యిచ్చినబంగారుతామరపువ్వులదండ మెడలోఁదాలిచి మెఱ
పుతోఁ గూడినసంధ్యాకాలమేఘముమాడ్కిని గైరికవిలసితం
బగుగిరీంద్రముకైవడిని విలసిల్లుచు గగనలక్ష్మికిఁ బాపిడితీయు
చున్నట్లుగా నతిజవంబున నిటు వచ్చుచున్నాఁడు.

లక్ష్మ—అన్నా! మనకు వీరగోష్ఠీవినోదము కలిగింపఁ బ్రియమిత్రుఁ
డైనయింద్రపుత్త్రుఁడు దైవవశమునఁ బ్రాప్తించెను.

రాము—(తనలో) అతఁడు గొప్పవీరుఁడు.

[అంత వాలి ప్రవేశించును]

వాలి—సీ. ఆచక్రవాళాద్రి యనుపాదు కదలి స
ప్తమవార్ధిక్రిందికిఁ జాఱునట్లు
త్రిదివమర్త్యము లనురెమ్మలు సంధులు
విడిపోయి ప్రక్కలఁ బడెడునట్లు
పాతాళమూలంబు పట్టూడి క్రిందికి
గుంకటివేళ్ళతోఁ గూలునట్లు
రవిచంద్రు లనియెడిప్రసవగుచ్ఛములు తా
రక లనుపువ్వులు రాలునట్లు
గీ. చెలఁగి బ్రహ్మాండ మనెడియూచిన్న మొక్క-
యూఁడఁ బెఱుకఁగఁ జాలినవాఁడ, నైన

మాల్యవంతునిమాట నీమనుజబాలుఁ
గూల్చు టర్హంబు గా దని కుందుచుంటి.

యన్యాయ్యకార్యములు చేయువారు ఘోరనరకమునఁ గూలుదురు. నేను రావణుని చెలిమి కంగీకరించితినిగదా యని మాల్యవంతుఁ డీపని నాకుఁ జెప్పె. ఆహా! యేమి యతనిస్వార్థపరాయణత్వము? హొద్దు పొడిచినది మొదలుగా నన్ను బ్రతిమాలి తుదకు బయలు దేఱఁదీసి చల్లగా జాఱినాఁడు. అకటా! యెంతకష్టము?

చ. విమలయశుండు ధర్మమతి వీరుఁడు పూజ్యుఁడు శత్రుమాయలన్
రమణిని గోలుపోయినని రాగసుఁ డింటికి వచ్చె, నాతిథే
యుని వోనరింప కొక్కపలు కైనను బల్కక ఘోరపాపకృ
త్యమునకు సిద్ధమా? కటకటా! యిది యెక్కడిమైత్రి దైవమా! *

(ఆలోచించి) మాట యిచ్చితి నిపు డేమిచేయుదును? (ధైర్యముతో) సుగ్రీవునితోఁ జెప్పక యే విభీషణుఁడు రామునివద్దకు శ్రమణను బంపె నఁట. అతఁడు వానికి లంకాధిపత్యమిచ్చె నఁట. ఈమతంగా శ్రమణ చేతనే యున్నాఁడఁట. కానీ! యుం దరిగెదను. (పరిక్రమించి) ఎవ రక్కడ?

గీ. రాము నిర్జితభార్గవరాము ధర్మ
ధాముఁ గనవచ్చె నింద్రునితనయుఁ డిపుడు
కన్నుఁగవ సఫలంబుగాఁ గాంచి కినప
బాహుబలగర్వకండూతిఁ బాపుకొనును.

రాము— లక్ష్మణా! నే నిచ్చట నుంటి నని చెప్పుము.

---

* ఇంతవఱకే భవభూతికృతగ్రంథ మనియుఁ దక్కిన దంతయు, సుబ్రహ్మణ్యకవికృత మనియు, వ్యాఖ్యాత యగువీరరాఘవాచార్యుని మాటలు నిర్ణయసాగరముద్రాలయముద్రితపుస్తకమునఁ గలవు. నేను దీనిఁ దెలిగించుటకు గ్రహించినపుస్తకము కలకత్తాముద్రణము.

లక్ష్మ—ఓమహాభాగా! ఆర్యుఁ డిక్కడ నున్నాఁడు. ఇటు రమ్ము.

వాలి—నీవా లక్ష్మణుఁడవు? (పరిక్రమించును)

లక్ష్మ—ఔను. (ఇద్దఱు పరిక్రమింతురు)

వాలి—(తనలో)

గీ. తొంటియినవంశరాజులకంటె ఘనుఁడు
విమలచరితుండు జగదేకవీరుఁ డితఁడు,
ధర్మతత్పరుఁ డీరాముదర్శనంబు
కన్నుఁగవ కెంతయును హాయి కలుగఁజేసె.

(సమీపించి ప్రకాశము) రామా!

మ. పరమానందముఁ జెందె డెందము భవత్సత్ఖ్యాతికి న్మున్ను, నే
డురుసౌఖ్యాంబుధి మున్గెఁ గన్నుఁగవ యోహో యేమిరూపంబు!భూ
వర! యేమైనను నేను నీదుచెలిమిన్ వాంఛించి రాలేదు, భూ
సురునిన్ గెల్చిన నేర్పు చూపుటకు నిచ్చో విల్లు చేపట్టుమా!

రాము—క. వానరవర! నీమాటలు
వీనులవిం దయ్యె నీదు వేడుక తీరన్
బూనెదఁ, గాని ధనుశ్శర
హీనునిపై రాముఁ డేయునే బాణంబుల్?

వాలి—(నవ్వి) మహాక్షత్త్రియా! నాపై కరుణ చూప నక్కఱలేదు.

చ. నరవర! మమ్మెఱుంగనిజనంబులు లే రిది నీకుఁ గ్రొత్త, సం
గర మొనరింపు మీవు విలు గైకొని చాలును, విల్లు గిల్లునుం
గరమున లేక యే జయము గాంతుము మే మనుమాన మేల? వా
నరులకు విండ్లు నమ్ములు వనద్రుమముల్ గిరు లం డెఱుంగుమీ!

లక్ష్మ—ఆర్యా! ఇతఁ డేమనుచున్నాఁడు? వానరులకు గిరిద్రుమంబులే
శస్త్రములా? ఏ మన్నాఁడు

వాలి-రాము (పరస్పరము)

క. నినుఁ బోర సణఁగఁ ద్రొక్కుట
కని మన ముప్పొంగుచుండె నౌరా! నీ వీ
యని వీరస్వర్గంబుం
గనిన, మహావీరుఁ డేడి కాశ్యపిలోనన్?

(అనుచు నిద్దఱు నిష్క్రమింతురు)

లక్ష్మ—ఆర్యుఁడు విల్లు మ్రోగింప వానరుఁడు కుపితుఁడై నలుదెసలు మ్రింగునట్లు నోరు తెరచి కాలమేఘ మురిమిన ట్లుఱుముచుఁ బై కెగసి తోఁక విప్పి పెరుగుచు గగన మాక్రమించుచుండె-

(తెరలో) విభీషణా విభీషణా! అది వాలియుఱుపే సందేహము లేదు. కాని పినాకధ్వానముఁ బోలినయీ కార్ముకధ్వని యెక్కడిది?

లక్ష్మ—శ్రమణా! వీఁ డెవఁడు?

శ్రమ— ఇతఁడే విభీషణసఖుఁడైన సుగ్రీవుఁడు. తొందరగా రణరంగముఁ జేరుచుండె. యూథపతు లెల్లరు గిరిగహ్వరంబులనుండి వచ్చుచున్నారు, చూడు.

లక్ష్మ—అయితే నేనుగూడా విల్లు చేపట్టవలసినదే.

శ్రమ— ఔరా! ఆశ్చర్యము. రాముని దివ్యశరంబు వాలి దేహమును సప్తతాళంబులను భూతలంబును భేదించి తిరిగి వచ్చి తూణీరముఁ జొచ్చె.

(తెరలో)

మ. విను సుగ్రీవ! విభీషణా! విను మహావీరుండు రాముఁడిదు గో
ల్చెను నన్నిందుకనుండు రండిపుడు నిశ్చింతంబుగా నుండుఁడీ!
వినుఁడీ వానరవీరులార! కపిరాట్సింహాసనంబునన్ సూర్యపు
త్రుని మాయంగదు యౌవరాజ్యమున సంతోషంబుతో నిల్పుఁడీ!

లక్ష్మ.—ఔరా! తనయాజ్ఞకు బద్ధులైనప్లవగవీరులు బద్ధాంజలులై విచారించుచుఁ బరివేష్టింప, నార్యుఁడు సస్నేహబాష్పలోచనుఁడై చూచుచుండ, దుఃఖించుచున్నవిభీషణుఁడు శరీరస్వాస్థ్య మడుగుచుండ, దన్నుఁగౌగిలించుకొని విలపించుచున్నసుగ్రీవునిమెడలోఁ దనకంఠమాలవేసి పురందరతనయుండగువాలిభూశయ్యనుండియు రాజపీఠమున నున్నట్లు వీరలక్ష్మివెలయఁ బ్రకాశించుచున్నాఁడు.

[అంత రామవిభీషణులును, సుగ్రీవునిచేఁబట్టుకొనఁబడి వాలియుఁ బ్రవేశింతురు]

రాము— క. బలమును శౌర్యము కీర్తియుఁ
కులమును సౌజన్య మలరుకులపర్వతధీ
రుల నిట్టివారి మిగ్రింగం
దలపోసెడియమునివృత్తి దారుణము గదా!

వాలి—వత్సా విభీషణా! నాసహస్రకనకకమలమాల సుగ్రీవునిమెడలో నెంత చక్కఁగా నున్నదో చూచితివా?

సుగ్రీ-విభీ—ఆర్యా! దైవము నిర్దయంబు ఇది యకాలమందలిపిడుగు
(దుఃఖ మభినయింతురు)

వాలి—రామభద్రా! మహావీరా!

రాము—ఆర్య! దగ్గఱనే యున్నాను.

వాలి— ఆ. చేయరానిచెట్టచెలిమి చేసినతప్పు
దేహపతన మరసి తృప్తిగాంచె,
అఘ మణంచినట్టియనఘాత్మునకు నీకు
నప్పగించుచుంటి నాత్మశక్తి.

రాము—(సవినయంబుగ నతనిఁ జూచును)

విభీ-సుగ్రీ-(జనాంతికము) శ్రీమణా! రామదేవునియనుగ్రహమున మన యదృష్టము ఫలించినది.

శ్రీరా—దీని కంతకుఁ గారణము మాల్యవంతుఁడు.

వాలి—సుగ్రీవా!

సుగ్రీ—(కన్నీటితోఁ జూచును)

వాలి—వత్సా! ఏమిది? మఱియొకవిధముగా నుంటి వే!

సుగ్రీ—(సవిచారముగా) అన్నా! లేదు. ఆజ్ఞాపింపుము.

వాలి—నేను నీ కెట్టివాఁడను?

సుగ్రీ—స్వామివి గురుఁడవు భ్రాతవు.

వాలి—నీవు నా కెట్టివాఁడవు?

సుగ్రీ—ప్రేష్యుఁడను శిష్యుఁడను తమ్ముఁడను.

వాలి—(తమ్మునిచేయి పట్టుకొని) రామా! నాతమ్ముని నీ కొసఁగితిని. గ్రహింపుము.

రామ, సుగ్రీ—పూజ్యుఁడ వయిననీయానతి శిరసా వహించితిమి.

విభీ—ఆహా! చెప్పవలసిన దంతయు సంగ్రహముగా సుగ్రీవదానములో నిమిడిపోయినది.

వాలి—తమ్ముఁడూ! బ్రహ్మపుత్త్రుఁడు నాచార్యుఁడు నైనజాంబవంతుని సేవించి నీవు నేర్చినస్నేహధర్మ మెట్టిదో తెలుపుము.

సుగ్రీ—గీ. మనసు మాటయు నొకటిగా మసలుకొనుట
కష్టసుఖములయందు భాగంబు గొనుట
నీవు నే నొక్క టనుమాట నిలుపుకొనుట
సజ్జనస్నేహమునకు లక్షణము లండ్రు.

వాలి—రామభద్రా! సూర్యవంశగురుండైనవసిష్ఠుఁడు నీ కుపదేశించిన మిత్రధర్మ మిదేనా?

రాము—ఔను.

వాలి—అట్లయితే, "ఇట్టినిష్కపటస్నేహమున మేము ప్రవర్తింతు" మని మీ రిద్దఱు నగ్నిసాక్షికముగా శపథము చేయుఁడు. ఇఁకఁ గాలము లేదు. అదిగో మతంగమహర్షియజ్ఞాగ్నిహోత్రము.

రామ, సుగ్రీ—(ఒకరిచేయి యొకరు పట్టుకొని) మనము మనస్సులు కలియ నిష్కపట మైనమైత్రితోఁ బ్రవర్తిల్లుదుము గాక.

వాలి—సంతోషము. రామభద్రా! శ్రమణయెదుటనే యీబాలుఁడగువిభీషణునికి లంకాధిపత్యము వాగ్దానము చేసినావు కదా!

విభీ—(తనలో) ఇ దెట్లు తెలిసినదో!

శ్రమ, లక్ష్మ—ఆహా! ఏ మీతనిచారనేత్రత!

రాము—ఔను.

వాలి—సంతోషము. సుగ్రీవుఁడు కిష్కింధాధిపతి యగును.

విభీ, సుగ్రీ—ఆర్యా! నమస్కారము.

రాము—ప్రియస్నేహితు లగుసుగ్రీవవిభీషణులారా! ఈ లక్ష్మణుఁడు మీవాఁడు.

ఇద్దఱు—రారమ్ము వత్సా! (అని కౌఁగిలింతురు)

శ్రమ—సౌజన్యముతోడియీమైత్రి యెంతయుఁ జక్కఁగానున్నది.

వాలి—వత్సా! విభీషణా! నీవు రామునియనుగ్రహమునకుఁ బాత్రుఁడ వైతివి. ఇఁక రావణుఁడు లేనివాఁ డని నమ్ముము.—ఓవానరవీరులారా! కాలము సమీపించినది. న న్నావలికిఁ గొనిపొండు.

నీలాదులు—హా మఘవపుత్రా! సచ్చరిత్రా! హా మేరుధీరా! మహావీరా! మమ్ము విడనాడి పోవుచుంటివా? దేవా! (అని దుఃఖించుచు వాలిని గొనిపోవుచుందురు)

వాలి—

ఉ. వానరవీరులార! తుదివాక్యము వందనపూర్వకంబుగా
నే నిదె విన్నవింతుఁ గనుఁ డీయువరాజును రాజు నన్నుఁ గా
నీనరనాథు రాముఁ బరమేశ్వరుఁగాఁ గనుఁ డింక నేల? ప్ర
జ్ఞానిధు లైనవారు గనజాలుదు రంతయు నొక్కమాటలో.

(అందఱు నిష్క్రమింతురు)

ఇది పఞ్చమాఙ్కము.

ఓన్నమః పరబ్రహ్మణే

# మహావీరచరిత్రనాటకము

## షష్ఠాఙ్కము

[ అంత ఖిన్నుఁడై మాల్యవంతుఁడు ప్రవేశించుచున్నాఁడు ]

మాల్య—అహహా! రావణదుర్వినయపాదప మెంతలోఁ బెరిగి మొగ్గ దొడిగినది? జానకీయాచ్ఞ దానిబీజము, శూర్పణఖాయానము దాని మొలక, మారీచమాయ దానిచిగురు, సీతాపహరణము దానికొమ్మలు, వాలివధ రామవిభీషణసఖ్యము మొదలైనవి దాని మొగ్గలు ఇంక నీచెట్టు శీఘ్రముగానే ఫలించు నని తోఁచుచున్నది. వృద్ధులబుద్ధి ముందేమగునో యని చూచుచుండును గదా! (నిట్టూర్పు విడిచి) ఆహా దైవప్రాతికూల్యము! నాయాలోచనమంతయు వ్యర్థమైనది. నా కీమంత్రిపదవి యూరక రాలేదు, దుఃఖానుభవమునకే వచ్చినది. ఔరా! ఆపాపాత్ముఁడు రాచకుఱ్ఱవాఁ డెంతటివాఁడైనాఁడు? వాలిని జంపినవాఁ డింకేమి చేయఁజాలఁడు? (స్మరించి) సీతను వెదకుటకు వానరులు నలుదెసలకు బయలువెడలి రని యిపుడే చారుఁడు చెప్పెను. ఔను (తెరలో) అయ్యో! అయ్యో!! లంకాపట్టణ మగ్నిహోత్రునిపాలయిపోవుచున్నది (అని తెర త్రోసికొని ప్రవేశించి)

త్రిజట—తాతా! రక్షించు రక్షించు. (ఱొమ్ము బాదుకొనుచున్నది)

మాల్య—బిడ్డా! శాంతింపుము. ఏ మీయుపద్రవము?

త్రిజ—చిన్నతాతా! ఏమిచెప్పను? ఎక్కడిదో పాడుకోఁతి వచ్చి పుర మంతా బుగ్గిచేసి రాళ్లు ఱువ్వి రాక్షసభటులను జంపి పట్టుకో వచ్చినయక్షకుమారుని బరిమార్చి పాఱిపోయినది.

మాల్య—(సఖేదముగా) ఊరు కాల్చినాఁడా? అక్షకుమారుని జంపినాఁడా? ఈవానరుఁ డెవఁడై యుండును? ఆఁ! ఈదిక్కునకు హనుమంతుఁడు వచ్చె నని విన్నానుగాదా? అకటా! లంకకాల్చిన హనుమంతుఁడు లంకాపతిప్రతాప మణఁచినవాఁడే కదా! అయితే పిల్లా! వానికి సీత సంగతి తెలిసినదా?

త్రిజ—ముందుగా, పిల్లకోఁతి యొకటి సీతాదేవితో మాటలాడడము, ఆమె తలలోనినగ యేదో తీసి దానిచేతిలో పెట్టడము నేను చూచినాను.

మాల్య—అయితే, పూర్తిగాఁ జూడలేదు కాఁబోలు? (సాశంకముగా) ఈపని చేసినవాఁడు వాఁడే. ఇట్టివాళ్ళు సుగ్రీవునిచేతిలోఁ గొన్నికోట్లున్నారు.

త్రిజ—తాతా! ఆసీతరూపము చక్కనిది, మాట లింపైనవి. కాని, ఆమె రక్కసులపాలిటిరక్కసియే.

మాల్య—నిజము నిజము పతివ్రతారూప మైనమహాజ్యోతి యుల్లే చల్లగాఁ గనఁబడును. (విమర్శించి) ఆఁ! అదేమి చేసినది? మన పావమే భగభగ మండుచున్నది.

త్రిజ—చిన్నతాతోయి! మొట్టమొదట మనవాళ్ళు దండకారణ్య భూములలో నివసించేవారు. జంబూద్వీప మంతటా తిరిగేవారు. ఇపుడు మన మీలంకలోఁ గూడా ఉండలే మనుకొనుచున్నాను. ఏమిటి గతి?

మాల్య—ఏమీ భయము లేదు. లంకాపురము చిత్రకూటాద్రిమీఁద నున్నదిగదా! దానిచుట్టును సప్తప్రాకారములున్నవిగదా! వాటికి

నాలుగుప్రక్కల నంతము లేనియగడ్తలాగున గొప్పసముద్ర మున్నదిగదా! శత్రుసంహారయాగదీక్షకు రావణుని యిరువదిబుజములు సిద్ధముగా నున్నవిగదా (ఎడమకన్నదరుట సూచించి) ఆహా! దుర్దైవము నోటితో మంచిమాట యనుకొనుటకైనా సహింపకున్నది గదా!—కాని, బిడ్డా! మనకుంభకర్ణుఁడు నిద్ర నుండి యెప్పటికి లేచును?

త్రిజ — అబ్బో! ఇప్పు డెక్కడ? వాఁడు పడుకొని యీకృష్ణచతుర్దశికి సరిగా నాలుగు నెల్లయినది.

మాల్య—అయితే, ఇంకా చాలాకాల మున్నది (తలఁచి) వాఁ డాలోచింపక చేసినా, విభీషణుఁడు చేసినదే మంచిపని యని తోఁచినది. తుదకు వాఁడే వంశము నిలుపువాఁ డని నానమ్మకము

త్రిజ—తాతా! ఎంతమా టన్నావు? అయ్యో అయ్యో!

మాల్య—ఏమి! అసంతాప మెందుకు?

త్రిజ—నీనయవచనోపన్యాస మే దో యశుభప్రద మైనమార్గము పట్టినది.

మాల్య—త్రిజటా! పాపబుద్ధితో దుర్వినయదుష్ప్రతాపములు చూపినవాఁడు ప్రబల మైనదుర్దైవమునకు గుఱికాకుండఁ దప్పునా? పగ లెల్ల తీవ్రకరముల లోకమును వేఁచినయుష్ణాంశుఁ డేమగుచు న్నాఁడు? అస్తగిరిపాలు గాక మానెనా? సరే కాని, ఇఁక నీప్రసంగము కట్టిపెట్టి ముందుసంగతి చూతము. దశగ్రీవమహారాజిపు డేమి చేయుచున్నాఁడు?

త్రిజ—సర్వతోభద్ర మనెడికోటబురుజెక్కి యశోకవనమువంక చూచుచున్నాఁడు. రాణి మండోదరి పురదాహమునకు విచారించుచు నతనికి బోధింప నక్కడికిఁ బోవుచున్నది.

SPECIMEN
for favour of Prescription
Examination



మాల్య—ఆఁడు దైతే నేమి? ఆమెయే తెలివైనది. అతఁడు తెలియఁ జెప్పినా, తెలుసుకొనకున్నాఁడు. సరే రమ్ము. మనము లోపలికిఁ బోయి కర్తవ్య మాలోచింతము.

(అని వెడలిరి) ఇది విష్కంభము.

[అంత సీతనుగూర్చి యువ్విళ్ళూరుచు రావణుఁడు ప్రవేశించును].

రావ—

శా. ఏలా చంద్రుఁడు? మోము చాలుఁ, దోవ లిం కేలా? కనుల్ గల్గ నిం
కేలా కాముని విల్లు కన్బొమలుముం? దేంతాశ? తా మొప్పునే
నీలాబ్దంబులు కుంతలంబులదరిన్? దివ్యాంగలావణ్యముం
బోలం జాలునె లక్ష్మీకాంతి? యహొరా! భూపుత్త్రి రమ్యాంగముల్!!

భూమిఁ బుట్టినయీరత్నము కోరిక దీర లభించినది. నాకు దైవ మను కూలముగా నున్న దనియే నానమ్మకము (గర్వముతో) దైవ మేమిటి?

చ. తలఁచితి నేని విశ్వము యథాయథలై పడఁ గూల్చి కాళ్ళతో
నలిపి విరించిసృష్టిజకనంబును మానిచి మత్ప్రతాపకీ
ర్తులు రవిచంద్రులై వెలుఁగ దోర్బల మంతయుఁ జూపఁజాలనే
తొలఁగితిఁ గాని యెందు కని? దుష్టవిధిన్ గణియించువాఁడనే?.

[అంత చేటితో మండోదరి ప్రవేశించును]

చేటి—అమ్మా! యిటు వచ్చి యీవెండిమెట్లదారిని బైకెక్కుము.

మండో—(అట్లు చేసి) ఇదుగో మహారాజు. ఏదో, ఆలోచించుచు నశోకవనమువైపు చూచుచుండె (సఖేదముగాసమీపించి) జయము జయము మహారాజా!

రావ—(తనచేష్ట మఱుఁగుచేసి) ప్రేయసీ! వచ్చితివా? ఇక్కడ కూర్చుండుము.

మండో—(అట్లుచేసి) నాథా! ఏ మాలోచించితివి?

for favour of Prescription
Examination

రావ—ఏమి ఏవిషయమున?

మండో—శత్రుపక్షాభియోగవిషయమున.

రావ—(వికటహాసముతో) శత్రువా? పక్షమా? అభియోగమా? ఎప్పుడును వినని మాటలు వినిపించినావు రమణీ!

చ. నిజ మది నమ్ము మొక్కపరి నే ననిలో నిరుగేల నష్టది
గ్గజముల నాఁపి నాల్గుభుజకాండములన్ సురసేనఁ బట్టితిన్
గజగజలాడి యింద్రుఁడు కనంబడకుండఁగఁ బాఱిపోవ, నా
విజయము లెన్ని యిట్లు వినిపింతును? శత్రుజయంబు వింతయే?

అయినా, ఏదో చెప్పవచ్చినది చెప్పుము. దేవీ! ఎవఁడు వాఁడు?

మండో—నిఖిలవానరచక్రసమేతుఁడై నసుగ్రీవుఁడు తోడుగాఁ దమ్మునిం గూడి వచ్చుచున్నరాముఁడు.

రావ—ఆక్షుద్రతాపసుఁడా? రాణీ! వాఁ డేమిచేయును? ఆకోఁతు లేమి చేయును? ఇందుకు భయమేల?

మండో—మహారాజా! కోట్లకొలఁదిసైనికులు వచ్చుచుండఁగా మనస్సు శంకింపదా? అది గాక రాముఁడు సముద్రతీరమున సేన నిలిపి సముద్రుని బిలిచినాఁడఁట. కాని, యతఁడు దగ్గఱకు వెళ్ళ లేదఁట. అపుడు శ్రీరాముఁడు కోపగించి యొక్కబాణము విడువఁగా సకలజలచరంబులు దానివేఁడి కోర్వలేక యుడికిపోవుట చూచి సముద్రుఁడు భయపడి వెళ్ళియాసాహసికుని కాళ్ళ మీఁదఁ బడి మార్గము తెల్పెనఁట.

రావ—(నవ్వి) ఆమార్గ మెట్టిది?

మండో—అయ్యో! నవ్వుచున్నారా? ఆవానరు లందఱు కొండలు తెచ్చిసముద్రమున కడ్డముగా సేతువు కట్టినారఁట!

రావ—నీ కెవఁడో నమ్మకము పుట్టునట్లు చెప్పినాఁడు. దేవీ! సముద్రములోఁతు సామాన్యమా? గట్టు కట్టినారంటే యెట్లు నమ్మ

నావు? జంబూద్వీపాదిసప్తద్వీపములలో నున్నకొండ లన్నియుఁ దెచ్చి పడవేసినా దానిపొట్టలో నొకమూలకు రావుగదా! వాఁడేమో సాహసికుఁ డనుచున్నావు గాని నాసాహసముమాట మఱచిపోయినావా? నాకంఠరక్తముతోఁ గాళ్ళు కడిగి, ఆనంద బాష్పము లొలుకుచున్న నాముఖపద్మములతో నేను జేసిన పాదపూజకు సంతోషించినయాశివుఁడు నాసాహస మెఱుఁగును. దానిముందట వీనిసాహస మెంత?

మండో—అట్లు కాదు మహారాజా! ఎవఁడో యొకవానరునిచేతితోఁ బడవేసినపర్వతము లట్లే నీటిలోఁ దేలియున్న వఁట.

రావ—(తల యూఁచి) ఆడవాళ్ళమూఢవిశ్వాసమునకు హ ద్దెక్కడ?

చ. ఎఱుఁగును బ్రహ్మనాచదువు నింద్రుఁ డెఱుంగు మదీయశాసనం
బెఱుఁగును ధైర్యముం గులిశ మెల్లజగంబు లెఱుంగు మద్యశం
బెఱుఁగు సితాద్రి బాహుబల మే మని చెప్పుదు? నింక సాహసం
బెఱుఁగు మహేశ్వరుం డెఱుఁగవే యివి యెల్ల? చెలీ! తలంకు దే?

(తెరలోఁ గలకలము)

మండో—నాథా! రక్షించు రక్షించు.

రావ—దేవీ! భయపడకు.

(మరలఁ దెరలో) లంకాద్వారపాలకు లగురాక్షసులారా!

ఉ. ద్వారము లెల్ల మూసి యినుపగుగడెల్ బిగియించి సర్వమా
హారపదార్థ మాయుధము లన్నియు సిద్ధముచేసి దాఁచి దే
వేరులఁ బిల్లలన్, సుభటవీరులు మీరును గోట గావుఁడీ!
చేరఁగవచ్చె రాఘవుఁ డశేషబలంబులతోడఁ బోరికిన్.

ప్రతీహారి—(నేపథ్యాభిముఖముగ నిలిచి) దేవా! సేనానాయకుఁ డైనప్రహస్తుఁ డేదో విన్నవింప వచ్చియున్నాఁడు.

రావ—రానిమ్ము.

ప్రతీ—చిత్తము (వెళ్ళును)

ప్రహ—(ప్రవేశించి) ఆహా! ఆమానవబాలునిప్రతాప మెంతయద్భుతము! సముద్రము దాటివచ్చి లంకాపుర మంతయు ముట్టడించెఁగదా! ఎంత సేన? దాని కంతము కనఁబడదే! (సమీపించును!

రావ—సేనానీ! ఆకలకల మేమి?

ప్రహ—(తనలో) ఇతని కిప్పటికిని తెలివి రాలేదు. కానీ! ముఖ్యవిషయము తెలిపెదను (ప్రకాశముగా) దేవా! మనభటులు భక్తియుక్తులై సర్వవిధములఁ బురరక్షణమునకుఁ బాటుపడుచున్నారు.

రావ—ఎందు కని—

ప్రహ—(తనలో) ఇంకా మఱపులోనే యున్నాఁడు. (ప్రకా) దేవా) రాముఁడు కపిసేనాయుక్తుఁడై వచ్చి లంకముట్టడించెను గాదా!

ప్రతీహారి—(ప్రవేశించి) ఒకవానరుఁడు శ్రీరామునిదూత నని వచ్చి వాకిట నున్నాఁడు.

రావ—రానిమ్ము.

ప్రతీ—(వెళ్ళి, అంగదుని దీసికొని వచ్చును)

అంగ—(సమీపించి) లంకేశ్వరా; జయము.

రావ—నీవు సుగ్రీవునియనుచరుఁడవా?

అంగ—కాను.

రావ—మ తెవఁడవు?

అంగ—రావణా! నే నెవఁడనో, ఎందుకు వచ్చినానో, చెప్పెద వినుము

గీ. ఎల్లరాక్షసకులము దహింప వచ్చి
నట్టిరామునిదూత నే నంగదుండ,
జానకిని వీడి రామలక్ష్మణులకాళ్ళు
పట్టుకొన రమ్ము, లేకున్నఁ బ్రాణ మిమ్ము.

రావ—(నవ్వుచు) వానరుఁడు కూడా వక్త యైనాఁడోహో!

అంగ—నే నెవఁడ నైతే నేమి? నీవుమాత్రము నిజము గ్రహింపుము చాలును.

రావ—(కోపముతో) ఎవఁడు రా! అక్కడ? ఈకుష్టునినోటికి బుద్ధిచెప్పు.

ప్రహ—దేవా! వీఁడు దూత కదా!

రావ—వీని నో రణఁచుట యే యాబైరాగికి ప్రత్యుత్తరము

అంగ—(కోప మభినయించి) ఓరీ రావణా!

గీ. రాఘవునిదూత నైతిని బ్రతికి తీవు,
కానిచో అంపములఁ బోలు నానఖముల
పదితలలు గిల్లి యిప్పుడ పదిదెసలకు
బలి యొసంగక యుండునే? పరమనీచ!

(అని మొగిరి పోవును)

రావ—అడవికోఁతులచేష్టల కడ్డ మేమి? (అని నవ్వును)

ప్రహ—దేవా! ఆజ్ఞకోస మెదురుచూచుచున్నాను.

రావ—ఇంకా వేఱేయాజ్ఞ యేమిటి?

గీ. సకలసాధనములతోడ సర్వబలము
పాలికలని కేఁగవలె నొక్కపూన్కితోడ,
నరకుమారులదర్పు మణఁపవలయు
గోఁతఁ బెట్టంగవలె నెల్లకోఁతిపిండు.

ప్రహ—దేవరయాజ్ఞ (నిష్క్రమించును)

(తెరలోఁ బెద్దగోల, మఱియు)

ఉ. కొట్టిరి వానరాధిపు లకుంఠితవీర్యులు రాక్షసావళిన్,
గట్టిరి పెద్ద వేదికలు కర్బురనాయకమస్తకంబులన్,
గుట్టలు గుట్టలై పడియెఁ గుంజరవాజిబలంబు, కూలఁగాఁ
గొట్టిరి రాళ్ళు ఉవ్వి పురగోపురముల్ పలుదిక్కులం బడన్

రావ—(పైకిఁ జూచి) ఏమీ! నాకపురవాసులు మైమఱచి రామపక్ష పాతంబున నాపై మచ్చరము చూపుచుఁ బ్రేలుచున్నారా? దేవీ! నీవు లోపలికి వెళ్ళుము. నే నిపుడ రణరంగమున కేగి,

గీ. కొన్నిబుజముల వానరకోటి నణఁచి
కొన్నిటను రాము లక్ష్మణుఁ గూలఁగొట్టి
కొన్నిట నన్నరు నోటమి కోరునట్టి
వేల్పులను బట్టుకొని చెఱఁ బెట్టువాఁడ

(వికటముగా నడచుచు నిష్క్రమించును)

[అంత సపరివారుఁడై రథారూఢుఁ డైనయింద్రుఁడును
సూతుఁ డగుమాతలియుఁ బ్రవేశింతురు]

మాత—దేవా! ప్రళయకాలాబ్ధిఘోషంబుమాడ్కి వినవచ్చిన లంకా పురరాక్షసులసందడి చూడఁగా రావణుఁడు యుద్ధమునకు వచ్చు చున్నాఁ డని తోఁచుచున్నది.

ఇంద్రు—అదుగో! పుత్త్రమిత్రాది సకలరాక్షససమేతుఁడై పౌల స్త్యుఁడు పురము వెలువడెను. (శబ్దశ్రవణ మభినయించి) ఉత్తర దిక్కునుండి విమానముమీఁద వచ్చుచున్నాఁ డెవఁడు వీఁడు?

మాత—(చూచి) నీవు గంధర్వరాజ్యమున నిల్పినచిత్రరథుఁడు.

చిత్ర—(ప్రవేశించి) దేవనాయకా! జయము.

ఇంద్రు—ఏమోయి గంధర్వరాజ! యుద్ధము చూడఁ గోర్కి పుట్టినదా?

చిత్ర—అదే కాదు, మఱి యొకటి కూడా—

ఇంద్రు—అ దేమి?

చిత్ర—అలకాధీశ్వరునియాజ్ఞ

ఇంద్రు—ఏ మని?

చిత్ర—పుట్టినది మొదలుగా నాకు మనోవ్యథ కలిగించుచున్నదుశ్శీ లుఁడు ముల్లోకములను బాధించుచున్న పాపాత్ముఁడు నేఁటితో

సరి యని తోఁచుచున్నది. అయినా, మనయదృష్ట మెట్లుండెనో! రణరంగమున కేగి చూచి రమ్మని పంపెను.

ఇంద్రు—వంశములోనివారు కూడా యిట్లే కోరుచున్నారు.

చిత్ర—అయ్యా! ఇది చిత్రము కాదు. సహజన్మలకు వైరము సహజమే కదా! కుబేరునిపుష్పకమును నిధులను రావణుఁ డపహరించుట యెవరికిఁ దెలియదు? వానిచే బాధ పడనిజంతు వెక్కడ నున్నది? అందుకే లోకము లన్నియు నేకగ్రీవముగా శ్రీరామునిజయమును రావణునినాశనమును గోరుచున్నవి. ఇది చిత్రమా?

ఇంద్రు—(అటు చూచి) చిత్రరథా! సువేలాద్రిమీఁదివానరులయలజడి చూడఁగా రావణుఁడు బాణపరంపర బరపుచున్నాఁ డని తోఁచుచున్నది.

చిత్ర—సందేహ మేమి? పర్వతోపమాన మైనయరదంబున నుండి వాఁడు జ్యానాదంబున దిగంతరాళము బధిరముఁ గావించుచున్నాఁడు.

ఇంద్రు—సూతా! నేను, చిత్రరథునిరథ మెక్కెదను. మనరథము గొనిపోయి రామభద్రుని కిమ్ము. (అని తా నట్లు చేయును—)

మాత—(రథముతో నిష్క్రమించును.)

చిత్ర—దేవరాజా! రావణుని రణరంగావతరణ మెంత యపూర్వముగా నున్నదో చూచితివా?

చ. వెనుకను దల్లివంకరణవీరులు, ముందు బలాధినాథులున్,
దనయులు నూర్వు రింద్రజి ప్రధానుఁడు గా నొకప్రక్క, నిద్రమ
త్తునఁబడు కుంభకర్ణుఁడును దోర్బలశాలి నిశాటు లొక్కప్ర
క్కను, గనుపట్ట నొప్పుదశకంఠుఁడు వింధ్యముఁ బోలు తేరిపై.

ఇంద్రు—గంధర్వరాజా! అటు చూడుము. రావణుఁ డింతబలముతో నెదిరింప వచ్చినను, రాఘవుఁడు చెక్కు చెదరక జయలక్ష్మి కెదురుచూచుచు నెట్లుండెనో! అది యుక్తమే.

గీ. అతిభయంకర మేని ఝంఝానిలంబు
కులగిరులు దానివడికిఁ జంచలము లగునె?
అమితగాంభీర్యమహిమంబు లంబునిధులు
దానివడి కించుకయు వేల దాఁటునొక్కొ?

చిత్ర—సురరాజా! ముందు సుగ్రీవుఁడు వెనుక నంగదుఁడు కుడిప్రక్క జాంబవంతుఁ డెడమప్రక్క విభీషణుండు వెలయ మాతలి గొనిపోయినరథం బెక్కి మహావీరాగ్రేసరుం డగురఘురాముఁడు రణరంగంబున నెట్లు విరాజిల్లుచుండెనో చూచి యానందింపుము. ఆప్రక్కఁ జూచితివా? హనుమదాదివీరసహాయుఁడై లక్ష్మణుండు మేఘనాదుమద మణంప విల్లు ప్రయోగించుచుండె.

ఇంద్రు—చిత్రరథా! సుగ్రీవుఁడు కుంభకర్ణునికిఁ బట్టువడియు వానిముక్కు చెవు లూడఁబెఱికి తప్పించుకొనిపోయెఁ జూచితే?

చిత్ర—పురందరా! ఇటు వీక్షింపుము.

గీ. మేఘనాదుని గదియు సౌమిత్రి యేగ
సతనియనుజశతం బడె యుద్ధవచ్చెం.

ఇంద్రు—బళిర! లక్ష్మణునునిశితబాణశతము
కంటివే? వారికంఠముల్ కత్తిరించె.

చిత్ర—ఔరా! పుత్త్రవాత్సల్యము! వాసవా! కాంచితివా?

చ. తనయులపాటు చూచి పరితాపము పట్టఁగ లేక లక్ష్మణుం
డునుముదు నంచుఁ గిన్కవడితోఁ జనఁబోయినరాక్షసేంద్రు మా
ర్గాని రఘుపుంగవుండు పదకోలలతోఁ బదిమస్తకంబులుం
దోఁకినసైత్రుకాలువలఁ దోఁగఁగఁ గొట్టి మరల్చె నుద్ధతిన్.

ఇంద్రు—చిత్రరథా! అక్కడ రామరావణులు, ఇక్కడ సౌమిత్రి మేఘనాదు లొక్కమాఱు ద్వంద్వయుద్ధము లారంభించిరి. ఇదే చూడఁదగినఘట్టము. ఆహా! ఏమిశరాసారము! ఆకాశ మంపవాన గురియుచున్న ట్లుండె.

చిత్రి—చిత్రము చిత్రము పురుహూతా!

గీ. భావిలంకాధిపతి గుట్టు బయటఁ బెట్ట
నాంజనేయుండు సుగ్రీవుఁ డంగదుండు
కోటికి తోఁకలతోఁ గొట్టి గోళ్ళఁ ద్రుంచి
కూల్చి గుట్టలు పెట్టిరి కోణపాళి.

ఇంద్రు—ఆహా ప్రమాదము!

గీ. ఇంద్రజి త్తేసినట్టినాగేంద్రపాశ
మణఁచె రామానుజుఁడు గారుడాస్త్రమహిమ,
దశముఖుఁ డంత వచ్చి శతఘ్ని విసరి
యతని మూర్ఛిల్లఁ గొట్టె దురాత్ముఁ డకట!

స్మృతి తెలియుక హనుమంతునితొడపై నున్న తమ్ముని మూర్ఛ విభీషణునివల్లఁ దెలిసి కరుణవీరములమూర్తియై యుతనిఁ జూడ వచ్చుచున్నరాముని గుంభకర్ణాదు లడ్డగించిరి చూచితివా?

చిత్రి—అయితే నేమి? తగినశాస్తి యైనది.

గీ. త్రిపురరాక్షసులను సంహరించినట్టి
రుద్రుఁ డన నుగ్రుఁడై రామభద్రుఁ డదిగో
కీలుకీలున నొక్కొక్కకోల గ్రుచ్చి
కుంభకర్ణుని నేలపైఁ గూల్చి వచ్చెఁ.

(అటుచూచి) ఆహా! ఏ మాసోదరప్రేమ? తమ్ముని జూచి రాఘవుఁడు నతనియవస్థం బడె. (కదనరంగము పరికించి) ఔనౌ! ఇది కీడులో మేలు. రావణుఁడు సపరివారుఁడై కుంభకర్ణమరణంబునకు విల

పించుచు నందు పడియుండె. (మరల నటుచూచి) అకటా! ఇప్పటి కిని రామలక్ష్మణు లట్లె పడియుండిరి. నీచు లైనరాక్షసవీరు లిదే సమయ మని పైఁబడినఁ బ్రమాదముగదా! దైవ మెట్లు న్నదో!

ఇంద్రు—గంధర్వరాజా! ఎందుకు సందేహించెదవు? చూడు.

గీ. ఇంతలో నెప్పు డెచ్చటి కేగినాఁడొ
వాయువేగంబు దిగఁద్రొక్కి వాయుసుతుఁడు
ధరణిధర మొకఁడు వాలబద్ధంబు గాఁగ
నాకసము పాయులగునట్లు లరుగుదెంచె.

చిత్ర—దేవనాయకా! సంతోషము సంతోషము. చూడు.

చ. కలువలు చంద్రికాంతి కినకాంతికిఁ బద్మము నాత్మబోధనం
బులకు భవాబ్ధిమగ్నులు నపూర్వవికాసము గాంచునట్లు, ని
ర్మలతరభక్తిమూర్తి హనుమంతుఁడు తెచ్చినకొండగాలికిన్
దెలివిని జెంది రిద్దఱును, దివ్యమహామహిమంబు లోషధుల్!

(దక్షిణముగాఁ జూచి) అఁడుగో లంకేశ్వరుఁడు వేల దాఁటినసముద్రము మాడ్కి సేనాతరంగములతోఁ బొంగిపొరలి రామునిమీఁదికి వచ్చుచున్నాఁడు. (విమర్శించిచూచి) ఏమో కాని, పెక్కండ్రు రాక్షసవీరులు రావణమేఘనాదుల గణింపకున్నారు. (మరల లక్ష్మణునివంక చూచి) ఆహా! ఓషధీమహత్త్వము?

గీ. సానపట్టినమణి, కుబుసంబు విడుచు
త్రాఁచు, నొఱ దూసినట్టియుద్ధంపుఁగత్తి
మబ్బుతెర దీసినట్టిగ్రీష్మంపుసూర్యుఁ
డనఁగ సౌమిత్రి మిసమిస లాడుచుండె.

(నిరూపించి) అదిగో కపిరాక్షససేనలు కలియఁబడినవి. సూర్యోదయ కాలమందు వెలుఁగునకుఁ జీఁకటికి నెంత యంతర ముండునో, అంత భేద మీ రెంటికిఁ గనవచ్చుచున్నది.

క. ప్రతిబింబంబు నిశాచర
పతి సంగరరంగమందు వగ్గుచునుండన్,
ప్రతిబింబంబును వానర
పతి వేడుక మీఱఁ బెరిగి తనరుచునుండెన్.

ఇంద్రు—గంధర్వరాజా! రెండుచోట్ల మహాద్వంద్వసంగ్రామ మారంభమైనది.

ఉ. రాముఁడు రావణుండు, మఱి రావణి లక్ష్మణుఁడో జ ద్వంద్వసం
గ్రామజయాభిలాష యధికంబుగ, నేర్చినయస్త్రశస్త్రవి
ద్యామహిమంబు తేటపడ, నంతకు నంతకు హెచ్చు మచ్చరం
బేమని చెప్ప? నంపజడి సెల్లెడ ముంచుచునుండి రెంతయున్.

చిత్ర—దేవరాజా! చూడుము రామలక్ష్మణులయమోఘశరపాటవము. మూఁడులోకములు పట్టనిరక్కసు లంద ఱొక్కనిముసములోఁ బొలికలని కొక్కప్రక్కకైనఁ జాలక పడిపోయిరి. ఆహా సృష్టి మహిమ?

ఇంద్రు—చిత్రరథా! రావణుని కొకతల తెగిపోవ నింకొకతల పుట్టుచున్నది. రామబాణము నఱికినతలనే మరల నఱుకుచున్నది. ఇ దెంతచిత్రమో చూడుము. (తెరలో) రామచంద్రా! ఈయుపేక్ష యెంతసేపు? ఇదంతయు నొక్కయస్త్రమున సమాప్త మగు మార్గ మాలోచింపుము.

గీ. విశ్వ మంతయు వేడ్క, విభీషణుండు
దైత్యరాజ్యంబు, తాపసోత్తములుశాంతి,
నీవు సీతను, గాంచంగ నేర్పు మీఱ
నంపుమీ నాకమునకు లంకాధినాథు

చిత్ర—(విని) దివ్యర్షిపుంగవులు రావణిరావణులవినాశమునకుఁ ద్వరపడుచున్నారు. పాపనాశ మెవరు వాంఛింపరు? (సంతోషముతో) అమరేంద్రా! ఆశ్చర్యమాశ్చర్యము! ఆనందమానందము.

గీ. రామలక్ష్మణమహిమ లేమనఁగవచ్చు
పఱికె బ్రహ్మాస్త్ర మసురాధినాథుతలల
నీల్గె నారాయణాస్త్రాన నింద్రజిత్తు,
సురలు దశరథపుత్త్రులశిరములపయిఁ
బూజచేసిరి నందనపుష్పములను.

ఇంద్రుడు—(తెరవంకఁజూచి) గంధర్వరాజా! నిఖిలభువనకంటకుఁ డైన రావణుఁడు రణనిహతుఁ డైన వార్త తెలిసి సంతోషము పట్టఁజాలక మహోత్సవంబు సలుపఁ బూని కాఁబోలు నాకై యెదురుచూచుచున్నారు. నేను వారిమనోరథంబు నెఱవేర్ప నేగెదను. నీవు గూడ వేగము వెడలి యీవార్త మనప్రియమిత్రుఁ డగుకుబేరున కెఱిఁగింపుము.

(అని పరిక్రమించి యందఱు నిష్క్రమింతురు)

ఇది షష్ఠాఙ్కము.

105

ఓం నమః పరబ్రహ్మణే

# మహావీరచరిత్ర నాటకము

## సప్తమాఙ్కము

[ తరువాత విచారించుచున్నలంక ప్రవేశించుచున్నది ]

లంక—హా! దశకంధరా! త్రైలోక్యవీరలక్ష్మీసమాలింగితకంధరా! హా! సకలరాక్షసపరిపాలకా! వశీకృతలోకపాలకా! హా పశుపతిపాదపీఠోపాయనీకృతముఖపుండరీకా! కైకసీపుత్త్రతిలకా! నిన్నెక్కడ చూతు మహారాజా!! హా కుమార కుంభకర్ణా! హా వత్స మేఘనాదా! ఎక్కడున్నారు నాతండ్రులారా! అయ్యో! ఒక్కఁడైనా పల్కఁ డేమి? ఛీ పాడుదైవము!—దైవ మేమి చేసినది? చేసికొన్నపాపము చేసినది (దుఃఖించును)

అలక—(ప్రవేశించి) ఔరా! రాక్షసేశ్వరుఁ డిట్లు దురవస్థపాలయ్యెనా? ఎంత చిత్రము? ఒక్కక్షణములో నిశాచరసృష్టి విభీషణమాత్రశేష మైనది. (శబ్దశ్రవణ మభినయించి) నాచెల్లెలు లంక భర్తృవియోగమునకు విలపించుచున్నది (సమీపించి) సోదరీ! ఊఱడిల్లుము.

లంక—(చూచి) అక్కా! వచ్చినావా? (ఏడ్చును)

అలక—ఊఱడిల్లుము. లోకయాత్ర యిట్టిదే

లంక—అక్కా! నాకు శాంతి యెట్లు కలుగు నమ్మా! పుర మంతా స్త్రీమయము, రాక్షసవంశము పేరు చెప్పి విభీషణుఁ డొక్కఁడు మిగిలియున్నాఁ డని విన్నానుగాని, అయితే నేమి, వాఁడు శత్రుపక్షములోఁ జేరినవాఁడు.

అలక—అట్లనవద్దు. అది శత్రుపక్షము కాదు.

లంక—అదెట్లు కాదమ్మా!

అలక—రాముఁ డెవరికి శత్రువో వారు పోయినారు. వారితో, ఆవైరము పోయినది. ఇపుడు లోకైకబాంధవుఁ డైన శ్రీరాముఁడు మనకు మిత్రుఁడే.

లంక—(ఊఱడిల్లి) అతఁ డంత మంచివాఁ డైతే, యింతపని చేసినాఁ డేమి?

అలక—ఎప్పుడొక నట్లుగా మాటాడెద వేమి? అయితే విను.

గీ. తమ్ముఁ డొక్కఁడు తోడుగాఁ దండ్రియాజ్ఞ
నడవి కేతెంచినట్టియయ్యనఘమూర్తి
నితఁడు పెట్టిన బాధ లన్నిన్ని గావు,
వాటిఫల మిది, పాపంబు దాఁటఁ దరమె?

లంక—ఊఁ ఉ!! ఈమాట లనడానికి వచ్చావా, అమ్మా?

అలక—అట్లు కాదు. వినుము చెల్లీ! గంధర్వరాజువల్ల నిచ్చటివార్తలు తెలిసి యక్షేశ్వరుఁడు తనసవతితల్లికొడుకు మరణమునకు విచారించి, తక్కినచుట్టాలను బరామర్శ చేయుటకును, విభీషణుని రాజ్యాభిషేకము చూచుటకును, రావణుఁ డపహరించిన తన పుష్పకము శ్రీరామచంద్రునకు చెప్పినట్లు చేయుటకును నన్నుఁ బంపెను.

లంక—ఆహా! మహేశ్వరమిత్రుఁ డైన ధనేశ్వరుఁడు కూడా రామభద్రునే గౌరవించుచున్నాఁడా?

అలక—ఇందులో నాశ్చర్య మే మున్నది?

గీ. బ్రహ్మవిష్ణుమహేశ్వరభావ మైన
యట్టిపరతత్త్వ మేక మనాదినిధన
మదియె శ్రీరాముఁడై భూమి నవతరించె,
శిష్టులను బ్రోవ, దుష్టుల శిక్షచేయ.

లంక—అయితే, నాస్వామి రాక్షసేంద్రుఁ డీమాట యెఱుఁగకుండునా?

అలక—శాపవశమున నతని కా తెలివి పోయినది.

( తెరలో, కలకలము )

ఇద్దఱు—(భయముతో విందురు) (మఱలఁ దెరలో)

ఓత్రిజగద్వాసులారా! సావధానముగా వినండి.

గీ. అగ్నిలోఁ జొచ్చి వచ్చినయువనిపుత్రి
నీమహాసాధ్విఁ గైకొను రామ!యనుచుఁ
గర్మసాక్షిందువసువులు గనుచు నుండ
సీత నర్పించుచుండె శచీప్రియుండు.

అలక—ఔరా! రావణగృహమున నుండుటచేఁ గలుగుశంక నివర్తించుటకై సీతయగ్నిప్రవేశము చేసి వచ్చిన దనుచు దేవతలుకూడా యభినందించుచున్నా రెంతవింత?

క. పాతివ్రత్యమయం బగు
జ్యోతికి వేఱొక్కజ్యోతిశుద్ధి యొసఁగె నం
చీతఱి విపవచ్చెఁ గటా!
సీతయుఁ బెఱకాంత లట్లు చేయఁగ వలసెన్.

లంక—(ధ్వనిశ్రవణ మభినయించి) మంగళవాద్యముతోడిపాట వినబడుచున్న దెక్కడ?

అలక—(తెరవంకఁ జూచి) జానకీపరిశుద్ధి నభినందింపవచ్చినయప్సరసలును దేవర్షులును గీతికలు పాడుచున్నారు. శ్రీరామునియానతిని గృతాభిషేకుఁ డగువిభీషణుఁడు పుష్పకమును ముందు నడపించుచు రామభద్రునివద్దకు వచ్చుచున్నాఁడు. ఇఁక మన మటుపోయి మహామహిమసంపన్నుఁడైనయామహానుభావుని గన్నులు పవిత్రములుగఁ గనుగొందము రమ్మా. (నిష్క్రమింతురు)

ఇది విష్కంభము

[అంతఁ బుష్పకం బనువిమానముతో విభీషణుఁడు ప్రవేశించును]

విభీ—రామభద్రునియాజ్ఞ నెఱవేర్చితిని. కారాగృహముల నున్నసుర లోకకాంతల నందఱిని విడిపించితిని, పాపము! కన్నీటిధారల యానవాళ్ళతోడి చెక్కిళ్ళను జడలుకట్టినశిరోజములును మాసిన కోకలును ముఱికిపట్టినమేనులును గలవా రందఱు నిపు డానంద ముతో నాత్మనగరంబున కరుగుచున్నారు (సమీపించి) రామ భద్రా! జయము జయము. నీసెలవుప్రకారముచేసితిని. ఇదిగో, పుష్పకము సిద్ధము. అప్రతిహతగమనంబును వశవర్తియు నగు నిది మనోరథము ననుసరించి వర్తించుచుండును.

రాము—లంకేశ్వరా! మేలు. సంతోషము. (ప్రక్కకుఁ జూచి) మిత్రమా సుగ్రీవా! ఇక్కడ మన మిఁకఁ జేయవలసిన దేమి?

సుగ్రీ—గీ. భువనకంటకకులము నిర్మూలమయ్యె,
నవనిజనయాపవాదంబు నంతరించె
వెలసె లంకేశుఁ డగుచు విభీషణుండు
దేవకాంతలు చెఱఁ బాసి దివికిఁ జనిరి.

ఇఁకనో, ద్రోణాద్రిఁ దెచ్చినహనుమంతునివల్ల నిచ్చటివృత్తాంతము గొంత తెలిసినకుమారభరతుఁడు మనసు చెడియుండును గావున ముం దతనికి విజయవార్త దెలుప మారుతినే పంపఁదగును.

రాము—అది మంచియాలోచన (అట్లు చేయును)

సుగ్రీ—రఘువీరా! ఈవిమానరాజ మధిష్ఠింపుము.

రాము—(అట్లు చేయును)

అందఱు—(విమాన మెక్కుట నటింతురు)

సీత—(లక్ష్మణునితో) ఇపుడు మన మెక్కడికి?

లక్ష్మ—దేవీ! మనరాజధాని యగునయోధ్యకు.

సీత—వనవాససమయము సమాప్త మయ్యెనా?

లక్ష్మ—నేటితో సరి.

అందఱు—(విమానగమనము నిరూపింతురు)

సీత—(అద్భుతముగా) ఆర్యపుత్త్రా! ఈదక్షిణదిక్కున దూరముగాఁ గనఁబడుచున్నవిశాలము లైననల్లనిభూభాగము లెక్కడివి?

రాము—అవి భూభాగములు కావు. ఈశ్వరునియష్టమమూర్తియు నపరిచ్ఛేద్యగాంభీర్యము నగుసముద్రము.

సీత—ఓహో! సూర్యవంశములోనిసగరపుత్త్రులు నిర్మించిన దని పెద్దలు చెప్పుచున్నసాగర మి దేనా? దీనినడుమఁ దెల్లనిబట్ట పఱచినట్లు పొడుగుగాఁ గనఁబడుచున్న ద దేమిటి?

లక్ష్మ—గీ. కపిబలంబులు పుడమిపైఁ గలమహీధ్ర
శిఖరములు తెచ్చి కట్టినసేతు విదియ
శాశ్వతంబైన సద్యశస్స్తంభ మనఁగ
నిలుచు మాయన్నపేర నీజలధియందు.

రాము—(వ్రేలితోఁ జూపుచు) వత్సా! మలయాద్రిపై నుండి క్రిందికిఁ బ్రవహించుసెలయేళ్ళఁ జల్లనైనయావనప్రదేశములను గుర్తుపట్టితివా?

లక్ష్మ—ఔనన్నా! వాటికి దగ్గఱనే, ఆపెద్దగుహ చూచితివా? దిక్కులు గుభిల్లనఁ జేయుభయంకర మైనయుఱుములతో కన్ను మిఱుమిట్లు గొలుపుమెఱుపులతో పెద్దగాలితో వన మంతయు గాఢాంధకారమయ మగునట్లొక్కరీతి గా విడువకుండ వాన కురిసినయొకరే యందు గడపినాము కాదా!

సీత—(తనలో) అయ్యో! దురదృష్టవంతురాల నైన నాకోస మీమహానుభావు లంత శ్రమపడినారు కదా!

విభీ—రామభద్రా! అవిగో కావేరీతీరభూములు. అందు తపస్సిద్ధులు వేదాంతవేత్తలు బ్రహ్మజ్ఞానులు నగుమహర్షులు నిత్యనివాస మొనరింతురు. అచ్చటికి దగ్గఱగానే దక్షిణదిక్కునందు లోపాముద్రతోఁ గూడియగస్త్యుఁ డుండును.

రాము—అగస్త్యాశ్రమము దాఁటినామా?

ఉ. ఎవ్వనియోగశక్తిని నదీశుఁడు నిర్జలభూమి యయ్యెనో!
ఎవ్వనియాజ్ఞ వింధ్యగిరి యిప్పటికిం దలవాల్చి యుండెనో!
ఎవ్వనికుక్షిలో దురితవృత్తి నిశాటుఁడు జీర్ణమయ్యెనో!
యవ్విబుధాళివంద్యమహిమాఢ్యు నగస్త్యు నుతింప శక్యమే?

పరమాత్మసాక్షాత్కారము గలయట్టిమహాత్ములకు నమస్కరింపకుండఁగఁ బోరాదు. (అందఱు నగస్త్యాశ్రమమువైపు చూచి నమస్కరింతురు) (ఆకాశమున) రఘుకులవీరా! జానకీవరా!

గీ. తమ్ములం గూడి శాసింపు ధరణి యెల్ల,
నీయశం బెల్లకాలంబు నిల్చియుండు,
నీదునామంబు దలఁచిన నిఖిలజనులు
నైహికాముష్మికసుఖంబు లనుభవింత్రు.

రాము—(విని) ఆమహర్షికి నమస్కరించి యాకాశవాణియనుగ్రహము నకుఁ బాత్రుఁడ నైతిని.

విభీ—దేవా రామభద్రా! అవే పంపాసరోవరతీరభూములు! చాలాకాలము నివసించిన వగుటచే నవి నాదృష్టి నాకర్షించుచున్నవి.

గీ. తావకశరంబు గూల్చినతాడు లవిగో!
వాలి కూలిన కాననవాటి యదిగో!
ఆంజనేయునిచేతిలో నవనిపుత్రి
యుత్తరీయంబు చూచిననెత్త మదిగో!

సీత—(తనలో) ఏమిటి? ఆర్యుఁడు నాయుత్తరీయమును హనుమంతుని చేతిలోఁ జూచెనా?

రాము—(స్మృతితో) దేవీ! ఆపాపాత్ముఁడు నిన్నపహరించి కొనిపోవునపుడు జాఱి క్రిందఁబడినయనసూయానామాంకిత మైననీయుత్తరీయము మాకు మొదటియానవా లైనది.

గీ. దానిఁ గనుఁగొన్నయంతమాత్రమున నాదు
కన్నుఁగవ శారదేందునికాంతి సోకెఁ
బచ్చకర్పూరపుంబొడి పైని బడియె
హృదయమందు సుధారసవృష్టి గురిసె.

సీత—(సిగ్గు నటించును)

లక్ష్మ—నాయనగారిమిత్రుఁ డయినజటాయు వాపాపాత్ము నెదిరించి పండిపోయినదేహము విడిచి యశఃకాయ మాశ్రయించిన చోటదే.

సీత—(తనలో) అయ్యో! నామూలముగా నట్టిమహాత్ముఁడు పరమ పదించెను గదా!

సుగ్రీ—దేవా! దండకారణ్యము వెనుకఁ బడుచున్నది. శూర్పణఖా కర్ణనాసికాచ్ఛేదమును ఖరదూషణాదివధయు జరిగినచోట్లు దాఁటి నాము.

సీత—(వణఁకుచు) ఇంకను రాక్షసులపేళ్ళు వినఁబడుచున్నవే!

రాము—దేవీ! భయపడకు. వాళ్ళపేళ్ళుమాత్రమే మిగిలియున్నవి. సింహా మేనుఁగులంబోలె మనలక్ష్మణుఁ డారాక్షసుల నందఱిఁ బరి మార్చెను. (గతి నిరూపించి) ఇ దేమి? విమానగమనము మాఱిన ట్లున్న దేమి?

విభీ—ఆర్యా! ఈసహ్యాద్రి మిక్కిలియెత్తు గదా! దీని కావలిదేశ మార్యావర్తము. ఈకొండ దాఁటిదానిఁ జేరుటకై పుష్పకము మధ్యమలోకసాన్నిధ్యము నించుక విడుచుచున్నది.

లక్ష్మ—మధ్యమలోక ముత్తమపురుషనివాసం బగుటఁ జూడఁదగినదే. (అందఱు విమానము పై కెగయుట చూతురు)

రాము—(చూచి, ఆశ్చర్యముతో)

గీ. మహితతేజోనిధాన మామ్నాయమయుఁడు
కర్మసాక్షి సమస్తలోకంబునక్షి

దివ్య మినకులబీజ మాదిత్య తేజ
మంత కంతకు దగ్గఱయయ్యె నహహా!

అందఱు—(అంజలి ఘటించి మ్రొక్కుదురు)

సీత—(పైకిఁ జూచి) ఆహా! పగటివేళ నక్షత్రమండలము గనఁబడు చున్నదే!

రాము—సూర్యకాంతివేఁడిమి కాఁగలేక భూమిమీఁదివారికన్నులు దూరమం దున్నయీతారకాచక్రమును జూడఁజాలవు. మన మిప్పుడు బాగా పైకి వచ్చితిమి గావున నది కనఁబడుచున్నది.

సీత—ఎంతచిత్రము! ఈనక్షత్రములు గగనోద్యానములో వికసించిన పువ్వులవలె నున్నవిగదా!

రాము—(అంతటఁ జూచి) ఇపుడు జగత్తునకు హద్దులే కనఁబడకున్నవి. మిక్కిలి దూర మగుటచే నిపుడు భూమిమీఁదియుపాధులు విస్పష్టములు గాకున్నవి గాని యంతరిక్షమండలియెల్లయుపాధు లంతట సరిగా గోచరించుచున్నవి. ఆహా! సృష్టి యనంతముకదా?

విభీ—దేవా! మాయన్న నాయెడ సోదరప్రేమ చూపినకాలమున నే నిది యంతయుఁ దిరిగి చూచినాను. సూర్యచంద్రులు బాల్యంబు గడపునట్టియాకొండ యుదయాద్రి. వారు తమవార్ధకంబు గడపు నది యస్తాద్రి.

గీ. వలుఁదతన మున్నతియు సాటి వచ్చునట్లు
వెలయు కైలాస మంజనాచలము చూడు,
చందనంబునఁ గస్తూరి నందమైన
యవనికాంత యురోజంబు లనఁగ నొప్పు.

మఱియు నీప్రక్క చూడు మదిగో కాంచనాచలము. దాని వెనుక నున్న ప్రదేశము నే నెన్నఁడు చూడలేదు.

రాము—(అంతటఁ జూచి యాశ్చర్యముతో) ఆహా! జగమంతయు నొక్కమాఱుగా దృగ్గోచర మగుచున్నది.

సీత—ఆహా! ఆ కనఁబడున దేమి? ఎప్పుడు నట్టిది కని యెఱుఁగను. మనుష్యుఁడు కాఁడు, మృగము కాదు.

రాము—దేవీ! అది తురగముఖ మైనకిన్నరమిథునము. కిన్నరస్త్రీపురుషులు తఱుచుగా నిట్టిచోట్లనే విహరించుచుందురు.

విభీ—ఆజంట మనవైపు వచ్చుట చూడఁగాఁ గుబేరుఁడు పంపె నేమో యని తోఁచుచున్నది.

(తెరలో) రవికులదీపా రామచంద్రా! అలకాధీశ్వరుని యానతి శిరసా వహించి నిన్నుఁ గీర్తింప సాకేతపురమునకు బయలుదేఱిన మాకుఁ బ్రయాణముహూర్తబలమున నాఁడుఁబోయినతీర్థ మెదురైనట్లు నీదర్శనము దారిలోనే లభించినది. పరాధీనత గూడా యొకప్పుడు మేలుకొఱకే యగును. పురాణపురుషా! పురుషోత్తమా! దివ్యతేజోఽభిరామా! రఘురామా! (అనుచుఁ బ్రదక్షిణనమస్కారము గావింతురు)

అందఱు—(సంతోషముతో నటుచూతురు)

కిన్నరుఁడు—(మరలఁ దెరలో)

గీ. పరమావతార! యోగీ
శ్వరమానసహంసమానసా! జగదీశా!
శరణాగతవత్సల! దా
శరథీ! నీకీర్తి సర్వజగముల వెలయుఁ.

కిన్నరి—(అట్లే తెరలో)

గీ. ధరణి యెందాఁక శేషునితలల నిలుచు
గ్రహము లెందాఁక వెలుఁగు నాకాశమందు,
జగతి నందాఁక నీకీర్తి జనకపుత్త్రి!
దేవమానవకోటి నుతించుచుండు.

సీతారాములు—(సిగ్గు నటింతురు)

అందఱు——పరమసంతోషము. సీతారాములకు జయము.

రాము——లంకేశ్వరా! చిరకాలము తిరిగినచోటు గావున మన కడ్డము కలుగఁబోదు. ఇక్కడినుండి మధ్యమలోకమునకు దాపుగాఁ బోవుట యుచితము.

విభీ——దేవా! గంగాప్రవాహపవిత్రములు కర్పూరఖండోజ్జ్వలంబులు తపోయోగనిష్ఠానిలయంబులు నైన యీహిమవన్నగపాదంబులు ద్రష్టవ్యములు.

లక్ష్మ——ఆర్యా! ఈపరిసరభూము లతిమనోహరములై కంటిని బట్టి వదల కున్నవి.

రాము——(చూచి స్మృతితో) వత్సా! ఇవి మనగురువు విశ్వామిత్రుఁడు సంచరించినతపోవనములు. ఇక్కడనే కుశధ్వజునితోఁ గొంత సేపు మాటాడుచు వారికి మనము లాలనీయులమై బాల్యలీల చూపితిమి.

సీత——(తనలో) ఇదేమి? చిన్నాయనగారిమాట వచ్చినది.

(అన్నివైపులు చూచును)

రాము——లంకేశ్వరా! గురుజననివాసప్రదేశములందు మనము విమాన మెక్కి పోవుట ధర్మము కాదు.

(తెరలో) ఓరామలక్ష్మణులారా! భగవంతుఁ డగు విశ్వామిత్రుఁ డాజ్ఞాపించుచున్నాఁడు.

ఇద్దఱు——(విమానము నిలిపి) శ్రద్ధగా వినుచున్నాము.

(తెరలో) వసిష్ఠమహర్షి మీరాక కెదురుచూచుచున్నాఁడు. ఎక్కడ నాఁగవద్దు. తిన్నగా సాకేతమునకుఁ బొండు. నేనును మాధ్యాహ్నికకృత్యము గావించుకొని గడియలో వచ్చెదను.

ఇద్దఱు——గురువులసెలవుప్రకారము చేసెదము. (విమానమునడచును)

రాము——ఆహా! ఆమహాత్ముని వాత్సల్యము! తపస్స్వాధ్యాయములకు యుక్తమైనయీసమయమునఁ గూడ మనయందలియనుగ్రహ

మున నయోధ్యకు రాఁదలఁచెను గదా! సర్వసము లగుసంయమీంద్రుల కది స్వభావము. తపోవనమందలి తరుమృగంబులను గూడ నాదరముతోఁ జూచెడి యామహానుభావులు భక్తు లగు మనుష్యులయెడఁ బ్రేమ చూపుదురన్న నాశ్చర్య మేమి? మనము సూర్యవంశమున జన్మించితిమి గాని, శస్త్రాస్త్రవిద్యావిజ్ఞాన మంతయు మన కీమహానుభావునివల్లఁ గలిగినదే కదా!

విభీ—ఏమిది? మంచు కురిసినట్లు భూపరాగంబు నలుదెసలఁ గ్రమ్ముచున్నది.

అందఱు—(ఆశ్చర్యముతోఁ జూతురు)

రాము—హనుమంతునివల్ల మనరాక తెలిసికొని భరతుఁడు ససైన్యముగా మన కెదురువచ్చుచున్నాఁ డని తలఁచెద.

హను—[ప్రవేశించి] దేవా! నమస్కారము.

గీ. నారబట్టలు శ్రీరామనామజపము
జడలు భూశయ్య రాజలక్ష్మములు గాఁగ
ధరణిఁ బాలించుచున్నమీభరతుఁ డఁడుగో
వచ్చుచున్నాఁడు సంతోషభరితుఁ డగుచు.

రాము—(ఉల్లాసముతో) చిరకాలమునకు నాయనుంగుఁదమ్ముని జూడఁగల్గితి నని యానంద ముప్పొంగుచున్నది.

లక్ష్మ—(సంతోషముతో) మారుతీ! అన్న యేఁడి?

హను—అఁడుగో! సేనకు ముందున్న మైదానముగురిలో శత్రుఘ్నునితో ముందున్నయతఁడే భరతుఁడు.

లక్ష్మ—(పరిశీలించి చూచుచున్నాఁడు)

సీత—అదేమిటి? ఎంత మాఱిపోయినాఁడో!

విభీ—విమానరాజా! ఆఁగుము. బంధువు లందఱు పరస్పరాలింగనాది సుఖ మనుభవింతురు.

అందఱు —(విమానావతరణము నటింతురు)

[అంతఁ గొందఱుమిత్రులు వెంటరా భరతశత్రుఘ్నులు ప్రవేశింతురు]

రాము—(కాళ్ళపైఁబడిన భరతుని లేవ నెత్తి) తమ్ముఁడా! నిన్నుఁ గౌఁగిలించి బ్రహ్మానందసాక్షాత్కారమైన ట్లానందించుచున్నాను.

లక్ష్మ—(భరతుని కాళ్ళకు మ్రొక్కి కౌఁగిలించును)

శత్రు—(రామలక్ష్మణులపాదములపైఁ బడి మ్రొక్కును)

ఇద్దఱు—(తమ్ముని లేవనెత్తి దీవింతురు)

భర-శత్రు—తల్లీ! నమస్కారము (అనుచు సీతకు సాష్టాంగవందనమాచరింతురు)

సీత—కుమారులారా! మీయన్నలకుఁ బ్రియు లగుదురుగాక.

రాము—తమ్ములారా! మే మాపత్సముద్రము దాఁటుటకు నావ లైన మహాత్ములీవిభీషణసుగ్రీవులు (వారిని జూపును)

భర-శత్రు—(వారిని గౌఁగిలించి గౌరవింతురు)

భర—అన్నా! కులగురువైన వసిష్ఠులవారు సకలాభిషేకసంభారములతో నీరాక కెదురుచూచుచున్నారు.

రామ—(తనలో) విశ్వామిత్రులవారింకను దయచేయలేదు గురువులు కనిపెట్టుకొనియున్నారు (ప్రకాశ) సరే. గురువు లాజ్ఞాపించినట్లే చేయుదము. (అందఱు పరిక్రమింతురు)

[అంతఁ గౌసల్యాకైకేయీసుమిత్రలతో నరుంధతియు వసిష్ఠుఁడును బ్రవేశింతురు.]

వసి—(తనలో) గీ. దయయు సత్యంబు ధర్మంబు తనువు దాల్చి
నట్టిపుణ్యాత్ముఁ డీరాముఁ డనుచు జగతి
వినుతి కెక్కినపరమాత్మ వేదవేద్యుఁ
గన్న లారంగఁ గంటి భాగ్యంబు గాదె?

ఔరా! ఈ మహాత్మునికి నేను గురుఁడనా! అయినను లోకయాత్ర ననుసరింపక తప్పదు. (ప్రకాశ) కౌసల్యాసుమిత్రలారా!

ఇద్దఱు — గురువుగారిసెలవు.

వసి — మీకొడుకులు సుఖముగా నిల్లు చేరుట చూచినారు కదా!

ఇద్దఱు — ఇది మీయాశీర్వచనప్రభావము.

అరుం — (కైకేయిని జూచి) కోడలా! అట్లున్నావేమి?

కైకేయి — అమ్మా! మంథరచే వరము లడిగించి కుమారుల నడవికి బంపించినానని లోకాపవాదము పాలై క్రుంగుచున్నాను. ఆపిల్లల మొగమెట్లు చూతును?

అరుం — అమ్మాయీ! నీవు తప్పు చేసినట్లు వచ్చిననింద సరిగాదు. ఆవిషయము మీగురువుగారపుడే యోగదృష్టిని దెలిసికొని యున్నారు.

అందఱు — ఎట్లు, ఎట్లు?

అరుం — మాల్యవంతునిదురాలోచనమునుబట్టి శూర్పణఖ మంథరా రూపము దాల్చి యట్లు చేసెనని.

అందఱు — అకటా! రాక్షసులదుష్టత్వ మింటిలో నున్నస్త్రీలనుగూడ బాధించినదిగదా! (విచారము చూపుదురు)

వసి — ఈమంగళసమయమున విచారము తగదు. రాక్షసులమాట తల పెట్టవద్దు.

రాము — (వసిష్ఠుని జూచి) ఈయన పూజ్యులైనగురువర్యులు. ఈమహాత్ముని జూచినంత హృదయము కరఁగుచున్నది-తమ్ముఁడా! ఇటు ఇటు.

రామ-లక్ష్మ — (సమీపించి) గురూత్తమా! రామలక్ష్మణులు పాదాభివందన మాచరించుచున్నారు.

వసి — నీతిధర్మజ్ఞానపురస్కృతంబై మీదృష్టి వెలయుఁగాక.

రా-ల — ధర్మధాత్రీ! నమస్కారము.

అరుం — ఇష్టార్థసిద్ధి యగుఁగాక.

రా-ల—తల్లులారా! వందనములు.

అందఱు—(కౌఁగిలించుకొని) కుమారులారా! మీమెడ మాకోర్కులు ఫలించుఁగాక.

సీత—గురువరా! నమస్కారము.

వసి—అమ్మా! వీరమాతవై విలసిల్లుము.

సీత—సాధ్వీమతల్లీ! వందనము.

అరుం—(సీతను గాఁగిలించి) అనసూయయు లోపాముద్రయు నేనును, ఇంతకు మున్ను పతివ్రతలలో గణన కెక్కితిమి. ఇపుడు నీవు నాల్గవదాన వైతివి. వర్ధిల్లు వర్ధిల్లు.

సీత—అత్తలకు నమస్కారములు.

ముగ్గురు—కుమారీ! కొడుకులతల్లివై వర్ధిల్లుము.

(తెరలో)

చ. పరిచరులార! మీపనులు భద్రముగా నొనరింపఁ జూఁడుఁడీ!
పురజనులార! చిత్తములు పొంగఁగ నుత్సవ మాచరింపుఁడీ?
త్వరపడి యాభిషేచనికవస్తువు లన్నియుఁ గూర్పుఁడీ ధరా
మరవరులార! కౌశికునిమాట సుఁడీ యిది యెల్లవారికిన్.

వసి—(విని) ఆహా! కుమారునియదృష్టము! శ్రీరాముని సింహాసనమునఁ గూర్చుండఁబెట్టి స్వయముగా నభిషేకము చేయుటకు విశ్వామిత్రమహర్షి విజయంచేసె.

అందఱు—మహానందము.

విశ్వా—(సశిష్యుఁడై ప్రవేశించి)

చ. అమలినవర్తనున్ దశరథావనినాథుని గోరి రాము నా
శ్రమమునఁ జేర్చి యాగవిధి చక్కఁగఁ దీర్చి, తలంచినట్టి కృ
త్యము నెఱవేఱఁజేసినది దైవగతిన్ ఫలియించె, నింక రా
జ్యమునఁ గుమారు నిల్పిహృదయంబు సుఖింపఁగ శాంతి నొందెదన్.

(అని పరిక్రమించును)

వసి—అదుగో కౌశికుఁడు. ఆహా!

గీ. సహజ మైనట్టిక్షాత్త్ర తేజంబుతోడ
బ్రహ్మ తేజంబు గూర్చినబ్రహ్మవేత్త,
అఖిలలోకోత్తరం బగునట్టిమహిమ
నలరు నీతని కద్భుతం బనఁగ లేదు.

(మహర్షి లిద్దఱు కలిసికొని యొకరి నొకరు గౌరవించుకొందురు)

విశ్వా—మునీంద్రా! ఇంకా చూచుచున్నారేమి?

వసి—నీవు వచ్చితివి. ఇంకఁ గాని త్తము.

విశ్వా—(దేవర్షులంగని రామభద్రునిమూర్ధాభిషేకమునిర్వహింపుఁడు.)

(తెరలో దుందుభిధ్వని)

అందఱు—(పుష్పవర్షము గని యానందింతురు)

వసి—పరమానందము. మహేంద్రుఁడు రామభద్రునియభిషేకమున కనుమోదము చూపుచున్నాఁడు.

రాము—[కృతాభిషేకమంగళమూర్తియై ప్రవేశించి] గురువర్యులా! వందనము వందనము.

వసి, విశ్వా—సకలసద్గుణసాంద్రా రామచంద్రా! ఇక్ష్వాకువంశరాజ క్రమాగత మైనరాజ్యభారము వహించి తమ్ములం గూడి చిర కాలంబు ధర్మపాలనం బొనరింపుము.

మునులు—తథాస్తు (అని యనుమోదింతురు)

విశ్వా—వత్సా రామభద్రా!

రాము—గురువుల సెలవు—

విశ్వా—నీయభిషేకమహోత్సవంబు గన్నారఁ గాంచి యానందించిన యీసుగ్రీవవిభీషణు లింక వారి పురంబులకుఁ బోవ ననుమ తింపుము. సంకల్పసమయనులభ మైనయాపుష్పక మిపుడు కుబేరుని జేర నానతిమ్ము.

SPECIMEN
for favour of Prescription 1959
for Examination



రాము—(అట్లు గావించును.)

విశ్వా—కుమారా! రామభద్రా!

చ. జనకునిమాట సల్పితివి, సత్యము నిల్పితి, రాక్షసాన్వయం
బును దెగటార్చి ధర్మమును బ్రోచితి, కాచితి ముజ్జగంబు, నీ
యనుజులు తల్లులున్ వధువు లాప్తులు సంతస మొంద రాజ్యల
క్ష్మిని వరియించి తీ వభిలషించెడి దే మిఁకఁ జెప్పు మేర్పడన్.

రాము—ఇంతకంటె నేఁ గోరున దేమున్నది. కాని, గురుపాదులయను
గ్రహంబున నివి కలుఁగుఁగాక.

(భరతవాక్యము)

గీ. ధర్మమతి నేలుదురుగాక ధరణి విభులు
వానలును బాడిపంటలు వఱలుఁగాక
కవులు కృతులను రచియింత్రుగాక, వానిఁ
గాంచి సంతోషపడుదురుగాక బుధులు.

(అందఱు నిష్క్రమింతురు)

ఇది సప్తమాఙ్కము

ఇది
సంస్కృతవాఙ్మయచరిత్ర సంస్కృతకవిజీవి తాంధ్రభాషానుశాస
నాంధ్రభవిష్యపు రోత్తరరామచరి తాదినాటకకర్త
యగు మల్లాది సూర్యనారాయణశాస్త్రి
యాంధ్రీకరించిన మహావీర చరిత్ర
నాటకము సర్వము.

V.R. NARLA MEMORIAL LIBRARY

★

శ్రీ చింతామణీ ప్రెస్, రాజమండ్రి.

BCI

AOUA105B110
BC

P. V. Sarma & Co.,
PUBLISHERS
ELURU. (Andhra Pradesh)

SPECIMEN

## మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపత్రిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA105B110 |
| పుస్తకం పేరు | మహావీరచరిత్రము |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 127 |
| పెద్ద సైజు పేజీలు | no |
| ఖాళీ పేజీలు | [illegible] |
| లేని పేజీలు | ~~no~~ A.B |
| తయారు చేసినది | kethura |
| పేజీలు విడదీసినది | kethura |
| స్కాన్ చేసినది | Teja |
| పరీక్ష చేసినది | anusha |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |